PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 68 | విజయవాడ, ఆదివారం 8 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 8 October 2023 | Rs

తృణ ధాన్యాల పిండిపై 5% జిఎస్‌టి

- మొలాసిస్‌పై 5% తగ్గింపు
- జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం

7

ఆసియా క్రీడల్లో భారత్‌కు107 పతకాలు

8

'సుప్రీం'ను ఆశ్రయిస్తాం

- కృష్ణా జలాలపై కేంద్ర నిర్ణయం రాష్ట్రానికి నష్టం
- జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడిస్తున్న అంబటి రాంబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'కృష్ణానదీ జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య పున: పంపిణీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రానికి నష్టం చేస్తుంది. దీనిపై త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం' అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. జలవనరులశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలకు సంబంధించి కొత్తగా విధివిధానాలను రూపొందించడానికి ఒప్పుకోమని చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ లోని సెక్షన్ 89లో ఇప్పటికే విధివిధానాలను నిర్వచించారు. కొత్తగా ఇవ్వడానికి వీల్లేదు. ఇది చట్ట విరుద్ధం. దీన్ని అంగీకరించలేం' అని అన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ హోంమంత్రి అమిత్‌షాను కలిసి వినతపత్రం స్వయంగా ఇచ్చారనిప్రధానమంత్రి మోడీకి లేఖ రాశారని తెలిపారు. అయినా గెజిట్ విడుదల కావడంతో న్యాయం కోసం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేస్తామని పేర్కొన్నారు.క్యాబినెట్ నిర్ణయం తమను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఎపికి రావాల్సిన ప్రతి నీటిబొట్టునూ తీసుకుంటామని వివరించారు. నూతన నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న వాటిని నీటి లభ్యత తగ్గుతుందన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని, రైతాంగానికి నీళ్లు ఒదించే విషయంలో రాజీపడబోమని అన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణానదీ జలాలపై వివాదాలు సుదీర్ఘకాలంగా సాగుతున్నాయని తెలిపారు. 1976లో బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డు ప్రకారమే రాష్ట్రాల నీటి వినియోగం జరుగుతోందని పేర్కొన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన 811 టిఎంసిల్లో ఎపికి 512, తెలంగాణకు 299 టిఎంసిలు కేటాయించారని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రానికి వచ్చిన ప్రతి నీటిబొట్టునూ కాపాడుకుంటామని మంత్రి తెలిపారు. అన్యాయంగా తీసుకెళతామంటే ఒక్క నీటిబొట్టును కూడా వదులుకోబోమని తెలిపారు. రాజకీయంగా అన్ని విషయాల్లోనూ కేంద్రానికి వైసిపి మద్దతు ఇస్తోందని, అయినా కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది, దీనిపై ఎలా స్పందిస్తారని మంత్రిని ప్రశ్నించగా 'అది రాజకీయ నిర్ణయం, ఇది సాంకేతిక పరమైన అంశం' అని సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి విలేకరులకు వాగ్వివాదం జరిగింది. 'ఆ రెండు పత్రికల ప్రతినిధులకు తాను సమాధానం ఇవ్వనని, ఇష్టం ఉంటే మాట్లాడతా లేకపోతే లేదని మంత్రి అన్నారు.

అఖిలపక్షం జరపండి

- సిపిఎం డిమాండ్

కృష్ణా నదీ జలాల విషయంలో గత ట్రిబ్యునల్స్ ఇచ్చిన నిర్ణయాలను పున:సమీక్ష చేయాలన్న కేంద్ర క్యాబినెట్ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టాన్ని కలిగిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఎన్నికలల్లో లబ్ధికోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కృష్ణాజలాల వివాదాన్ని ముందుకు తెచ్చి రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నదీ జలాల విషయంలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ఫైనల్ అని, దాన్ని మరలా సమీక్ష చేయడం అంటే తేనెతుట్టెను రేపడమేనని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్రాష్ట్ర నదీ జలాల విషయంలో రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సూచించారు. ఈ విషయంలో కేంద్రానికి లొంగిపోతే రాష్ట్రానికి తీరని ద్రోహం జరుగుతుందని పేర్కొన్నారు.

గాజా సిటీపై ఇజ్రాయిల్ బాంబులు కురిపించడంతో దట్టమైన పొగ, మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

ఇజ్రాయిల్ వైమానిక దాడులు

200 మందికి పైగా పాలస్తీనీయుల మృతి

- దేశం యుద్ధంలో ఉంది: నెతన్యాహు
- రక్షించుకునే హక్కు పాలస్తీనీయులకు ఉంది: అబ్బాస్
- హమాస్ తొలుత జరిపిన దాడిలో 100 మంది మృతి

రమల్లా: ఇజ్రాయిల్ పాలస్తీనాపై జరిపిన దాడిలో 200 మందికి పైగా పాలస్తీనీయులు మరణించారని, మరో 1600మందికి పైగా గాయపడ్డారు. పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ 'ఆపరేషన్ అల్ అక్సా' పేరుతో తొలుత జరిపిన ఆకస్మిక రాకెట్ దాడుల్లో 100 మంది ఇజ్రాయిలీ సైనికులు చనిపోయారు. దీనికి ప్రతీకారంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఏకంగా యుద్ధం ప్రకటించింది. ఇరు పక్షాల మధ్య ఈ స్థాయిలో భీకర దాడులు జరగడం గత యాభై ఏళ్లలో ఇదే మొదటిసారి.

గాజాలో హెల్త్ ఎమర్జెన్సీని విధిస్తున్నట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ తన మంత్రివర్గ సహచరులతోను, పిఎల్‌ఓ కార్యవర్గ సభ్యులతోను, రక్షణ దళాల ఉన్నతాధికారులతోను శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. పాలస్తీనీయుల ప్రాణాలను రక్షించేందుకు, వారిలో దృఢతాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. హమాస్ రాకెట్ దాడి గురించి ప్రస్తావిస్తూ పాలస్తీనీయులకు తమను తాము రక్షించుకునే హక్కు ఉందని అన్నారు. హమాస్ చర్యను ఇరాన్ ప్రశంసించింది. అల్‌అక్సా మసీదును ఇజ్రాయిలీ సైన్యం అపవిత్రం చేసినందుకు మిగతా 2లో

సెమినార్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు, వేదికపై పురేంద్రప్రసాద్, వి. శ్రీనివాసరావు, లక్ష్మణరావు

కేంద్రం నిర్ణయాలకు తలొగ్గితే రాష్టానికి నష్టం

- రైతుసంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రయోజనాల కోసం కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు తలొగ్గితే రాష్ట్రానికి తీవ్ర నష్టం కలుగుతుందనిఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈమేరకు శనివారం రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డిలు విడుదల చేసిన ప్రకటనలో సాగునీటి హక్కులకై రాష్ట్ర ముఖ్యమంత్రి గట్టిగా నిలబడాలని కోరారు. రైపేరియన రైట్స్ ప్రకారం నికర జలాల్లో దిగువ రాష్ట్రమైన మన రాష్ట్రానికి రావాల్సిన వాటాతో పాటు, రాయలసీమ ప్రాజెక్టులకు అవసరమైన నీటిని సాధించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. అదే విధంగా తరుగు ఉన్న సంవత్సరాల్లో దామాషా పద్ధతిలో నీటి విడుదలకు ఏర్పాటు చేసుకోవాల్సిఉందని సూచించారు. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశంపై రాష్ట్రంలోని అన్ని రైతు సంఘాలు, రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి. అభిప్రాయాలను తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇజ్రాయిల్‌కు అండగా వుంటాం : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : పాలస్తీనాలో దాదాపు రెండు వందల మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న ఇజ్రాయిల్ తాజా దాడుల ను ఇరాన్, సిరియా తదితర దేశాలు ఖండిస్తుంటే కేంద్రం లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం హమాస్ మిలిటెంట్ల దాడిని ఖండించింది. పాలస్తీనా విమోచనా పోరాటానికి మద్దతునివ్వడం భారత విదేశాంగ విధానంలో ఒక భాగంగా ఉంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇజ్రాయిల్‌తో దోస్తీ చేస్తూ, చిరకాలంగా అనుసరిస్తూ వస్తున్న విధానానికి తిలోదకాలిచ్చింది. హమాస్ మిలిటెంట్లు జరిపిన రాకెట్ దాడులకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌కు అండగా వుంటామని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ప్రకటించారు. హమాస్ చేపట్టిన అల్ అక్సా ఆపరేషన్‌ను సాకుగా తీసుకుని నెతన్యాహు పాలస్తీనాపై పెద్దయెత్తున బాంబుల వర్షం కురిపిస్తుంటే ఇజ్రాయిల్ ప్రజలకు పూర్తి బాసటగా వుంటామని మోడీ పేర్కొనడం గమనార్హం. హమాస్ దాడుల్లో 22మంది మరణించగా, ఇజ్రాయిల్ జరిపిన ప్రతీకార దాడుల్లో 200 మంది దాకా చనిపోయారు. వందలాది మంది గాయపడ్డారు.

అసమానతలు లేని అభివృద్ధి కావాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- రాష్ట్రంలో యథేచ్ఛగా ఆస్తుల లూటీ, నిధుల దోపిడీ
- రాష్ట్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు సెమినార్ ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేదలకు న్యాయం జరగాలంటే అసమానతలు లేని అభివృద్ధి కావాలని, రాష్ట్రంలో కొద్దికాలంగా పాలన పేరుతో ఆస్తుల లూటీ, నిధుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోందని, ప్రజాశ్రేయస్సు, సమాజాభివృద్ధి అనేది కనిపించడం లేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విజయవాడలోని ఎంబివికెలో రెండు రోజులపాటు జరుగుతున్న సెమినార్‌ను శనివారం రాఘవులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నయా ఉదారవాద విధానాల అమలు వేగమవుతున్న కొద్దీ పాలనలో ప్రజల సంక్షేమం బాగోగులు అనే విషయాలు పక్కకు పోతున్నాయని తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చేసిందేమీ లేదని అన్నారు. గతంలో చంద్రబాబు గానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గానీ ప్రజలకు ఎంతో చేశామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే సంక్షేమం జాడ కనిపించడం లేదని విమర్శించారు. అనేక నినాదాలు, పిలుపులు, పథకాలు ఎన్ని ఇచ్చినా ఫలాలు పేదలకు చేరడం లేదని పేర్కొన్నారు. జిఎస్‌డిపి పెరిగిందని చెబుతున్న లెక్కలేవీ రాష్ట్ర నికర అభివృద్ధికి తోడ్పడటం లేదని, లెక్కలకు మాత్రమే పరిమితం అవుతున్నాయని అన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో జిఎస్‌డిపి 9.3 శాతం ఉందని చెప్పినా, ప్రస్తుతం 7.3 శాతం ఉందని చెప్పినా అవన్నీ ఒకటీరెండు రంగాలకే పరిమితం అయ్యాయని అన్నారు. అప్పట్లో చేపల ఎగుమతి, ప్రస్తుతం ఇసుక, మైనింగు రూపంలో అభివృద్ధి మిగతా 2లో

రాష్ట్రవ్యాప్తంగా 'కాంతితో క్రాంతి'

- టిడిపి వినూత్న నిరసన

ఇ-కోర్టులు మరింత బలోపేతం

- రూ.3,108 కోట్లతో రికార్డుల డిజిటైజేషన్

• లోపలి పేజీలో..•

రాజస్థాన్‌లోనూ కులగణన

- సిఎం అశోక్ గెహ్లాట్ ప్రకటన



జైపూర్ : రాజస్థాన్‌లోనూ కులగణన నిర్వహిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్ ప్రకటించారు. జైపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ వార్‌రూమ్‌లో రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ (ఆర్‌పిసిసి) కోర్ కమిటీ కులగణన అంశంపై చర్చించింది. ఈ సమావేశంలో గెహ్లాట్‌తో పాటు రాజస్థాన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సుఖ్‌జిందర్ రాంధావా, ఆర్‌పిసిసి అధ్యక్షులు గోవింద్ సింగ్ దోతస్రా, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం శుక్రవారం సాయంత్రం గెహ్లాట్ మీడియాతో మాట్లాడారు. బీహార్ ప్రభుత్వం చేపట్టిన విధంగానే రాజస్థాన్ ప్రభుత్వం కులగణన నిర్వహిస్తుందని తెలిపారు. ఏ కులాల జనాభా ఎంత ఉందో తెలుసుకుంటే వారి కోసం మనం ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో తెలుసుకోవచ్చునని చెప్పారు. కులాల వారీగా పథకాలు సిద్ధం చేయడం ప్రభుత్వాలకు మరింత సులభతరమవు తుందని గెహ్లాట్ తెలిపారు.

నాణ్యమైన భోజనం పెట్టండి

ప్రజాశక్తి- నూజివీడు రూరల్ (ఏలూరు జిల్లా)

'నీళ్ల చారు. లావు బియ్యం అన్నం. పులిసిన పెరుగు. నాణ్యతలేని కూరలు తినలేకపోతున్నాం. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మాకు నాణ్యమైన భోజనం పెట్టండి' అంటూ నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులు శనివారం ఆ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. తమకు నాణ్యమైన పౌష్టికాహారం అందించే చర్యలు చేపట్టే వరకూ ఆందోళన విరమించేది లేదని వారు భీష్మించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమకు లావు బియ్యంతో భోజనం పెడుతున్నారని, దీంతో, అన్నం చిమిడిపోతోందని, దీన్ని తినలేకపోతున్నామని తెలిపారు. ఒక్కో విద్యార్థికీ భోజనం నిమిత్తం రూ.90 నుంచి 110 వరకూ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆ మొత్తంతో నాణ్యమైన, పౌష్టికాహారం అందించవచ్చని, కానీ కాంట్రాక్టర్ నాసిరకం కూరగాయలు, బియ్యంతో భోజనం వండి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ భోజనం తినడం వల్ల తరచూ అనారోగ్యా నికి పాలవుతున్నామని, కొన్ని సందర్భాల్లో పస్తులు ఉంటున్నామని వాపోయారు. ఇక్కడ భోజనం తినలేక తప్పనిసరి పరిస్థితుల్లో క్యాంపస్‌లో ఉన్న మరో ప్రయివేటు క్యాంటిన్‌లో భోజనం చేస్తున్నామని, దీనివల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఈ కళాశాలలో భోజనం, ఫ్యాకల్టీ సరిగా లేకపోవడం, విద్యాబోధనలో ఒత్తిడి వల్ల గతంలో 20 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరినా కనీసం పట్టించుకోవడం లేదని తెలిపారు.

నూజివీడు ట్రిపుల్ ఐటి ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ, సిపిఎం మద్దతు

విద్యార్థుల ఆందోళనకు ఎస్ఎఫ్ఐ, సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటి విద్యార్థుల సమస్యలపై పలుమార్లు ఆందోళన చేపట్టామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశామని, అయినా కనీసం పట్టించుకోలేదని అన్నారు. మెస్ నిర్వహణ సరిగా లేదని తెలిపారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

మెస్ కమిటీ ఏర్పాటుకు హామీ

విద్యార్థుల ఆందోళనతో స్పందించిన నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. భోజనశాలను పరిశీలించి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సమస్యకు త్వరలో పరిష్కారం చూపిస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భోజనం నాణ్యతపై మెస్ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కమిటీలో మెంబర్లతో పాటు విద్యార్థులు కూడా ఉంటారని ప్రకటించారు. నిత్యం మెస్‌లో ఆహారాన్ని తనిఖీ చేస్తామని, నాణ్యతా ప్రమాణాలతో భోజనం అందించేలా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో, విద్యార్థులు ఆందోళన విరమించారు.

కృపమ్మ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

- రూ. 10 లక్షలు, 2 సెంట్ల ఇంటి స్థలం, ఒకరికి ఉద్యోగం ఇస్తామని అధికారుల హామీ

• లోపలి పేజీలో..•

ఆ ఆరోపణలన్నీ బూటకం

- ఎఫ్ఐఆర్‌పై న్యూస్‌క్లిక్
- న్యాయ వ్యవస్థపై నమ్మకముందని వ్యాఖ్య

సచివాలయాల వద్ద 'జగనన్న' ఫ్లెక్సీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

" మా నమ్మకం నువ్వే జగనన్న" పేరుతో గ్రామ వార్డు సచివాలయాల్లో సంక్షేమ పథకాల బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

నాలుగున్నర ఏళ్ల పాలనలో ఆయా గ్రామవార్డు సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ఏయే ప థకాలు అందాయి? ఎంత ప్రతిఫలం పొందారు? అనే అంశాలను ఫ్లెక్సీల మీ ముద్రించి గ్రామ , వార్డు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రామ్ పూర్తయిన 10 రోజులు తర్వాత గ్రామ వార్డు సచివాలయాలను యూనిట్‌గా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకోసం నోడల్ ఆఫీసర్లు, ప్రత్యేక అధికారులను ప్రభుత్వం ఇప్పటికే నియమించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

క్రీడాకారులకు సిఎం అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో స్వర్ణం గెలుచుకోవడంలో దేశం ఆసియా గేమ్స్‌లో చరిత్ర సృష్టించిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి పేర్కొన్నారు. దేశం గర్వపడేలా స్వర్ణం సాధించిన మన రాష్ట్రానికి చెందిన సాత్విక్ సైరాజ్‌తోపాటు దేశం తరఫున పలు క్రీడల్లో పాల్గొ న్న క్రీడాకారులకు సిఎం అభినందనలు తెలిపారు. ఈ మేరకు శనివారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

సంక్షేమ పథకాల అమలులో ఎపి ప్రామాణికం

- మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే గొప్ప ప్రామాణికంగా నిలిచిందని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనా విషయంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని, ఫ్యామిలీ డాక్టర్ అనేది గతమెన్నడూ ఎరుగని విశిష్ట వైద్యవిధానమని అన్నారు. బెంగళూరులోని దక్షిణ డైలాగ్స్‌లో సౌత్ ఫస్ట్ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాలకు ఒక అభివృద్ధి నమూనా ఉందా? ఒకవేళ ఉంటే అది సరైన దారిలో ఉందా? అనే అంశంపై ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక వైద్యారోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావు, తమిళనాడు ఐటి మంత్రి పి తియాగరాజన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మాజీ సలహాదారు, ఆర్థిక వేత్త పరకాల ప్రభాకర్ మోడరేట్‌గా వ్యవహరించారు.

ఇజ్రాయిల్ వైమానిక దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతీకారంగా ఇజ్రాయిలీ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని శనివారం ఉదయం హమాస్ జరిపిన రాకెట్ దాడిలో 100 మంది చనిపోయారని, హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయిల్ భూ భాగంలోకి చొరబడి కొంతమంది సైనికులను బందీలుగావించారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కూడా దీనిని ధ్రువీకరించారు. ఇందుకు శత్రువులు భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన ప్రకటించారు. న్యాయ వ్యవస్థ అధికారాలను హరించే చట్టాన్ని తీసుకువచ్చి, రాజకీయంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు' దేశం యుద్ధంలో ఉంది' అని ప్రకటించారు. హమాస్ గతంలో ఎన్నడూ లేనంత భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఇటీవల కాలంలో పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ ఆర్మీ, సెటిలర్ గ్యాంగ్‌ల దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. పాలస్తీనా భూ భాగాల ఆక్రమణను అవి కొనసాగిస్తూనే ఉన్నాయి. దీనిపై పాలస్తీనీయుల్లో ఉన్న ఆగ్రహం, నెతన్యాహు తన అధికారాన్ని సుస్థిర పరచుకునేందుకు న్యాయ వ్యవస్థ అధికారాలను కబళించడంపై సైన్యంతో సహా ఇజ్రాయిలీయులు పెద్ద యెత్తున వీధుల్లోకి వస్తుండడం, అలాగే ఇజ్రాయిల్-సౌదీ అరేబియా మధ్య సయోధ్యకు అమెరికా యత్నాలు ఒక కొలిక్కి వస్తున్న దశలో హమాస్ ఈ ఆకస్మిక దాడికి దిగడం గమనార్హం.

అలర్ట్‌గా ఉండండి : ఇజ్రాయిల్‌లోని భారతీయులకు ఎంబసీ సూచన

ఇజ్రాయిల్ దక్షిణ ప్రాంతంలో యుద్ధం లాంటి పరిస్థితులు తలెత్తినందున భారతీయులెవరూ బయటకు రావద్దని, ఇంటిపట్టునే ఉండాలని ఇజ్రాయిల్‌లోని భారతీయ ఎంబసీ సూచించింది. హమాస్ శనివారం ఉదయం రాకెట్ల దాడికి ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ పెద్దయెత్తున వైమానిక దాడులకు దిగడంతో అక్కడి పరిస్థితి యుద్ధాన్ని తలపిస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా 'కాంతితో క్రాంతి'

- టిడిపి వినూత్న నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి నేతలు 'కాంతితో క్రాంతి' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటల నుంచి ఐదు నిమిషాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల విద్యుత్ బల్బులు ఆపేసి కొవ్వొత్తులు, కాగడాలతో 'సేవ్ ఎపి, సేవ్ డెమోక్రసీ' అంటూ నినాదాలు చేశారు. టిడిపి కార్యాలయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, నాయకులు నక్కా ఆనందబాబు, నిమ్మల రామానాయుడు, వర్ల రామయ్య, పీతల సుజాత, దేవినేని ఉమామహేశ్వరరావు, పంచుమర్తి అనురాధ, జివి ఆంజనేయులు పాల్గొన్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఢిల్లీలోని వైసిపి ఎంపి రఘురామకృష్ణరాజు ఇంటివద్ద నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి రఘురామకృష్ణరాజు పాల్గొన్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రాజమండ్రిలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్నారు.

144 సెక్షన్ వైసిపికి వర్తించదా? : అచ్చెన్న

టిడిపి కార్యక్రమాలకు వర్తించే 144 సెక్షన్ వైసిపి కార్యక్రమాలకు వర్తించదా? అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. విజయవాడలో వైసిపి నిర్వహించే భారీ సమావేశం వల్ల ఎలాంటి సమస్యలు రావని డిజిపి చెప్పగలరా? అని నిలదీశారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాము ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, శాంతియుతంగా నిరసన తెలుపుతామని లిఖితపూర్వకంగా తెలియజేస్తున్నామని చెప్పారు. అయినా తమ కార్యక్రమాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుంటూరులో అన్ని పార్టీలూ కలిసి చేపట్టిన శాంతియుత ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు మాత్రమే సెక్షన్ 30ను అమలు చేస్తారని, జగన్ నెలల తరబడి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించబోతున్నామని చెప్పారు. పోలీసుల సాయంతో ప్రజల్ని నిలువరిస్తూ జగన్ తప్పించుకుంటున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వం వ్యవస్థల్ని మేనేజ్ చేసి చంద్రబాబును అన్యాయంగా 30 రోజులుగా జైల్లో పెట్టిందన్నారు.

ఢిల్లీలో రఘురామ ఇంటి వద్ద కొవ్వొత్తులతో లోకేష్ నిరసన

టిడిపి రాష్ట్ర కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అచ్చెన్న

జగన్ ఢిల్లీకెళ్లి సాధించింది ఏమిటి? : అనురాధ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనతో రాష్ట్రానికి ఒనగూరిన ప్రయోజనం ఏమిటని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ట్రిపుల్ ఐటి నిధులు, వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 9,371 ఎకరాల్లో గంజాయి ధ్వంసం చేశామని ఢిల్లీలో జరిగిన సమావేశంలో సిఎం పచ్చి అబద్ధాలు చెప్పారని అన్నారు. రాయలసీమ ఎండిపోయేలా తీర్మానం చేస్తే కేంద్ర జలశక్తి మంత్రిని ఎందుకు కలవలేదని అన్నారు.

లేని రింగ్‌రోడ్డులో అవినీతి ఎలా జరిగింది?

- పుస్తకాన్ని ఆవిష్కరించిన టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'లేని, వేయని ఇన్నర్ రింగ్‌రోడ్డులో అవినీతి ఎలా జరిగింది' అనే పుస్తకాన్ని టిడిపి శనివారం విడుదల చేసింది. టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారంపై జగన్, వైసిపి ప్రభుత్వ వాదనంతా దుష్ప్రచారమేనని విమర్శించారు. సుర్బానా జురాంగ్, స్టుప్ అనే సంస్థలకు టిడిపి ప్రభుత్వం రింగ్‌రోడ్డు ప్రణాళికలు తయారు చేయమందని, దీనికోసం సిఆర్‌డిఎ రూ.15 లక్షలు ఆ సంస్థలకు చెల్లించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, నాయకులు వర్ల రామయ్య, నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వారికే అవసరం : పీతల

రాజకీయ కక్షతో రగిలిపోతున్న ముఖ్యమంత్రి, మంత్రులు, వైసిపి వారికే జగనన్న సురక్ష పథకం అవసరమని మాజీ మంత్రి పీతల సుజాత విమర్శించారు. వైద్య రంగాన్ని నాలుగేళ్లలో భ్రష్టుపట్టించారని ఆమె పేర్కొన్నారు. సురక్ష కార్యక్రమంలో విధులు నిర్వర్తించే సిబ్బందికే న్యాయం చేయలేని జగన్.. సాధారణ ప్రజలను ఎలా రక్షిస్తారని నిలదీశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా విధుల్లో మృతిచెందిన ఆశా కార్యకర్త కృపమ్మ మృతిపై సిఎం, వైద్యారోగ్యశాఖ మంత్రి ఎవరూ స్పందించలేదని విమర్శించారు.

టిడిపి నేతలపై లాఠీఛార్జి

- చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా గుంటూరులో భారీ ర్యాలీ
- పోలీసు ఆంక్షలను ఛేదించుకుని దూసుకువెళ్లిన కార్యకర్తలు
- ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా శనివారం గుంటూరులో టిడిపి నాయకులు ధర్మాగ్ర శాంతిర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించుకుని టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ముందుకు దూసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు, నాయకులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు.

తొలుత స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభించారు. అయితే ర్యాలీకి వచ్చినవారిని వచ్చినట్లు పోలీసులు అరెస్టు చేశారు. దీంతో తోపులాట జరిగింది. టిడిపి నాయకులను, కార్యకర్తలను నియంత్రించేందుకు దాదాపు 800 మంది పోలీసులు ప్రయత్నించారు. పోలీసులను తోసుకుంటూ టిడిపి నాయకులు, కార్యకర్తలు ముందుకెళ్లారు. దీంతో పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి నగరంలోని పలు స్టేషన్లకు తరలించారు. అరెస్టులు, నిర్బంధాలు లెక్కచేయక అంబేద్కర్ సెంటర్ నుంచి హిమనీసెంటర్ వరకు కొందరు టిడిపి నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి గాంధీవిగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. నగరంలో నెలల తరబడి సెక్షన్ 30, 144 అమలు చేస్తూ ప్రజా నిరసనను అడ్డుకోవడానికి పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. సిపిఐ, జనసేన పార్టీలు మద్దతు తెలిపాయి. ర్యాలీలో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద్‌బాబు, నన్నపనేని రాజకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ (గుంటూరు), జి.వి.ఆంజనేయులు (పల్నాడు), నగర టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పత్తిపాటి పుల్లారావును పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. పలువురు ద్వితీయ శ్రేణి నాయకులకు ముందస్తు నోటీసులు ఇచ్చారు. పలువురు జనసేన, సిపిఐ నాయకులకు కూడా నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధించారు.

ర్యాలీలో ముందుకు పరిగెడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

పారదర్శకత... తటస్థత ఎండమావులేనా?

- ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై నీలినీడలు
- మితిమీరుతున్న పాలకుల జోక్యం

న్యూఢిల్లీ : భారత ఎన్నికల కమిషన్ (ఇసి) స్వతంత్రత, పారదర్శకత రోజురోజుకూ మసకబారుతోంది. ఈసీ వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యం పెరిగిపోతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర అధికారుల నియామక ప్రక్రియ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించడం, ఈ వ్యవహారాన్ని పాలకులు పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకోవడం దేనికి సంకేతం?. ఎన్నికల సంఘంలోని వారు తమ అడుగులకు మడుగులొత్తాలని కేంద్రంలోని పెద్దలు కోరుకుంటారు. వాస్తవానికి ఎన్నికల కమిషన్ అనేది పూర్తి స్వతంత్ర సంస్థ. అయితే కొద్ది మంది మినహా మిగిలిన ఎన్నికల అధికారులందరూ పాలకుల తాబేదారులుగా వ్యవహరిస్తూ ఈసీ స్వతంత్రతను నీరుకారుస్తున్నారు.

రాజ్యాంగం ఇచ్చిన బహుమతి

ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి ప్రధాని ఇష్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. అదే వ్యక్తి ఎన్నికల అధికారిగా నియమితుడైతే సర్వ స్వతంత్రుడు. తటస్థుడు. ప్రధాని ఇష్టాఇష్టాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం లేదు. తనను కలవాల్సిందిగా ప్రధాని ఆయనను పిలవకూడదు. ఎన్నికల కమిషనర్‌ను ప్రధాని నియమించవచ్చు. కానీ ఆదేశాలు జారీ చేయకూడదు. ఆయనను తొలగించకూడదు. స్వతంత్ర ఎన్నికల కమిషన్ అనేది దేశానికి రాజ్యాంగం ఇచ్చిన బహుమతి. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం దాని విధి. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు సైతం అనేక సందర్భాలలో నొక్కి చెప్పింది. కానీ నేడు జరుగుతున్నదేమిటి?

రాజ్యాంగ ఉల్లంఘనే...

2021 డిసెంబర్‌లో ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శితో సమావేశం కావాలంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు, మిగిలిన ఇద్దరు కమిషనర్లకు ప్రధాని కార్యాలయం (పీఎంఓ) కబురు పెట్టింది. ఇది కచ్చితంగా రాజ్యాంగ ఉల్లంఘనే. విషయం ఎంత అత్యవసరమైనది అయినా, ఎంత ముఖ్యమైనది అయినా ఇలా పిలవడం తప్పు. గతంలోకి వెళితే...2006 జూన్‌లో ఖురేషీకి అప్పటి ప్రధాని ముఖ్య కార్యదర్శి పులోక్ ఛటర్జీ ఫోన్ చేశారు. ఖురేషీని ఎన్నికల కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వం భావిస్తోందని, అయితే ఐఏఎస్‌కు ఆయన రాజీనామా చేయాల్సి ఉంటుందని దాని సారాంశం. ఈ షరతు ఎందుకు విధించారో ఖురేషీకి అర్థం కాలేదు. ఎన్నికల కమిషన్‌ను ప్రభుత్వానికి, పాలకులకు దూరంగా ఉంచాలన్న రాజ్యాంగ నిబంధనను ఇది ఉల్లంఘించడం కాదా? ఆ తర్వాత ఖురేషీ ఎన్నికల కమిషనర్‌గా నియమితులు కావడం, ఆయనకు, ప్రధానికి మధ్య అడ్డుగోడలు ఏర్పడడం వేరే విషయం.

సీజేను పిలవగలరా?

సీఈసీని, ఇతర ఎన్నికల కమిషనర్లను ప్రధాని పిలవడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. ఇది ఆమోదయోగ్యం కాని చర్య. న్యాయ సంస్కరణలపై చర్చించేందుకు ధర్మాసనంలోని ఇతర న్యాయమూర్తులతో సహా హాజరు కావాల్సిందిగా భారత ప్రధాన న్యాయమూర్తిని ప్రధాని ముఖ్య కార్యదర్శి పిలవగలరా? ఒకవేళ అలా చేస్తే ఆయన కోర్టు ధిక్కరణ కేసును ఎదుర్కోవాల్సి వస్తుంది. తటస్థత, స్వతంత్రత విషయాలలో సుప్రీంకోర్టుకు, ఎన్నికల కమిషన్‌కు మధ్య తేడా ఏమీ ఉండదు. ఈ రెండూ స్వతంత్ర, రాజ్యాంగ సంస్థలే. కార్యనిర్వాహక వ్యవస్థతో సంబంధం లేనివే. సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారో, దానిలో ఏమి చర్చిస్తారో తెలియకుండా ప్రధాని ముఖ్య కార్యదర్శి ఈసీకి కనీసం ఫోన్ కూడా చేయకూడదు. రాజకీయ నాయకులు ప్రతిరోజూ పిటిషన్లు, ఫిర్యాదులు, సూచనలతో ఎన్నికల కమిషన్‌ను కలుస్తుంటారు. అయితే అదంతా పారదర్శకంగా జరుగుతుంది.

ప్రొటోకాల్ విషయానికి వస్తే ప్రధాన ఎన్నికల కమిషనర్ తొమ్మిదో స్థానంలో ఉండగా, ప్రధాని ముఖ్య కార్యదర్శి 23వ స్థానంలో ఉన్నారు. మరి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఉన్నత స్థాయి వ్యక్తిని ఓ అధికారితో జరిగే సమావేశానికి హాజరు కావాలని ఎలా పిలుస్తారు? చట్టపరమైన, రాజ్యాంగ పరమైన వ్యవహారాలలో ప్రభుత్వానికి సలహాలు ఇచ్చే న్యాయ మంత్రిత్వ శాఖకు ఈ విషయం తెలియదా?

ముందుకు సాగని సంస్కరణల ప్రక్రియ

మన్మోహన్ ప్రభుత్వంలో న్యాయ శాఖ మంత్రిగా పనిచేసిన వీరప్ప మొయిలీ ఒక రోజు ఖురేషీకి ఫోన్ చేశారు. 'మీరు ఎన్నికల సంస్కరణల గురించి ప్రస్తావిస్తున్నారు. మీరు నా కార్యాలయానికి టీ తాగడానికి ఎందుకు రాకూడదు? వస్తే సంస్కరణలపై చర్చిద్దాము' అని సూచించారు. ఈ ఆహ్వానాన్ని ఖురేషీ తోసిపుచ్చారు. పైగా ఈసీ కార్యాలయానికి రావాల్సిందిగా మొయిలీనే ఆహ్వానించారు. దీనికి ఓకే చెప్పిన మొయిలీ ఆ మర్నాడు నలుగురు అధికారులతో కలిసి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లారు. అయితే కేవలం మూడు గంటలు చర్చిస్తే ఒరిగేదేముంటుంది? ఆ తర్వాత కూడా సంప్రదింపులు కొనసాగాయి. సంస్కరణలు కార్యరూపం దాల్చే సమయానికి మొయిలీని వేరే మంత్రిత్వ శాఖకు మార్చారు.

జాతీయ ఏకాభిప్రాయం కోసం మొయిలీ ప్రయత్నిస్తున్న తరుణంలో ఆయనను మార్చి సల్మాన్ ఖుర్షీద్‌ను న్యాయ శాఖ మంత్రిగా నియమించడంపై నిరసన తెలుపుతూ ప్రధానికి ఖురేషీ ఫోన్ చేశారు. అయితే దీనిని మన్మోహన్ తేలికగా తీసుకున్నారు. ఆందోళన చెందవద్దని, మొయిలీ మొదలు పెట్టిన పనిని ఖుర్షీద్ ముందుకు తీసికెళతారని చెప్పారు. ఆ తర్వాత ఖుర్షీద్ ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లి చర్చలు జరిపినప్పటికీ సంస్కరణల ప్రక్రియ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

ఇవన్నీ స్వయంగా ఎలక్షన్ కమిషన్ మాజీ చీఫ్ ఎస్‌వై ఖురేషీయే చెప్పడం గమనార్హం. ఆయన రాసిన "ఇండియాస్ ఎక్స్‌పర్మెంట్ విత్ డెమోక్రసీ : ది లైఫ్ ఆఫ్ ఏ నేషన్ త్రూ ఇట్స్ ఎలక్షన్స్" అనే పుస్తకంలో ఇలాంటి విషయాలనేకం చెప్పారు.

ఎన్నికలకు ముందు ప్రధాని కార్యాలయ ముఖ్య కార్యదర్శితో పీఎంఓలో కానీ, ఈసీ కార్యాలయంలో కానీ సమావేశం కావడం అనేక అనవసరపు అనుమానాలకు తావిస్తుంది. దేనిపై చర్చించారో ఎవరికి తెలుసు? ఎన్నికల తేదీల పైనా లేదా మరే విషయం పైనా? ఇలాంటి ఉదంతాలు పునరావృతం కావడం మంచిది కాదు.

సాగర్ నుండి కుడి కాలువకు విడుదలవుతున్న నీరు

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

ప్రజాశక్తి- విజయపురి సౌత్ (పల్నాడు జిల్లా)

తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జునసాగర్ జలాశయం కుడి కాలువ 4వ గేటు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీహరి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలువ ద్వారా పల్నాడు, ప్రకాశం జిల్లాలకు పది రోజుల పాటు నీటి విడుదల కొనసాగనుందని తెలిపారు. గంటగంటకూ నీటి విడుదల పరిమాణాన్ని పెంచుతామన్నారు.

తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేస్తున్న ఈ నీటిని రైతులు సాగునీటికి వినియోగించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో కుడి కాలువ డిఇ మురళీధర్, ఎఇ బాబుమియా తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు

సత్యం మాస్టారు కన్నుమూత

- నేడు విశాఖలో అంత్యక్రియలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక విలేకరి, శ్రీకాకుళం ప్రతినిధి

సత్యం మాస్టారు

శ్రీకాకుళం జిల్లాకు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కొల్లి సత్యనారాయణ (84) శనివారం రాత్రి విశాఖలోని కెజిహెచ్‌లో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. విశాఖ పెదవాల్తేరులోని తన మనుమరాలి ఇంట్లో కొద్దిరోజులుగాఉంటున్నారు. శుక్రవారం రాత్రి అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. శనివారం సాయంత్రం వరకూ అక్కడే చికిత్స పొందారు. అయినా, పరిస్థితిలో పెద్దగా మార్పు లేకపోవడంతో విశాఖ కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి 9.30 గంటలకు సత్యనారాయణ తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం, సమైక్య అపార్టుమెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు సంతాపం ప్రకటించారు. సత్యం మాస్టారి సంతాప సభ ఆదివారం 9 గంటలకు విశాఖ జిల్లా గాజువాక సమీపంలోని తోకాడ సమైక్య అపార్టుమెంట్ వద్ద జరగనుంది. అనంతరం అక్కడి నుంచి అంతిమయాత్ర బయలుదేరి చినగంట్యాడ వరకూ సాగనుంది.

ఉద్యమ ప్రస్థానం

సత్యం మాస్టర్‌గా అందరికీ పరిచయమైన కొల్లి సత్యనారాయణ తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో 1940 మార్చి 20న జన్మించారు. వ్యవసాయ శాఖ ఉద్యోగిగా శ్రీకాకుళం జిల్లా మందస వచ్చారు. తర్వాత పలాస మండలం బొడ్డపాడు స్కూల్‌లో ఉపాధ్యాయునిగా చేరారు. 1961 ఉమ్మడి కమ్యూనిస్టులో చేరారు. ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న సరోజినిని 1964లో ఆయన ఆదర్శ వివాహం చేసుకున్నారు. చౌదరి తేజేశ్వరరావు, పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి తదితరులతో పార్టీలో కలిసి పనిచేశారు. బొడ్డపాడులో పనిచేస్తున్న సమయంలో ఉద్దానం ప్రాంతంలో సాగుతున్న శ్రీకాకుళం గిరిజనోద్యమం వైపు వెళ్లారు. ఉద్యోగం కోల్పోవడంతోపాటు 1968 నుంచి 74 వరకూ ఆరేళ్లపాటు జైలులో నిర్బంధించబడ్డారు. ఆ తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు. ఎమర్జెన్సీ కాలంలో మళ్లీ 19 నెలలు జైలులో నిర్బంధించబడ్డారు. మందస ప్రాంతంలో సిపిఎం, ట్రేడ్ యూనియన్ నిర్మాణానికి కృషి చేశారు. 1991లో సిపిఎం శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సోంపేటలో పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. తనకున్న పరిచయాలతో మందస, బారువ, బూరగాం, మామిడిపల్లి ప్రాంతాల్లో జనాలను కూడగట్టి పార్టీ నిర్మాణానికి విశేష ప్రయత్నం చేశారు. 1998లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికై సిపిఎంకు సేవలందించారు. అనారోగ్య కారణాలతో 2014లో జిల్లా కమిటీ నుంచి ఆయన రిలీవ్ అయ్యారు

కుటుంబ నేపథ్యం

భార్య సరోజిని ఉపాధ్యాయినిగా ఉంటూ యుటిఎఫ్‌లో పని చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత ఐద్వా జిల్లా కార్యదర్శిగా మహిళల సమస్యలపై ఆమె పోరాడారు. సత్యం మాస్టర్‌కు అజేయకుమారి, విజయకుమారి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్నమ్మాయి, అల్లుడు మరణించారు.

నేటి తరం కమ్యూనిస్టులకు ఆదర్శం

కమ్యూనిస్టు విలువలు, పని పద్ధతుల విషయంలో సత్యం మాస్టర్ నేటి తరం కమ్యూనిస్టులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన చివరి వరకూ సైద్ధాంతిక నిబద్ధతతో పార్టీ కోసం పని చేశారు. చివరి వరకు నిరాడంబర జీవితాన్ని గడిపారు.

'ఉక్కు'పై మోడీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొడతాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నుతోన్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 968వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎల్ఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు జోలికి వచ్చిన బిజెపి ప్రజాగ్రహానికి గురై భవిష్యత్తులో ఓడిపోవడం ఖాయమన్నారు. పోరాటాలతో సాధించుకున్న రూ.లక్షల కోట్ల విలువైన ప్రభుత్వరంగ సంస్థలను తమ అనుయాయులకు మోడీ సర్కారు కట్టబెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ వ్యాప్తమైందని తెలిపారు. అన్ని తరగతుల నుంచీ తమ పోరాటానికి విశేష మద్దతు దక్కుతోందన్నారు. దీక్షలో పోరాట కమిటీ నాయకులు గోపి, సత్యనారాయణ, ఎల్‌వి.రమణ, త్రినాథ్, భాస్కర్, సుబ్బరాజు, గణేష్ పాల్గొన్నారు.

'దేశ స్వావలంబనకు కీలకం రైతు వ్యవసాయం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాఘవులు, వేదికపై కృష్ణయ్య, పురేంద్రప్రసాద్, వి శ్రీనివాసరావు, లక్ష్మణరావు, గఫూర్, ఎన్ వేణుగోపాలరావు, ప్రభాకరరెడ్డి

అసమానతలు లేని అభివృద్ధి కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉందని అన్నారు. అభివృద్ధిలో కీలకమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో మెరుగుదల లేదని తెలిపారు. పక్క రాష్ట్రాలకు ప్రత్యక్ష విదేశీ నిల్వలు బిలియన్లలో వస్తుంటే రాష్ట్రానికి మిలియన్లలో మాత్రమే వస్తున్నాయన్నారు. 2021లో దేశంలోకి 7,400 కోట్ల డాలర్లు పెట్టుబడులు వస్తే మన రాష్ట్రానికి అందులో 8.5 కోట్ల డాలర్లు మాత్రమే వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ నేపథ్యంలో సామాన్యులు, ప్రజలకు జీవనోపాధి కల్పించే విధంగా అభివృద్ధి ఉండాలని, దీనికోసం సిపిఎం కృషి చేస్తోందని అన్నారు.

ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి ముఖ్యమా సంక్షేమం ముఖ్యమా అనే చర్చ నడుస్తోందని, అభివృద్ధి అనేది సమగ్ర దృక్పథంతో సాగాలని, సంక్షేమం అందులో భాగమని అన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్లలో ఒక్కపరిశ్రమ కూడా రాలేదని, ఇటీవల జరిగిన పెట్టుబడుల సమ్మిట్లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నారని, అవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయని అన్నారు. భూములు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, ఆచరణలో వాటిని బ్యాంకుల్లో కుదువపెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుని ఎగ్గొడుతున్నారని ఆగ్రహించారు. మరోవైపు సాగు విస్తీర్ణమూ తగ్గుతోందని, అటు పరిశ్రమలు రాక, ఇటు వ్యవసాయమూ లేక రాష్ట్రం దెబ్బతినిపోతోందని పేర్కొన్నారు. రైతు భరోసా నిధులు దేనికీ సరిపోవడం లేదని, చివరకు అప్పుల పాలైన రైతులు ఆత్మహత్య చేసుకునేందుకు అవసరమైన పురుగు మందు కొనుగోలుకు మాత్రం సరిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి మూడు రోజులకు ఒక కౌలు రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్రం కౌలు రైతులను గుర్తించడం లేదని, ఆంధ్రప్రదేశ్లో వ్యవసాయం అంటే ప్రధానంగా కౌలు రైతులేనని అన్నారు. ఈ నేపథ్యంలో ఒక సమగ్ర ప్రాతిపదికన అభివృద్ధి జరగాలని, దీనికోసం సిపిఎంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు రచించిన దేశ స్వావలంబనకు కీలకం రైతు వ్యవసాయం అనే పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు. ఈ సభలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వక్తలను వేదిక మీదకు ఆహ్వానించి సదస్సును సమన్వయం చేశారు. ఎనిమిది అంశాలపై వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులు ఈ రెండు రోజుల సెమినార్లో పాల్గొంటున్నారు.

ఫైబర్‌నెట్ కేసులో యనమల !

- ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫైబర్ గ్రిడ్ కేసులో ఇప్పటికే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేరు బయటకు వచ్చిందని, నాటి ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు కూడా ఈ కేసులో ఉండే అవకాశాలు లేకపోలేదని ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ పి గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని ఎపి ఫైబర్‌గ్రిడ్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో మాజీ మంత్రి నారా లోకేష్ పాత్ర ఉందా లేదా అనేది తను చెప్పలేనన్నారు. టెరాసాఫ్ట్ పాత్ర లేకపోతే ఇక్కడ అసలు కుంభకోణమే లేదన్నారు. ఈ కేసుకు ఎపి ఫైబర్‌నెట్ రూ.7 కోట్ల షేర్ క్యాపిటల్ ఉందని, కంపెనీ ఆస్తుల విలువ రూ.3,586.22 కోట్లకు చేరిందన్నారు. రూ.627 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ కోసం ఆర్ఇసి హడ్కో నుంచి రూ.450 కోట్లు లోన్ తీసుకుందని, రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ నుంచి రూ.300 కోట్లు లోన్ తీసుకుంటామన్నారు. రూ.1,145.10 కోట్లతో సిసి కెమెరాల ప్రాజెక్టు చేపట్టి హోమ్ డిపార్టుమెంట్‌కు లీజుకు ఇవ్వనున్నట్లు గౌతమ్‌రెడ్డి తెలిపారు. షేర్ క్యాపిటల్ వ్యాల్యూ రూ.రెండు వేలకోట్లకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 1.50 కోట్ల కనెక్షన్లు ఇచ్చే కెపాసిటీ తమకు ఉందన్నారు.

ఎసిబి వలలో రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-కమలాపురం (కడప జిల్లా)

కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని వీరపునాయునిపల్లె రెవెన్యూ కార్యాలయంపై ఎసిబి అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.30 వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, విఆర్‌ఒ మునికృష్ణ పట్టుబడ్డారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎసిబి ఎఎస్‌పి దేవిప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీరపునాయునిపల్లె మండలం వెల్దుర్తికి చెందిన శేఖర్ అనే రైతు ఆరు ఎకరాల చుక్కల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడానికి 2012 నుండి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. భూమి ఆన్‌లైన్ చేయాలంటే రూ.50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టంలేని శేఖర్ ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎసిబి అధికారుల వ్యూహం మేరకు శేఖర్ నుంచి లంచం తీసుకుంటుండగా డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌ఒలను పట్టుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో సిఐలు అలీ, శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నివాసమున్న చోటే పట్టాలివ్వాలి

ఇళ్ల స్థలాల పేరుతో నగరానికి దూరంగా తరలించి నయా మురికివాడలు సృష్టించొద్దు

విజయవాడ సెంట్రల్ 'సిపిఎం ప్రజాపోరు పాదయాత్ర' ప్రారంభోత్సవంలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విజయవాడ

పేదలకు వారు నివాసముంటున్న చోటే పట్టాలివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల పేరుతో వారిని నగరానికి దూరంగా తరలించి నయా మురికివాడలను సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ధనికులను నగరాల్లో, పట్టణాల్లో ఉంచి పేదలకు ఊళ్లకు దూరంగా పంపడం పేదల పట్ల వివక్ష చూపడమేనన్నారు. విజయవాడ సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటరులో శనివారం సెంట్రల్ నియోజకవర్గ స్థాయి 'సిపిఎం ప్రజాపోరు పాదయాత్ర' ప్రారంభమైంది. ఈ యాత్రను కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానుల నడుమ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పేరుతో భూ కుంభకోణాలకు పాల్పడడం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకోవడం తప్ప అబివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి దృష్టిలేకుండా పోయిందని విమర్శించారు. దశాబ్దాల తరబడి పేదలు నివాసం ఉంటున్న గృహాలకు పట్టాలివ్వకుండా, అందుబాటులో ఉన్న స్థలాలను పేదలకు పంపిణీ చేయకుండా, ఎక్కడో నగరానికి సుదూరంగా, పేదలను వెలివేసినట్లు వివాదాస్పద భూముల్లో స్థలాలిచ్చినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. పేదలు నివాసం ఉంటున్న ఇళ్లకే రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలను పంపిణీ చేయాలని, ఏళ్ల తరబడి పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధాని సమీపంలోని విజయవాడ ప్రాంతంలో అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్లంటూ గొప్పలు చెప్పుకోవడం మినహా నగరంలో

పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, రాష్ట్ర నాయకులు డి.కాశీనాథ్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు తదితరులు

ప్రధాన, అంతర్గత రహదారులను, వంతెనలను, డ్రెయినేజీలను అభివృద్ధి చేయడంగానీ, కొత్తవి నిర్మించడంగానీ చేయలేదని విమర్శించారు. నగరంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది వామపక్షాల పాలనలోనేనని గుర్తు చేశారు. కొండలపై నివసించే వారికి బూస్టర్ల ద్వారా నీటి సరఫరా చేయడం, విద్యుత్, రహదారులు, వంతెనలు తదితర అనేక రూపాల్లో విజయవాడ అభివృద్ధి జరిగిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు నగరానికి ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. ఈ పాదయాత్రకు నేతృత్వం వహిస్తోన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడిగా ఉన్న సెంట్రల్ ఎంఎల్ఎ మల్లాది విష్ణు విజయవాడ నగరాభివృద్ధికి ప్రణాళికలు వేయలేదుగానీ అవినీతి, అక్రమాలకు మాత్రం ప్రణాళికలు రచించారని విమర్శించారు. గుణదల ఫ్లైఓవర్, సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్, వంతెనలు, ఆర్‌యుబిలు, డ్రెయినేజీ తదితర సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. తొలి రోజు 58, 61 డివిజన్లలో పాదయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎండి.ఇంతియాజ్

సాహిత్యం పాత్ర గొప్పది

- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో సాహిత్యం పాత్ర చాలా గొప్పదని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్ఎండి.ఇంతియాజ్ అభిప్రాయపడ్డారు. 'సలీం సాహిత్యం- సామాజిక చైతన్యం' అనే అంశంపై కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ.. డబ్బు సంపాదనే విజయానికి పరమావధి కాదని, ఇతరులకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని సలీం సాహిత్యం రుజువు చేసిందని తెలిపారు. ఐఆర్ఎస్ అధికారిగా అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌టాక్స్ స్థాయికి చేరుకున్న సయ్యద్ సలీం లాంటి వ్యక్తి ఇంతటి విస్తృతమైన సాహితీ రచనలు చేయడం అభినందనీయమన్నారు.

కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రాజావేద్ మాట్లాడుతూ.. సలీం స్ఫూర్తితో విద్యార్థి దశ నుండే అందరూ రచనలు చేయడం ప్రారంభించాలని కోరారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజామిల్ మాట్లాడుతూ.. వైవిధ్య భరితమైన అంశాలు తీసుకొని ప్రతి పాఠకుడిని చదివింపచేసే విధంగా సలీం నవలలు రచించారని తెలిపారు. రచయిత సయ్యద్ సలీం మాట్లాడుతూ.. తాను బాల్యంలో అత్యంత పేదరికాన్ని అనుభవించానన్నారు. శారీరక వైకల్యంతో మరొక సవాలు ఎదుర్కొన్నానని, వీటన్నింటినీ అధిగమించే శక్తి నాకు విద్య అందించిందని తెలిపారు. పరిశోధనా పత్రాలను సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సదస్సులో సమర్పించారు. కళాశాల తెలుగు విభాగ అధ్యక్షులు అన్వర్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు ఆచార్యులు వెలుదండ నిత్యానందరావు, అధ్యాపకులు జె సునీత, కె అరుణాదేవి, విమర్శకులు కెపి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఫలించిన ఆశా వర్కర్ల పోరాటం

- కృపమ్మ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- రెండు సెంట్ల ఇంటి స్థలం, ఒకరికి ఉద్యోగం ఇస్తామని అధికారుల హామీ

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా), అమరావతి బ్యూరో

ఆశా వర్కర్ల పోరాటం ఫలించింది. తాడేపల్లి ముగ్గురోడ్డుకు చెందిన రేపూడి కృపమ్మ శుక్రవారం విధులు నిర్వహిస్తూ పని ఒత్తిడి వల్ల మరణించిన విషయం విదితమే. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన దిగిన వారిని పోలీసులు అరెస్టు చేయడంతో ఆశా వర్కర్స్ యూనియన్ శనివారం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. దీంతో, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఆశా వర్కర్లు

ఆందోళన విమరణలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి

ఆందోళనలకు దిగారు. విధులు బహిష్కరించి నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. తాడేపల్లి పట్టణం, మండలంలోని ఆశా వర్కర్లు విధులకు గైర్హాజరై కృపమ్మ ఇంటికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిఐటియు నాయకులు కె.ఉమామహేశ్వరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, డి.శ్రీనివాసకుమారి, డివి భాస్కరరెడ్డి, ఎస్.ముత్యాలరావు, వై.బర్నబస్ తదితరులు ముగ్గురోడ్డు చేరుకుని మృతురాలి కుటుంబానికి అండగా నిలిచారు. ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతున్న క్రమంలో కృపమ్మ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇస్తామని, రెండు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి అందులో ఇంటిని నిర్మిస్తామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎంటిఎంసి కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహశీల్దార్ ఎం.నాగిరెడ్డి, డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి ప్రకటించారు. దీంతో, ఆందోళన విరమిస్తున్నట్లు కె.ధనలక్ష్మి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు తమ పోరాట పటిమ చూపారని అభినందించారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో ఇవ్వడం, మట్టి ఖర్చులకు రూ.25 వేలు ఇవ్వడం జరగలేదని, ఎక్స్‌గ్రేషియోతోపాటు గ్రూపు ఇన్సురెన్సు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 40 రకాల యాప్‌లతోపాటు ఉద్యోగానికి సంబంధంలేని పనులు కూడా ఆశా వర్కర్లతో పని చేయించడం మానుకోవాలన్నారు. కృపమ్మ మృతికి కారణమైన ఇద్దరు మెడికల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ పని జరగకపోతే ఈ ప్రాంతంలో ఆశా వర్కర్లు విధులు బహిష్కరిస్తారని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులకు ఖండన

అక్రమంగా శుక్రవారం అరెస్టు చేసి పలు స్టేషన్లకు తరలించిన వారిని పోలీసులు శనివారం వదిలిపెట్టారు. దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌లో సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ అక్రమ అరెస్టులను ఖండించారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిఐటియు

కృపమ్మ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తోన్న ఆశా వర్కర్లపై దాడి చేయడాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, గుంటూరు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి నేతాజీ ఖండించారు.

ఇ-కోర్టులు మరింత బలోపేతం

రూ.3,108 కోట్లతో రికార్డుల డిజిటైజేషన్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దేశ వ్యాప్తంగా ఇ-కోర్టులను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర న్యాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలతో కీలక భేటీ నిర్వహించేందుకు కూడా సన్నాహాలు చేస్తుంది. ప్రస్తుతం ఉన్న ఇ-కోర్టుల విధానంలో మూడవ దశను త్వరలో అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. కొత్తగా కోర్టుల సముదాయాల్లో ఈ వ్యవస్థను బలోపేతం చేయడం, ఆయా న్యాయస్థానాలకు మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పించడం, దస్త్రాలను కంప్యూటర్లలో భద్రపరచడం వంటి అంశాలకు ఫేజ్-3లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

నాలుగేళ్లలో ఈ దశ పూర్తిచేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా రూ.3,108 కోట్లు ఖర్చు చేసిన తీర్పులు వచ్చినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్న కేసుల కోర్టు రికార్డులను కంప్యూటర్లలో భద్రపరచనున్నారు. ఇంటర్నెట్ క్లౌడ్ సామర్ధ్యాన్ని 25 పిబి వరకు పెంచనున్నారు. కోర్టుల్లో, న్యాయాధికారులకు అదనపు హార్డ్‌వేర్‌ను కూడా సమకూర్చాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటుచేసిన 2,500 కోర్టుల్లో, మరో 500 కోర్టుల సముదాయాల్లో ఐసిటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

1,150 న్యాయస్థానాల్లో వర్చువల్‌గా వాదనలు వినేందుకుగానూ కావాల్సిన అత్యాధునిక మౌలిక సౌకర్యాలపైనా దృష్టి సారించాలని నిర్ణయించారు.

ఇ-సేవా కేంద్రాలపైనా

న్యాయస్థానాల్లో లావాదేవీలకు సంబంధించి కావాల్సిన పత్రాలను ఫీజుల చెల్లింపులు వంటి అంశాలకు అవసరమైన ఇ-సేవా కేంద్రాలను కూడా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దేశ వ్యాప్తంగా న్యాయస్థానాల్లో 4,400 ఇ-సేవా కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. తొలుత వెయ్యి కోర్టుల్లో పేపర్‌లెస్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. కోర్టుల్లో దావాలను ఇ-ఫైలింగ్ ద్వారా సమర్పించేందుకు ముందుగా 18 వేల కోర్టుల్లో ఏర్పాటుచేయడంపైనా దృష్టి సారించనున్నారు.

ప్రత్యక్ష ప్రసారం

న్యాయస్థానాల్లో జరిగే వాదనలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు కూడా ఫేజ్-3లో చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ముందుగా 300 న్యాయస్థానాల సముదాయాల్లో ఈ విధానం అమలులోకి తీసుకురానున్నారు. మొత్తం 24 అంశాలను ఫేజ్-3లో అమలులోకి తీసుకువచ్చేందుకు నిర్ణయించారు. ఈ నెల 20న ప్రత్యేక వర్చువల్ భేటీని నిర్వహించనున్నారు. ఈ భేటీలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని కేంద్ర న్యాయశాఖ కోరింది.

ఇక ఆర్‌బిఐలోనే రూ.2 వేల నోట్ల మార్పిడి

- బ్యాంక్‌ల్లో ముగిసిన గడువు

న్యూఢిల్లీ : బ్యాంక్‌ల్లో రూ.2,000 నోట్ల మార్పిడికి శనివారంతో గడువు ముగిసింది. ఇకపై ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లోనే పెద్ద నోట్ల మార్పిడికి అవకాశం ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. ఇంకా మార్కెట్‌లో రూ.12వేల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు చెలామణిలో ఉన్నాయి. అవి ఇంకా బ్యాంకులకు చేరలేదు. తొలుత సెప్టెంబర్ 30 వరకూ రూ.2000 నోట్ మార్పిడి లేదా డిపాజిట్‌కు అవకాశం ఇచ్చిన రిజర్వ్ బ్యాంక్ తర్వాత ఆ గడువును ఈ నెల అక్టోబర్ ఏడో తేది వరకు పొడగించింది. సోమవారం నుంచి ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల వద్ద మాత్రమే మార్చుకునేందుకు వీలు ఉంది. దేశ వ్యాప్తంగా ఆర్‌బిఐకి 19 ప్రాంతీయ కార్యాలయాల్లో ఒకేసారి

రూ.20 వేల వరకూ డిపాజిట్ లేదా మార్పిడి చేసుకోవచ్చు. వీలు కాని వారు పోస్టాఫీసుల ద్వారా కూడా ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాలకు రూ.2000 నోట్లు పంపడానికి వీలు కల్పించింది. అనంతరం ఆ మొత్తం ఖాతాదారుల బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ అవుతుంది. ఇప్పటి వరకూ 96 శాతం రూ.2000 నోట్లు ఆర్‌బిఐకి తిరిగి వచ్చాయి.

కొత్త లోగోతో ఎయిరిండియా విమానాలు..

ముంబయి : ఎయిరిండియాను కొనుగోలు చేసినప్పటి నుంచి టాటా గ్రూపు ఆ సంస్థలో వరుస మార్పులను చేపడుతోంది. ఇటీవల సంస్థ లోగో, విమానాల రూపులో మార్పులు చేయగా.. తాజాగా కొత్త లోగోతో విమానాలను విడుదల చేసింది.

వీటిని శనివారం సోషల్ మీడియా వేదికల్లో పంచుకుంది. ఫ్రాన్స్‌లోని టౌలోసి వర్క్‌షాప్‌లో కొత్త లోగో, డిజైన్‌తో కొత్తగా డిజైన్ చేసిన ఎ350 విమానం చిత్రాలను విడుదల చేసింది. త్వరలోనే ఈ విమానాన్ని భారత్‌కు తీసుకు రానున్నట్లు పేర్కొంది.

2023 డిసెంబరు నుంచి కొత్త లోగోతో కొన్ని విమాన సర్వీసులు అందు బాటులోకి రానున్నాయని... 2025 నాటికి ఎయిరిండియాలోని అన్ని విమానాలను కొత్త లోగోలోకి మార్చనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది.

త్వరలో మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్

- వైజాగ్ పోర్టు ఆవిర్భావ దినోత్సవంలో పోర్టు ఛైర్మన్ అంగముత్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు తెలిపారు. వైజాగ్ పోర్టు 90వ ఆవిర్భావ దినోత్సవం పోర్టు వ్యాపార భాగస్వాములు, ఉద్యోగుల నడుమ పోర్టు గెస్ట్ హౌస్‌లో శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పోర్టు ఛైర్మన్ హాజరై మాట్లాడారు. త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నామని, దీని సందర్శనకు ప్రజలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కాంప్లెక్స్‌లో డిజిటల్ లైబ్రరీతో పాటు పరిశోధనకు అవసరమైన మంచి వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. 90 ఏళ్ల కాలంలో పోర్టులో వినియోగించిన వస్తువులను, పోర్టు ప్రయాణాన్ని తెలిపే ఫొటోలను ఆ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనున్నామన్నారు. బీచ్‌కు అభిముఖంగా నూతనంగా నిర్మించిన కంటైనర్ టెర్మినల్‌ను కలిపే విధంగా ఈ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పోర్టు కార్యకలాపాలు సాధారణ ప్రజలు సైతం తెలుసుకునే విధంగా రాస్ హిల్స్‌పై కూడా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఏటా 135 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యాన్ని పోర్టు కలిగి ఉందని, ప్రస్తుతం యాంత్రీకరణ, వేగంగా సరుకు తరలింపు వంటి అంశాలపై దృష్టి సారించామని తెలిపారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ అధికారి స్వామి, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్ జీవితం ఆదర్శం

- ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్ఆర్ శంకరన్ జీవితం నేటికీ ఆదర్శవంతమని, నేటి యువత ఆయన వేసిన బాటలో నడవాలని ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ అన్నారు. శనివారం ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జగజ్జీవన్ ఐక్యత భవన్‌లో ఎస్ఆర్ శంకరన్ విగ్రహం వద్ద నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజన అభ్యున్నతి కోసం ఆనేక జిఓలు చేశారన్నారు. ఎస్ఆర్ శంకరన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సహాయ కార్యదర్శి జి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.17,999కే లావా అగ్ని2 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ లావా ఇంటర్నేషనల్ తన లావా అగ్ని 2ను డిస్కౌంట్‌పై రూ.17,999కే అందిస్తున్నట్లు తెలిపింది. అమెజాన్ పండగ సీజన్ డీల్స్‌లో ఇది లభ్యమవుతుందని ఆ సంస్థ తెలిపింది. అగ్ని 2 ఉత్తమమైన 256జిబి స్టోరేజ్, 16జిబి ర్యామ్ వరకు విస్తరించుకునే సౌలభ్యం ఉందని తెలిపింది. పరిమిత స్టాక్ కొరకు ఈ ఆఫర్ అక్టోబరు 8 నుండి ప్రారంభం అయ్యే గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సమయములో కొనసాగుతుందని తెలిపింది.

నేటి నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియా ఫెస్టివల్

బెంగళూరు : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ తన గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2023 అక్టోబర్ 8నుంచి ప్రారంభం కానుంది. ప్రైమ్ సభ్యులకు 24 గంటల ముందే ఈ సౌలభ్యం కల్పిస్తున్నట్లు పేర్కొంది. 5,000పైగా ఉత్పత్తులపై భారీ డిస్కౌంట్లను అందిస్తున్నట్లు తెలిపింది. సామ్‌సంగ్ ఉత్పత్తులపై, ఇంటెల్ ల్యాప్‌ట్యాప్‌లు, సోనీ ప్లే స్టేషన్5, ల్యాక్‌మీ, హైసెన్స్ టివిలు, ఎల్‌జి ఉత్పత్తులు తదితర వాటిపై ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అమెజాన్ పే వ్యాలెట్‌తో షాపింగ్ చేయడం ద్వారా రూ.1000 గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది.

పార్సిల్ సేవల్లోకి ఓలా ప్రవేశం

బెంగళూరు : క్యాబ్ అగ్రిగేటర్ సేవలనందించే ఓలా కొత్తగా పార్సిల్ డెలివరీ సేవల్లోకి ప్రవేశించినట్లు వెల్లడించింది. ఓలా పార్సిల్ పేరిట ఇకపై డెలివరీ సేవలను కూడా అందించనున్నామని పేర్కొంది. ఈ సేవలను తొలుత బెంగళూరులో ప్రారంభించినట్లు తెలిపింది. ఇందుకోసం ఓలా ఇవి స్కూటర్లను మాత్రమే ఉపయోగిస్తామని ఓలా ఫౌండర్ భవీష్ అగర్వాల్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 5 కిలోమీటర్ల లోపు దూరానికి రూ.25, 15 కిలోమీటర్ల దూరానికి రూ.75, 20 కిలోమీటర్ల దూరానికి రూ.100 ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఈ సేవలను విస్తరించను న్నామన్నారు.

ఎంజి జడ్ఎస్ ఇవిపై రూ.2.30 లక్షల తగ్గింపు

న్యూఢిల్లీ : ఎంజి మోటార్ ఇండియా పండగ సీజన్‌లో తన జడ్ఎస్ విద్యుత్ కార్‌పై భారీ డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. ఎస్‌యువి జడ్ఎస్ ఇవిపై తగ్గింపుతో కొత్త ధరలను నిర్ణయించినట్లు పేర్కొంది. ఇందులోని ఎక్సైట్ వేరియంట్ ధరను రూ.22.89 లక్షలు, ఎక్స్‌ప్లోజివ్, ఎక్స్‌క్లూజివ్ ప్రో వేరియంట్ ధరలను వరుసగా రూ.24.99 లక్షలు, రూ.25.89 లక్షలుగా పేర్కొంది. ఇంతక్రితం ధరలతో పోల్చితే దాదాపు రూ.2.30 లక్షల మేర ఆదా చేసుకోవడానికి వీలుందని అంచనా. జడ్ఎస్ ఇవిలో ఇటీవల ఎడిఎఎస్ లెవల్‌ను పరిచయం చేసినట్లు పేర్కొంది. ఈ మోడల్‌పై రూ.50వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ ప్రారంభమవుతుందని పేర్కొంది.

ఇళ్ల పట్టాల కోసం కొనసాగిన ఆందోళన

- తహశీల్దార్ కార్యాలయం వద్ద స్నానం, వంటావార్పు, నిద్ర

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఇళ్ల పట్టాల కోసం శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరులో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అధికారుల తీరును నిరసిస్తూ గత 20 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలను మూడురోజుల క్రితం రెవెన్యూ అధికారులు తొలగించారు. దీనిని నిరసిస్తూ శనివారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం వద్దకు పేదలు చేరుకుని అక్కడే స్నానాలు చేసి నిరసన తెలిపారు. మధ్యాహ్నం వంటావార్పు నిర్వహించి కుటుంబ

తహశీల్దార్ కార్యాలయం వద్ద స్నానాలు చేస్తున్న పేదలు

సభ్యులతో కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని 20 రోజులుగా పేదలు అనేక రూపాల్లో నిరసన తెలుపుతున్నా అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభించడం సరికాదన్నారు. అసత్య హామీలు ఇచ్చి పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న తహశీల్దార్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గుడిసెలను తొలగించి, కాల్చివేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి తహశీల్దార్ కార్యాలయం వద్దే కుటుంబసభ్యులతో కలిసి నిద్రించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, రామచంద్ర, కమిటీ సభ్యులు చంద్ర, శివ, సదాశివరెడ్డి, రహంతుల్లా, మణిస్వామి, పేదలు పాల్గొన్నారు.

సంపాదకీయం

పొదుపు మంత్రం !

నిత్య జీవితంలో ఆదాయాలు పెరుగుతున్నట్లుగా కనిపించినా... ఖర్చులు అంతకు రెట్టింపవుతున్నాయి. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వచ్చి...చిన్న షాపులనే కాదు... చిన్న కుటుంబాలనూ మింగేస్తున్నాయి. డిస్కౌంట్‌ల పేరుతో ఊరిస్తూ...మనసును ప్రలోభపెడుతుంటాయి. అవసరమున్నా లేకున్నా...జేబులో డబ్బులు, మన బడ్జెట్ ఎంత? అన్న లెక్కలన్నీ తారుమారైపోతున్నాయి. మనిషి బలహీనతను మాల్స్ రూపంలో వున్న తిమింగలం మింగేస్తున్నది. నట్టింట్లో టీవీ, అరచేతిలో స్మార్ట్‌ఫోన్ వుంటే చాలు....కార్పొరేట్ ప్రపంచంలోని రకరకాల ప్రకటనలు ప్రలోభపెడుతూనే వుంటాయి. డిస్కౌంట్లు, ఇఎంఐలు, క్రెడిట్ కార్డులు మన నియంత్రణను పరీక్షిస్తుంటాయి. బైక్, కారు, ఇల్లు, బంగారం, ఫ్రిజ్, టీవీ... ఇలా ఆర్థిక స్థితిని మించి కొనేయడం, వాటికి ఏళ్ల తరబడి వాయిదాలు కడుతూనే వుంటాం. ఈ పద్ధతే అవసరాలకు, ఆర్థికానికి మధ్య తీవ్రమైన అంతరాన్ని మిగుల్చుతున్నది. ఈ రెండిటి మధ్య తేడాను తెలుసుకోగలిగితే పొదుపు అలవాటు చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, అదే పెద్ద కష్టం.

ప్రతి ఒక్కరి జీవితంలో అవసరాలు, అత్యవసరాలు, ఆనందాలు వుంటాయి. అవసరం వేరు, ఆర్భాటం వేరు. డబ్బే జీవితం కాదు. కానీ, ప్రతి అవసరానికీ, ఆనందాలకీ, సరదాలకీ డబ్బు కావాల్సిందే. అదే సందర్భంలో నిత్యం పెరిగే ధరలు, నిలకడలేని ఉద్యోగాలు, అనుకోని అనారోగ్యాలు-అన్నీ మనిషిని ఇబ్బంది పెట్టేవే. దేనికి ఖర్చు చేయాలి, దేనికి అవసరంలేదు అనే నియంత్రణ మనిషికి అవసరం. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పొదుపు చేయడం ప్రారంభిస్తే...జీవితంలో ఆర్థిక లోటు ఏర్పడదు. అయితే- భారతీయుల్లో తక్కువ పొదుపు...ఎక్కువ రుణాలు పెరిగాయని, 2022-23లో నికర గృహ ఆర్థిక పొదుపు జిడిపిలో 5.1 శాతానికి పడిపోయిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన తాజా నివేదికలో వెల్లడించింది. కరోనా తర్వాత బ్యాంకుల దూకుడు రుణ వ్యూహాల కారణంగా 30 కోట్లకు పైగా భారతీయ కుటుంబాల రుణ స్థాయిలు పెరిగాయి. 2021-22 చివరి నాటికి రూ.1.48 లక్షల కోట్లున్న క్రెడిట్ కార్డుల బకాయిలు 2022-23 నాటికి రూ.1.94 లక్షల కోట్లకు పెరిగాయి. ఆస్తుల స్థాయిలు పడిపోవడంతో... ఆర్థిక భారాలు పెరగడం అనేది పెరుగుతున్న అసమానతలకు సంకేతం. 'నీ మనసుని, శరీరాన్ని ఆరోగ్యంగా అట్టేపెట్టని ఖర్చు ఒక్క దమ్మిడీ చెయ్యకు' అంటాడు కొడవటిగంటి. ఇది వ్యక్తులకే కాదు....పాలకులకు, ప్రభుత్వాలకూ వర్తిస్తుంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యమాని... ప్రపంచంలో వినిమయదారీ సంస్కృతి విపరీతంగా పెరిగింది. చేతిలో నయాపైసా లేకపోయినా, మధ్యతరగతి జీవితాలను ఆశల పల్లకిలో విహరింపజేస్తూ... క్రెడిట్ కార్డులు, ఇఎంఐ ల రూపంలో వున్నదంతా ఊడ్చేస్తున్నారు. 'అప్పు తెచ్చి వేసిన మిద్దెల్లో/ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది' అంటాడు చెరబండరాజు. ఇలాంటి ప్రతి సందర్భాన్నుంచీ బయటపడేసేదే పొదుపు. అలాంటి పొదుపు పట్ల ప్రజల్లో స్పృహ కలిగించడం కోసం ప్రతి ఏడాది అక్టోబర్ 12న 'జాతీయ పొదుపు దినోత్సవం' జరుపుకుంటున్నారు.

మన ఆర్థిక అలవాట్లను పునరాలోచించుకోవడానికి, వాస్తవిక లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి...సురక్షితమైన, సుసంపన్నమైన భవిష్యత్ కోసం పొదుపు పాటించడం అవసరం. పొదుపు కేవలం వ్యక్తిగత ప్రయోజనమే కాదు... సామాజిక బాధ్యత అని ఈ రోజు గుర్తు చేస్తుంది. పొదుపు అలవాటు ప్రారంభంలో కొంత కష్టమనిపించినా... తినగ తినగ వేము తీయనుండు అన్నట్టుగా తర్వాత్తర్వాత సులభమవుతుంది. 'ఇదమే వహి పాండిత్యం/ ఇదమే వహి శూరత/ ఇదమే వహి వైదగ్ధ్యం/ ఆదాదల్పతరో వ్యయ:' అన్నారు. ఆదాయం కన్నా చాలా తక్కువ ఖర్చుపెట్టడమే...ఏ మనిషి విజ్ఞానానికైనా, శూరత్వానికైనా, నేర్పుకైనా నిదర్శనం-అని ఈ శ్లోకం చెబుతుంది. పొదుపు ఒక్క డబ్బు విషయంలోనే కాదు-కాలం, వనరులు, నీరు, చెట్టు, విద్యుత్, ఆహారం వంటి అన్నిటిలోనూ అవసరమే. డబ్బుతో పాటు ప్రకృతి వనరులు ఏ ఒక్కటి వృధా అయినా... దాని ఫలితం భవిష్యత్తరాలు ఎదుర్కోవాల్సి వుంటుంది. పొదుపు అనే దివిటీని చేపట్టి... ఆర్థికంగా సుస్థిరమైన భవిష్యత్తు వైపునకు అడుగులు వేద్దాం.

మహనీయుల మాట



సైనికునికి ఆయుధంగా
తుపాకి ఉన్నట్లుగానే
కవికి భాష
ఆయుధంగా ఉంటుంది.
- మాగ్జిమ్ గోర్కీ
ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.

తెలుగు రాష్ట్రాల్లో బిజెపి చెలగాటాలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి

'ఉదర పోషణార్థం బహుకృత వేషధారణం' అన్నట్టుగానే రాజకీయాధికారం, ఆధిపత్యం కోసం కేంద్రంలోని బిజెపి-ఎన్‌డిఎ ప్రభుత్వ అధినేత మోడీ, ఆయన మద్దతుదారులు వేస్తున్న వేషాలు తెలుగు రాష్ట్రాలలో రసవత్తర ఘట్టానికి తెరతీశాయి. వచ్చే ఎన్నికల నాటికి ఎలాగోలా ప్రత్యక్ష పరోక్ష మద్దతుదారులను పెంచుకోవాలన్న బిజెపి కూటమిలో ఇంతవరకూ ఒక్కరైనా చెప్పుకోదగిన భాగస్వాములు చేరిందిలేదు. ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనలో దాన్నే తిరగేసి చెబుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎన్‌డిఎలో చేరతానన్నా తాను నిరాకరించానని సెలవిచ్చారు. ఒక దశలో మోడీ విధానాలపై విరుచుకుపడిన కెసిఆర్ ఇటీవల మౌనం దాల్చడంతో 'బిజెపి, బిఆర్‌ఎస్‌లు మళ్లీ దగ్గరయ్యాయా..?' అనే సందేహాలు పెరిగిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు మరింత గజిబిజికి కారణమైనాయి. మోడీ మాటలను మంత్రి కెటిఆర్ తీవ్రంగా ఖండించగా ఆ రెండు పార్టీలదీ ఫెవికాల్ బంధమని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిజానికి టిబిజెపి మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ఎం.పి కె.లక్ష్మణ్ 2018లో స్వయంగా తమతో పొత్తు కోసం వచ్చారని కెటిఆర్ వెల్లడించారు. ఏది ఎంత నిజమైనా ఈ రెండూ బయటివారికి తెలియని విషయాలే. పారదర్శకత లేని పాలక పార్టీల వ్యూహాలు, అవకాశవాదాలు ఎలా వుంటాయో ఈ ఉదంతాలు వెల్లడి చేశాయి. మోడీ ఒకనాటి రహస్యాన్ని బయటపెట్టి కెసిఆర్‌ను ఇరకాటంలో నెట్టారని ఒక కథనమైతే కేవలం అభూత కల్పనలతో గందరగోళం కోసం విఫలయత్నం చేశారని మరో అభిప్రాయం వినిపిస్తున్నది. బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య లేదా ఎన్‌డిఎ, ఇండియాల మధ్య సమ దూరం పాటిస్తామని కెసిఆర్ చెప్పిన సంగతి తెలిసిందే. బిఆర్‌ఎస్‌గా మార్చిన తర్వాత దేశవ్యాపితంగా ప్రత్యామ్నాయం తీసుకొస్తామని కూడా ఆయన అన్నారు. అయితే తాము ప్రస్తుతానికి మహారాష్ట్రలో మాత్రమే పోటీ చేస్తామని ఇటీవల కెటిఆర్ స్పష్టీకరించారు. బిఆర్‌ఎస్ నేస్తంగా వున్న మజ్లిస్ ఒవైసీ కూడా మూడో ఫ్రంట్ కెసిఆర్ నాయకత్వాన ఏర్పడాలని పిలుపునిచ్చారు. ఇలాంటి తరుణంలో మోడీ మాటలు మరింత వేడిని పెంచాయి. ప్రస్తుతం ఛాతీలో సెకండరీ ఇన్‌ఫెక్షన్‌తో అస్వస్థులుగా వున్న కెసిఆర్ తర్వాతనైనా సమాధానం ఇస్తారేమో చూడవలసి వుంటుంది. ఈ లోగా వచ్చిన ఎన్నికల సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వుండగా బిజెపి నేతలు మాత్రం తమకు అనుకూలంగా వుంటాయనీ హంగ్ సభలో బిజెపినే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రకటించారు. బిజెపికి సంబంధించిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా కొందరు ప్రధాని సభనే బహిష్కరించారు. దాంతో అలిగిన వారికి పదవులు ఇచ్చి మరీ నిలుపుకోవలసిన అగత్యమేర్పడింది.

తెలంగాణలో పరిణామాలు, మోడీ మాటలు

ఇంచుమించు ఈ కాలంలోనే చంద్రబాబు అరెస్టు జరగడంతో దానిపై ఐ.టి సిటీలో నిరసనలు వద్దని కెటిఆర్ స్పష్టంగా ప్రకటించారు. మరోవైపున ఆ పార్టీ మంత్రులూ ప్రముఖులే దానిపై విమర్శలు చేశారు. టిడిపి అనుకూల ఓటర్లు ఆంధ్ర ప్రాంత ఓటర్ల కోసం ఇదంతా చేస్తున్నారనే భావన బలపడింది. బిజెపి కూడా రకరకాలుగా స్పందించింది. ఎన్టీఆర్‌తో సహా సినిమా పరిశ్రమ స్పందన లేదనే మాట వచ్చినా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా సినిమావారి సమస్యలు అర్థం చేసుకోవాలని వాదించారు. మరోవైపున గత రెండుసార్లు బరిలో దిగని జనసేన ఈసారి 32 స్థానాల్లో పోటీ చేస్తానని ప్రకటించింది. తెలంగాణలో బిజెపికి మద్దతునిస్తామనే ప్రతిపాదనతో ఎ.పి లో వారి అండదండలు పొందాలనే ఆలోచనతో టిడిపి తెచ్చిన ప్రతిపాదనను బిజెపి తోసిపుచ్చింది. ఎన్‌డిఎలో భాగస్వామినంటూనే పవన్ కళ్యాణ్ 32 స్థానాల్లో పోటీ ప్రకటించినా వీరు స్పందించలేదు. ఒక విధంగా ఇది వ్యూహాత్మకమేనని, తెలంగాణలో బిఆర్‌ఎస్ వ్యతిరేక ఓట్లలో చీలిక తేవడానికే ఇలా చేస్తున్నారని అనేకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో అనేక సమస్యలు, అనైక్యతలు వున్నా బిఆర్‌ఎస్‌కు అదే ప్రధాన ప్రత్యర్థి అని కెసిఆర్ కూడా అంగీకరించి వున్నారు. అందువల్లనే బహుశా దానికి అవకాశం లేకుండా చేయడం కోసం మోడీ రంగంలోకి దిగారనుకోవాల్సి వుంటుంది. దక్షిణాదిన అసలే టికానా లేని బిజెపి కాంగ్రెస్‌కు ఏ విధంగానూ అవకాశం ఇవ్వకూడదనే గట్టి వైఖరితో వుంది.

మీడియాను మోడియాగా మార్చేస్తున్నారనే ఆరోపణల మధ్య ఏక కాలంలో పరస్పర విరుద్ధమైన వైసిపి, టిడిపి, జనసేన మూడింటినీ లోబర్చుకోవడమే గాక బిఆర్‌ఎస్ పైనా ఒత్తిడి పెంచడం బిజెపి కుటిల నీతికి దర్పణం. తమలో తాము కలహించుకుంటూ రాష్ట్రానికి అన్యాయం చేసే ఈ పార్టీలు బిజెపిని మాత్రం ప్రశ్నించడం లేదు. పైపెచ్చు పరస్పర కలహాలతో జుట్టు దాని చేతుల్లోనే పెడుతున్నారు. తొమ్మిదిన్నరేళ్లుగా పేరబెట్టిన కృష్ణా జలాల పంపిణీ సమస్యపై ఆదరాబాదరాగా ట్రిబ్యునల్‌కు కొత్త విధివిధానాలను ప్రకటించడం ద్వారా తెలంగాణ ఎన్నికల్లో అవకాశాలు పెంచుకోవాలన్న బిజెపి తాపత్రయం స్పష్టమైపోయింది.

ఎ.పి లో ఎన్ని మెలికలు?

చంద్రబాబు అరెస్టు కేంద్ర బిజెపి అండదండలు కనీసం ఆమోదం లేకుండా జరిగి వుండదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలుగుదేశం లోనూ చాలా మందిలో ఇదే భావం వుంది. అయినా సరే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్, బాలకృష్ణ, అచ్చెంనాయుడు వంటి వారు బిజెపికి సంబంధం లేదని పదేపదే చెబుతున్నారు. ఆ బిజెపి నేతలతో కలసి మాట్లాడితే ఏదో ఉపశమనం దొరుకుతుందని ఢిల్లీలో మకాం వేసినా ఒకరైనా కలుసుకోవడానికి సిద్ధం కాలేదు. అయినాసరే వారికి సంబంధం లేదని లోకేష్ కితాబునిస్తూనే వున్నారు. పవన్ కళ్యాణ్ మరింత గట్టిగా చెబుతున్నారు. ఎ.పి బిజెపి నాయకులు పరిపరివిధాల మాట మారుస్తున్నారు. అరెస్టు తర్వాత టిడిపితో పొత్తు వుంటుందని ప్రకటించిన పవన్ కళ్యాణ్ తాను ఎన్‌డిఎ తోనే వున్నానని పునరుద్ఘాటించారు. సనాతన ధర్మం కాపాడాలని కూడా మరోసారి పిలుపునిచ్చారు. గతంలో చంద్రబాబు, ఇప్పుడు పవన్ కళ్యాణ్ మోడీ సర్కారును పోటీపడి పొగుడుతూనే వున్నారు. కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ను ఓడించడం కోసం టిడిపి, జనసేనలతో కలసి వెళ్తామని సిపిఐ కార్యదర్శి రామకృష్ణ ప్రకటించారు. బిజెపితో ప్రత్యక్ష పరోక్ష అవగాహన అనుబంధం వున్న వారెవరితోనూ కలిసే అవకాశమే లేదని సిపిఎం నాయకులు ఆయా సందర్భాల్లో వెల్లడించారు. బిజెపి నుంచి టిడిపి, జనసేన దూరం కావాలని తాము కోరుతున్నామని రామకృష్ణ చెప్పారు గానీ ఆ పార్టీల కీలక నేతల మాటలు అందుకు పూర్తి విరుద్ధంగా వున్నాయి. ఈ సమయంలోనూ బిజెపి మాత్రం తమ జనసేనతోనే పొత్తులో వున్నామనీ, టిడిపి సంగతి పవన్ కళ్యాణ్ చెప్పాలని అంటూ వచ్చారు, మొన్న కోర్ కమిటీ చర్చలంటూ జరిపి అధిష్టానానికి నివేదిస్తామన్నారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే ఈ సమయంలోనే ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలో నెంబర్ టూ అమిత్ షా ను కలిసి మాట్లాడి వచ్చారు. ఆయన అక్కడ కలుస్తున్న రోజునే ఇక్కడ హైదరాబాద్‌లో బిజెపి అధ్యక్షుడు జె.పి నడ్డా, మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌లు అనుకూల పత్రికాధిపతులను ప్రత్యేకంగా కలుసుకోవడం చూశాం. జగన్ కుటుంబం 'సాక్షి' పత్రిక యజమాని కూడానని గుర్తుంచుకోవాలి. ఢిల్లీలో 'న్యూస్ క్లిక్'పై దారుణమైన దాడి చేస్తూ పత్రికా స్వాతంత్ర్యం కాలరాస్తున్న బిజెపి పెద్దలు ఇక్కడ మాత్రం ముఖ్యమైన మీడియాతో మంతనాలు జరుపుతున్నారు. ఆ ఘటనపై సంపాదకీయాలు రాస్తూ తెలుగు రాష్ట్రాలలో మీడియాపై దాడిని కూడా ప్రస్తావించిన ఆ రెండు పత్రికలు అదే ఆందోళన వారి ముందుగానీ తర్వాత గానీ వెలిబుచ్చిన దాఖలాలు లేవు. మీడియాను మోడియాగా మార్చేస్తున్నారనే ఆరోపణల మధ్య ఏక కాలంలో పరస్పర విరుద్ధమైన వైసిపి, టిడిపి, జనసేన మూడింటినీ లోబర్చుకోవడమే గాక బిఆర్‌ఎస్ పైనా ఒత్తిడి పెంచడం కుటిల నీతికి దర్పణం. తమలో తాము కలహించుకుంటూ రాష్ట్రానికి అన్యాయం చేసే ఈ పార్టీలు బిజెపిని మాత్రం ప్రశ్నించడం లేదు. పైపెచ్చు పరస్పర కలహాలతో జుట్టు దాని చేతుల్లోనే పెడుతున్నారు. తొమ్మిదిన్నరేళ్లుగా పేరబెట్టిన కృష్ణా జలాల పంపిణీ సమస్యపై ఆదరాబాదరాగా ట్రిబ్యునల్‌కు కొత్త విధివిధానాలను ప్రకటించడం ద్వారా తెలంగాణ ఎన్నికల్లో అవకాశాలు పెంచుకోవాలన్న బిజెపి తాపత్రయం స్పష్టమైపోయింది. అయిదు రాష్ట్రాల మధ్య పున:పంపిణీ కాకుండా రెండు రాష్ట్రాల మధ్యనే విభజన, అది కూడా ఏకపక్షంగా నిర్ణయించిన షరతుల మీద జరగడం ఎ.పి కి ఆమోదయోగ్యం కాదు. తెలంగాణకూ బలమైన అభిప్రాయాలున్నాయి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డుకు ఉమ్మడి ఎ.పి కూడా అభ్యంతరాలు చెప్పి సవాలు చేసింది. ఇప్పుడు ఆ పరిధిలోనే పున:పంపిణీ ఎలా న్యాయమవుతుంది? ఈ విషయంలో కూడా ప్రాంతీయ పార్టీలు ఒకరినొకరు అనుకోవడం తప్ప ఢిల్లీ లోని మోడీ కౌటిల్యాన్ని ప్రశ్నిస్తున్నది లేదు. ఈ తరుణంలోనే మోడీకి అస్మదీయుడైన అదానీ మహాశయుడు వచ్చి ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ కావడం, రేవులు సంస్థలు, విశాఖ భూములు ఆయనకు అప్పగించేందుకు రంగం సిద్ధం కావడం యాదృచ్ఛికం కాదు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని జిందాల్స్‌కు కట్టబెట్టడానికి పన్నాగాలు పన్నుతూనే మరోవంక ఎం.పి జీవిఎల్‌తో ప్రైవేటీకరణ నిల్చిపోయిందని చెప్పించడం బిజెపికే చెల్లింది. ఈ అంశంలో ప్రభుత్వం, ప్రాంతీయ పార్టీలు పోరాడింది లేదు. ఇవన్నీ చాలనట్టు మత రాజకీయాలు కూడా తరచూ తలెత్తుతున్నాయి. మత రాజకీయాలను ఎదుర్కొనే బదులు తాము మరింతగా మతోద్ధారకులమన్నట్టు వైసిపి, టిడిపి, జనసేన వ్యవహరిస్తున్నాయి.

అన్నిచోట్లా ఆధిపత్య రాజకీయాలు నడుస్తున్నట్లు అర్థమవుతున్నది. దీన్ని తరచూ అప్రకటిత ఎమర్జెన్సీ అంటున్నారుకానీ దొడ్డిదోవన తెచ్చిన ఈ నిరంకుశత్వం అప్పటి కంటే దారుణంగా తయారైంది. లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య తత్వాన్ని కాలరాచే బిజెపి రాజకీయ దాడులకూ కుయుక్తులకూ తెలుగు రాష్ట్రాల పరిణామాలే అద్దం పడుతున్నాయి. ఈ దశలో పాలక పార్టీలు మనుగడ కోసం మోడీకి తలవంచుతున్న తీరు, పిల్లి మొగ్గలు వేస్తున్న వైనం అత్యంత నష్టదాయకం.

కార్యాచరణే సమాధానం

అందుకే మోడీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేయడమే గాక స్వంతంగా పునాది లేని చోట చెలగాటమాడగలుగుతున్నది. అన్నిచోట్లా ఆధిపత్య రాజకీయాలు నడుస్తున్నట్లు అర్థమవుతున్నది. దీన్ని తరచూ అప్రకటిత ఎమర్జెన్సీ అంటున్నారుకానీ దొడ్డిదోవన తెచ్చిన ఈ నిరంకుశత్వం అప్పటి కంటే దారుణంగా తయారైంది. లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య తత్వాన్ని కాలరాచే బిజెపి రాజకీయ దాడులకూ కుయుక్తులకూ తెలుగు రాష్ట్రాల పరిణామాలే అద్దం పడుతున్నాయి. ఈ దశలో పాలక పార్టీలు మనుగడ కోసం మోడీకి తలవంచుతున్న తీరు, పిల్లి మొగ్గలు వేస్తున్న వైనం అత్యంత నష్టదాయకం. బడా మీడియా మోడియాగా మారిపోవడంతో వాస్తవాలు పాక్షికంగానే అందుతున్నాయి. కేంద్ర రాష్ట్రాల హానికర విధానాలపై పోరాడవలసిన తరుణమిది. ముందు తెలంగాణలోనూ తర్వాత ఎ.పి లోనూ ఎన్నికలు రాబోతున్నాయి గనక పొత్తుల ఎత్తులే ఇప్పుడు మొత్తం నిండిపోతున్నాయి. ఏ సర్వేలోనూ బిజెపికి అనుకూలత లేకున్నా ప్రాంతీయ పార్టీల ఊగిసలాటలూ అవకాశవాదాలే అంతిమంగా దానికి తాళాలు అప్పగిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తుంది. విజయవాడలో జరిగిన సమగ్రాభివృద్ధి చర్చ, విశాఖ ఉక్కు యాత్ర, తెలంగాణలో ప్రజా ఉద్యమాల వంటి కార్యాచరణలే దానికి విరుగుడు. ప్రజల హక్కులనూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలే ఇప్పుడు మార్గం చూపాలి. బిజెపి వినాశకర విధానాలతో చేతులు కలపని శక్తులను కూడగట్టాలి.

●

దుస్థితిలో ఆర్థిక వ్యవస్థ!

వ్యాఖ్య

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ప్రజల ఆదాయాలు తగ్గడం, ధరలు పెరుగుతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం, తయారీ రంగ వృద్ధిలో క్షీణత... ఇవన్నీ కలిసి ఉధృతమవుతున్న ఆర్థిక దుస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. ఆశ్రితుల ఆస్తుల వృద్ధికి ఆశ్రయం కల్పించడం ఆపి, దానికి బదులుగా ప్రభుత్వ వనరులను ప్రజా పెట్టుబడులకు ఉపయోగించి, ఎంతగానో అవసరమైన మౌలిక వసతులను నిర్మించాల్సిన అవసరం వుంది. దీనివల్ల ఉద్యోగాలు కల్పించబడతాయి. ఆర్థిక వ్యవస్థలో దేశీయ డిమాండ్ పెరుగుతుంది. అయితే, దేశ జాతీయ ఆస్తులను దోపిడీ చేయడం ద్వారా తమ లాభాలను గరిష్టంగా పెంచుకునేందుకు విదేశీ, దేశీయ పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం విధేయత కనబరుస్తున్నందున, ఈ సంక్షోభం మరింత అధ్వాన్నంగా మారుతుంది.



పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రాజధాని న్యూ ఢిల్లీలో గత ఆదివారం లక్షల సంఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శన జరిపారు. ఇంతటి బృహత్తరమైన ప్రజా ప్రదర్శనకు సంబంధించిన కవరేజీ... మన దేశాన్ని పట్టి పీడిస్తున్న తీవ్ర ఆర్థిక మాంద్యం ప్రతిబింబాన్ని... అస్పష్టంగా కేవలం ఒక సంఘటనగా వర్ణించడానికి మాత్రమే పరిమితమైంది. పాత పెన్షన్ పథకం ప్రకారం, ఒక ఉద్యోగి చివరిసారిగా తాను అందుకున్న జీతంలో 50 శాతాన్ని బోనస్‌గా అందుకుంటాడు. ఈ మొత్తం కూడా ప్రతి ఏడాదీ ద్రవ్యోల్బణానికి తగినట్లుగా సర్దుబాటు అవుతూ వుంటుంది. మరోవైపు కొత్త పెన్షన్ పథకంలో ఉద్యోగి అందుకునే పెన్షన్ పాత పెన్షన్ పథకం కింద వచ్చే మొత్తంలో సగానికి మించదు. 2004 తర్వాత సర్వీసు లోకి ప్రవేశించిన వారందరూ కొత్త పెన్షన్ పథకానికి మాత్రమే అర్హులని చట్టం పేర్కొంటోంది.

ఇరవయ్యేళ్ల తర్వాత వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలను ప్రభావితం చేసే సమస్యగా ఇది మారిందన్నది వాస్తవం. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఆదాయాలతో భారతదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న జీవన వ్యయ సంక్షోభాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. మధ్య తరగతి వారికి కూడా జీవనోపాధులు మరింత దుర్భరంగా మారుతున్నాయి. కొత్త పెన్షన్ పథకాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినపుడు, పెన్షన్ అనేది కార్మికుడి హక్కు అని, అంతేకానీ ప్రభుత్వమిచ్చే నిరుద్యోగ భృతి కాదు అన్న సూత్రానికి కట్టుబడి సిపిఎం ఈ కొత్త పెన్షన్ పథకాన్ని వ్యతిరేకించింది. ఈ నాడు, ఆ వ్యతిరేకతకు గల కారణాలు ధృవీకరించబడుతున్నాయి.

మన దేశ ప్రజానీకం వాస్తవిక ఆదాయాలు కృశించిపోతున్నాయి. దీంతో జీవనం మరింత దుర్భరంగా మారుతోంది. దేశ ఆర్థికారోగ్యం కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో దేశీయ డిమాండ్ తక్కువవుతోంది. పెట్టుబడులు దెబ్బతింటున్నాయి. ఇటువంటి పెట్టుబడులతో తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ వుండడం లేదు. ఉత్పత్తి చేసింది వెంటనే అమ్ముడయ్యి లాభాలు వచ్చి, అభివృద్ధి నమోదైతేనే పెట్టుబడులు పెరుగుతాయి. డిమాండ్, పెట్టుబడులు లేనపుడు ఆర్థిక వృద్ధి కూడా జరగదు. ఈ నాడు భారతదేశ ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తున్న ప్రాథమిక సమస్య ఇది.

మోడీ ప్రభుత్వ హయాంలో మతం-కార్పొరేట్ బంధం మరింత బలపడుతుండడంతో, దేశంలో ఉత్పత్తి అయ్యే సంపదలో ప్రధాన భాగం ఆశ్రితుల చేతుల్లో వుంటోంది. అదానీ వ్యవహారం ఇందుకు మంచి ఉదాహరణగా వుంది. మెజారిటీ ప్రజలను పణంగా పెట్టి కొద్ది మంది ఆశ్రితులను మరింత సుసంపన్నులను చేయడానికి దేశ సంపద మళ్లించబడుతోంది. మోడీ ప్రభుత్వం అనుసరించే ఆర్థిక విధానాలు రెండు భారత దేశాలను-సంపన్నులకు ప్రకాశంతమైన భారత దేశాన్ని, నిరుపేదలకు బాధలు పడుతున్న భారతాన్ని-సృష్టించే క్రమానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

అయితే, భారతదేశం పుంజుకుంటోందని, జిడిపి దృష్ట్యా చూసినట్లైతే ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పయనిస్తోందంటూ మోడీ ప్రభుత్వం అవిశ్రాంతంగా చేస్తున్న ప్రచారం పేర్కొంటోంది. ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహిస్తారనే దానితో నిమిత్తం లేకుండా, ప్రస్తుత గణాంకాల ధోరణులను బట్టి చూసినట్లైతే, 2027లో భారత్ మూడవ స్థానంలో వుంటుంది. కానీ, తలసరి జిడిపి దృష్ట్యా భారత్ ఎక్కడ వుంటుందనేదే వాస్తవం. తలసరి జిడిపి దృష్ట్యా చూసినట్లైతే, ఈనాడు ప్రపంచంలో భారత్ ర్యాంక్ 142.

కొత్తగా ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను చూపెట్టేందుకు ఇటీవల జరిగిన జి-20 సదస్సును ఉపయోగించుకున్నారు. కానీ, మళ్ళీ వాస్తవాలు పరిశీలిస్తే అసలు సత్యం బోధపడుతుంది. జి-20 దేశాలన్నింటిలోకి అత్యంత తక్కువ తలసరి జిడిపి భారత్‌దే. అలాగే మానవ వనరుల అభివృద్ధిలో కూడా దిగువ స్థానంలోనే వుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత తక్కువ కార్మిక ప్రాతినిధ్యం రేటు వున్న రికార్డు కూడా మనదే. అంటే అత్యంత ఎక్కువగా నిరుద్యోగ సమస్య నెలకొందన్నమాట.

దీనివల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోంది, ఫలితంగా, స్థూల ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతోంది. గతేడాది కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పెట్టుబడులు వచ్చే కొత్త ప్రతిపాదనలు 72.5 శాతం క్షీణించగా, ప్రైవేటు పెట్టుబడులు 79.2 శాతం తగ్గాయి.

'మేక్ ఇన్ ఇండియా' పదేళ్ల ఘన విజయంపై పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అసలు ఇందులో నిజం ఏమిటి? 2013-14 నుండి తయారీ రంగం వృద్ధి సగటున 5.9 శాతం వుంది. పెట్టుకున్న లక్ష్యం మాత్రం 12-14 శాతంగా వుంది. కానీ ఈ లక్ష్యాన్ని సాధించలేదు. జిడిపిలో తయారీ రంగం వాటా 25 శాతం వుండాలని లక్ష్యంగా పెట్టుకోగా 16.4 శాతం దగ్గరే స్తంభించిపోయింది. 2011-12, 2021-22 మధ్య కాలంలో తయారీ రంగంలో ఉద్యోగాలు 12.6 శాతం నుండి 11.6 శాతానికి క్షీణించాయి. ఒబిసిలకు విశ్వకర్మ ప్రాజెక్టులను ఎర్ర కోట నుండి ప్రధాని మోడీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. నైపుణ్యాలు కలిగిన కళాకారులకు రూ.13 వేల నుండి రూ.15 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పారు. అయితే, పార్లమెంట్‌లో ప్రకటించింది చూసినట్లైతే, రాబోయే ఐదేళ్ల కాలంలో రూ.13 వేల కోట్ల రుణాల ప్యాకేజీని ఐదు శాతం వడ్డీతో పంపిణీ చేస్తామని ప్రకటించారు.

గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి కూడా పెరుగుతోంది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) డిమాండ్ గతేడాది కాలంలో 16.3 శాతం పెరిగింది. 2019-20 నుండి చూసినట్లైతే ఒక్కసారిగా 29.4 శాతం పెరిగింది. ఇది, మనుగడ కోసం ప్రజలు పడుతున్న దుస్థితి స్థాయిని తెలియచేస్తోంది. వాస్తవిక వేతనాలు ప్రతికూల అభివృద్ధిని నమోదు చేశాయని 2022-23 సంవత్సరానికి ఆర్థిక సర్వే పేర్కొంది.

ఆర్థిక కార్యకలాపాలు క్షీణించాయన్నది వీటన్నింటి ఫలితంగా వుంది. దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్‌లు, రత్నాలు, ఆభరణాలు వంటి కార్మిక శ్రమ ఎక్కువ వుండే ఎగుమతులు క్షీణించడంలో ఇది కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో భారత్ వాటా బాగా తగ్గుతోంది. అంటే ఈ రంగాల్లో దేశీయ ఉపాధి కూడా బాగా తగ్గుతోందనే అర్థం.

ఫలితంగా ఆగస్టులో నిరుద్యోగం రేటు 8.1 శాతంగా వుంది. 2022లో యువత (15-24 సంవత్సరాలు) లో నిరుద్యోగం 23.22 శాతంగా వుంది. పట్టభద్రుల్లో ఇది ఏకంగా 42 శాతంగా వుంది. 2023 ఆగస్టులో దాదాపు 2 కోట్ల కుటుంబాలు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కింద పని కావాలని డిమాండ్ చేశాయి. భారతదేశ ప్రజల డివిడెండ్‌ను మోడీ ప్రేరేపించిన విధ్వంసం ఇది.

ఉపాధి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. గత కొన్నేళ్ళుగా ఆర్‌బిఐ పెట్టిన పరిమితి 6 శాతాన్ని ద్రవ్యోల్బణం అధిగమిస్తూనే వుంది. అంతకన్నా అధ్వాన్నమేమంటంటే, ఆహార పదార్థాలు, నిత్యావసరాల ధరలు పెరుగుతుండడంతో ఈ ద్రవ్యోల్బణం ఇంకా పెరుగుతోంది.

జిడిపి శాతంగా కుటుంబాల ఆర్థిక ఆస్తులు క్షీణించడమే ఈ మొత్తం సంక్షోభానికి ప్రధాన కారణంగా వుంది. 2020-21లో 15.4 శాతంగా వున్న ఈ ఆస్తులు 2022-23లో 10.9 శాతానికి పడిపోయాయి. బతకడం కోసం ప్రజలు తమ కుటుంబ ఆస్తులుగా వచ్చిన వెండి, బంగారాలను అమ్ముకుంటున్నారు. కుటుంబాల నికర ఆర్థిక ఆస్తులు 11.5 శాతం నుండి 5.1 శాతానికి పడిపోయాయి.

ప్రజల ఆదాయాలు తగ్గడం, ధరలు పెరుగుతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం, తయారీ రంగ వృద్ధిలో క్షీణత... ఇవన్నీ కలిసి ఉధృతమవుతున్న ఆర్థిక దుస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. ఆశ్రితుల ఆస్తుల వృద్ధికి ఆశ్రయం కల్పించడం ఆపి, దానికి బదులుగా ప్రభుత్వ వనరులను ప్రజా పెట్టుబడులకు ఉపయోగించి, ఎంతగానో అవసరమైన మౌలిక వసతులను నిర్మించాల్సిన అవసరం వుంది. దీనివల్ల ఉద్యోగాలు కల్పించబడతాయి. ఆర్థిక వ్యవస్థలో దేశీయ డిమాండ్ పెరుగుతుంది. అయితే, దేశ జాతీయ ఆస్తులను దోపిడీ చేయడం ద్వారా తమ లాభాలను గరిష్టంగా పెంచుకునేందుకు విదేశీ, దేశీయ పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం విధేయత కనబరుస్తున్నందున, ఈ సంక్షోభం మరింత అధ్వాన్నంగా మారుతుంది. భారతదేశ సంపదను ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ప్రజల సంక్షేమానికి పెట్టుబడిగా పెట్టేలా చూసేందుకు గాను ప్రభుత్వ అధికార పగ్గాలు బిజెపి చేతుల్లో వుండకుండా చూడడం ఎంతో ముఖ్యం.

/ 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

★

టెన్నికాయిట్ ప్రపంచకప్‌లో సత్తాచాటిన మౌనిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దక్షిణాఫ్రికాలో జరిగిన ఐదవ ప్రపంచ కప్ టెన్నికాయిట్ గర్ల్స్ డబుల్‌లో ఇండియా తరఫున ఆడిన ఆంధ్రప్రదేశ్ చెందిన హేమా మాధురి, ఆర్.మౌనిక మూడోస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. మెడల్ సాధించిన ఇద్దరు క్రీడాకారిణిల్లో విజయనగరం కెఎల్ పురానకి చెందిన రెడ్డి మౌనిక డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. టీమ్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. విజయనగరం ఖ్యాతిని మరో సారి ప్రపంచ స్థాయిలో మౌనిక చాటి చెప్పింది.

నేటి నుంచి అండర్-19 వన్డే టోర్నమెంట్

ఎసిఎ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి 16వరకు స్థానిక విజ్జి క్రికెట్ మైదానంలో అండర్ 19 వన్డే క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. విజ్జి క్రికెట్ మైదానంలో నూతనంగా నిర్మించిన క్రీడాకారుల రెస్ట్ రూం, స్కోర్ బోర్డు రూం, ఎంపైర్‌ల రూములను ప్రారంబించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మొత్తం ఆరు రాష్ట్రాలకు చెందిన అండర్ 19 బాలికలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనున్నారని తెలిపారు. వాటిలో మధ్యప్రదేశ్, కేరళ, మిజోరాం, బీహార్, బరోడా, అస్సాం జట్లు పాల్గొంటాయని తెలిపారు. రానున్న కాలంలో మన ఆంధ్ర ప్రదేశ్‌లో క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కషి చేయడం జరుగుతుందని తెలిపారు. విజయనగరం, విశాఖకు మధ్యలో త్వరలో 50వేల మంది ప్రజలు మ్యాచ్ ను చూసేందుకు అనుగుణంగా అంతర్జాతీయ క్రికెట్ మైదానం నిర్మాణం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ మైదానాలు అభివద్ధికి,అన్ని వసతులు ఏర్పాటు మంచి సహకారం ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ సభ్యులు,సెలక్టర్లు పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆలూరు (కర్నూలు)

అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని అంగస్కల్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగస్కల్ గ్రామానికి చెందిన ఎన్.జయరాముడు (55) తనకున్న నాలుగు ఎకరాల యసొంత పొలంతోపాటు మరో పది ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి పంటలు పండక రూ.15 లక్షల అప్పులు మిగిలాయి. రెండు రోజుల క్రితం ఆలూరు కెడిసిసి బ్యాంకు వారు రూ.6 లక్షలు అప్పు చెల్లించాలని నోటీసు పంపారు. ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియక శుక్రవారం రాత్రి దేవాలయానికి భజన చేసేందుకు వెళు న్నట్లు భార్య ఉచ్చీరమ్మతో చెప్పారు. తిరిగి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన మహిళలు గుర్తించి జయరాముడు చెట్టుకు ఉరేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతునికి భార్య ఉచ్చీరమ్మ, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి ఈరన్న, సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్ డిమాండ్ చేశారు.

కబడ్డీ ఫైనల్లో ఉత్కంఠ

ఇరాన్‌పై 33-29తో గెలుపు ● గంటపాటు నిలిచిన ఫలితం

ఆర్చరీ, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లో పసిడి



ఫలితం కోసం ఎదురుచూస్తున్న ఆటగాళ్లు

కెప్టెన్ సచిన్‌తో వాగ్వాదానికి దిగిన ఇరాన్ కోచ్

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో పురుషుల కబడ్డీ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు దారితీసింది. శనివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ 33-29 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. మరో నిమిషంలో మ్యాచ్ ముగుస్తుందనగా.. తీవ్రమైన హైడ్రామా చోటు చేసుకుంది. పాయింట్ల వద్ద ఆటగాళ్లు పట్టుపట్టడంతో ఆటను దాదాపు గంటపాటు సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సుదీర్ఘ సంప్రదింపుల తర్వాత భారత్‌ను విజేతగా ప్రకటించారు. మ్యాచ్ ప్రారంభం నుంచి ఇరుజట్ల ఆటగాళ్లు పాయింట్ల కోసం తీవ్రంగా శ్రమించారు. మ్యాచ్ ముగియడానికి 65 సెకన్ల సమయం మాత్రమే మిగిలి ఉన్న దశలో భారత్ నుంచి కెప్టెన్ పవన్ రైడ్‌కు వెళ్లాడు. ఇది డూ ఆర్ డై. అయితే, పవన్ మాత్రం ప్రత్యర్థి ఆటగాళ్లను టచ్ చేయకుండా లాబీ మీదకు వెళ్లిపోయాడు. అతడిని ఆపేందుకు ఇరాన్‌కు చెందిన నలుగురు డిఫెండర్లూ వెళ్లిపోయారు. దీంతో లాబీ మీదకు ఇరాన్ ఆటగాళ్లు వచ్చినందుకు తమకు పాయింట్లు ఇవ్వాలని భారత్.. ఎవరినీ టచ్ చేయకుండా పవనే లాబీపైకి వెళ్లినందుకు అతడిని ఔట్‌గా ప్రకటించాలని ఇరాన్ పట్టుబట్టింది. ఇక్కడే అధికారులకు సంకట స్థితి ఎదురైంది. భారత్ ఆటగాళ్లు పాత రూల్స్ ప్రకారమే పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేయగా.. ఇరాన్ మాత్రం కొత్త రూల్స్ ప్రకారం తమకు పాయింట్ ఇవ్వాలని పేర్కొంది. ఇరు జట్ల సిబ్బంది వాదోపవాదాలు చేసుకుంటూ ఉండగా.. ఆటగాళ్లంతా మ్యాట్‌పైనే కూర్చొండిపోయారు. సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం భారత్‌ను విజేతగా ప్రకటించడంతో భారత ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోయారు. ఇరాన్‌కు రజత పతకం, పాకిస్తాన్‌కు కాంస్య పతకం దక్కాయి. దీంతో ఆసియా క్రీడల్లో 2018లో మినహా 8సార్లు కబడ్డీలో భారత్ బంగారు పతకాన్ని ముద్దాడినట్లయ్యింది. అంతకుముందు ఉత్కంఠభరితంగా సాగిన మహిళల కబడ్డీ ఫైనల్లో భారత్ 26-25పాయింట్ల తేడాతో చైనీస్ తైపీని చిత్తుచేసి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ పతకంతో 19వ ఆసియా క్రీడల్లో భారత్ 'సెంచరీ' పతకాల మార్కుకు చేరుకుంది.

పురుషుల క్రికెట్‌లో స్వర్ణం

పురుషుల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో మెరుగైన రన్‌రేట్‌తో భారత్ బంగారు పతకం దక్కింది. టాస్ గెలిచిన ఇండియా.. ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు 18.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసిన తర్వాత భారీ వర్షంతో మ్యాచ్ నిలిచిపోయింది. గ్రౌండ్ చిత్తడిగా ఉన్న కారణంగా మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మెరుగైన రన్‌రేట్, ర్యాంకింగ్స్ ఆధారంగా భారత్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో పురుషుల క్రికెట్ జట్టుకు స్వర్ణ పతకం లభించగా.. ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు రజతం, బంగ్లాదేశ్‌కు కాంస్య పతకాలు దక్కాయి.

జ్యోతి సురేఖకు మరో స్వర్ణం

ఆసియా గేమ్స్ 2023లో తెలుగు తేజం, విజయవాడ అమ్మాయి జ్యోతి సురేఖ వెన్నం మరో స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. శనివారం మహిళల కాంపౌండ్ ఆర్చరీ కేటగిరీలో స్వర్ణ పతకాన్ని సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన చెవాన్‌సోపై 149-145 పాయింట్ల విజయం సాధించింది. మొదటి రౌండ్ నుంచీ వీరిద్దరి మధ్య పోటాపోటీగా పోరు సాగింది. మూడు రౌండ్ల తరువాత ఇద్దరూ దాదాపుగా సమవుజ్జీగా నిలిచారు. జ్యోతి సురేఖ-89, చెవాన్-87 పాయింట్లతో నిలిచారు. ఇదే పోరు చివరి రౌండ్ వరకూ కొనసాగడం తీవ్ర ఉత్కంఠతకు గురి చేసింది. గేమ్ చివరి రౌండ్‌కు వచ్చే సమయానికి రెండు పాయింట్లతో మాత్రమే ఆధిక్యతలో జ్యోతి సురేఖ నిలిచింది. జ్యోతి సురేఖ-142, చెవాన్ సో-140 పాయింట్లతో నిలిచారు. చివరి రౌండ్‌లో మాత్రం జ్యోతి సురేఖ ఆధిపత్యం స్పష్టంగా కొనసాగింది. ఒకేసారి నాలుగు పాయింట్లను సాధించింది. దీంతో జ్యోతి సురేఖ 146-140 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని సాధించారు. కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత పురుషుల విభాగంలో ఓజాస్ ప్రవీణ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో అదితి కాంస్య పతకాన్ని చేజిక్కించుకోగా.. అభిషేక్ వర్మ రజత పతకాన్ని సాధించాడు.

బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి సత్తా చాటారు. కొరియాకు చెందిన జోడీ ఛో-సోల్యీ, కిమ్ వాన్ హోపై కేవలం 57ని.లో గెలిచారు. భారత జోడీ 21-18, 21-16తో వరుససెట్లలోనూ కొరియా జోడీని చిత్తుచేశారు. దీంతో దీంతో వచ్చే వారం ప్రకటించే బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి వీరు చేరుకోనున్నారు. ఇక 41ఏళ్ల తర్వాత పురుషుల డబుల్స్‌లో భారత్‌కు పతకం దక్కింది. 1982లో లియోరయ్ దేశాయ్-ప్రదీఫ్ గాంధీ చివరిసారిగా కాంస్య పతకం సాధించారు. ఈసారి బ్యాడ్మింటన్ విభాగంలో టీమ్ విభాగంలో రజతం, వ్యక్తిగత విభాగంలో ప్రణయ్ కాంస్య పతకాలు నెగ్గిన సంగతి తెలిసిందే.

రెజ్లింగ్, చెస్‌లో రజతాలు

పురుషుల రెజ్లింగ్ 86 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో భారత రెజ్లర్ దీపక్ పూనియా రజత పతకం సాధించాడు. ఫైనల్లో ఇరాన్ రెజ్లర్ హసన్ యజ్దానీతో తలపడిన దీపక్ పూనియా 10-0 తేడాతో ఓటమిపాలై రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్లో విజయంతో యజ్దానీ స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. పురుషుల చెస్‌లో కూడా భారత్‌కు రజతం దక్కింది. విదిత్, అర్జున్, హరికృష్ణ తమ 9వ రౌండ్‌లో ఫిలిప్పీన్స్‌తో తలపడి రెండో స్థానానికి చేరడం ద్వారా రజతం గెలుచుకున్నారు. ఇరాన్ ఆటగాళ్లు అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని చేజిక్కించుకున్నారు.

ఇక మహిళల హాకీ జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో తృటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్న భారత మహిళలజట్టు ఈసారి జపాన్‌పై సమిష్టిగా రాణించింది. ఉత్కంభరితంగా సాగిన కాంస్య పతక పోరులో భారత్ 2-1గోల్స్ తేడాతో జపాన్‌ను చిత్తుచేసింది. తొలి రెండు క్వార్టర్లు పూర్తయ్యే సరికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. నాల్గో క్వార్టర్ 50వ ని.లో భారత్ ఒక గోల్ చేయడంతో కాంస్య పతకం భారత్‌కు ఖాయమైంది. 14వ రోజు పోటీలు ముగిసేసరికి భారత్ రికార్డుస్థాయిలో 107పతకాలతో 4వ స్థానంలో నిలిచింది.

ఇండియన్ బ్యాంక్ (इंडियन बैंक) — इलाहाबाद ALLAHABAD

ప్రకాశం రోడ్ బ్రాంచి : # 27-6-170, అన్నపూర్ణ థియేటర్ ప్రక్కన, ప్రకాశం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX- IV-A" [See proviso to rule 6(2) & 8 (6)]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్స్ ఇండియన్ బ్యాంక్ వారికి **1) శ్రీ అర్జంపూడి రమేష్,** తండ్రి : శ్రీ అర్జంపూడి రామ కోటేశ్వరరావు, డి.నెం. 39-3-32, శ్రీ లక్ష్మి గణపతి ప్లాజా, మసీదు వీధి, లబ్బీపేట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఎపి (ఋణగ్రహీత). **2) శ్రీ అర్జంపూడి రామ కోటేశ్వరరావు,** డి.నెం. 39-3-32, శ్రీ లక్ష్మి గణపతి ప్లాజా, మసీదు వీధి, లబ్బీపేట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఎపి (సహ ఋణగ్రహీత) **3) శ్రీమతి అర్జంపూడి వెంకట రమణ,** భర్త : రామ కోటేశ్వరరావు, ఫ్లాట్ నెం. 3, 3వ అంతస్తు, అనుపమ అపార్ట్‌మెంట్, డోర్ నెం. 39-2-53/1, లబ్బీపేట, విజయవాడ (హామీదారు మరియు తనఖాదారు) వారు ది. 08-09-2022 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ. 10,20,909/-** (అక్షరాల పది లక్షల ఇరవై వేల తొమ్మిది వందల తొమ్మిది రూపాయలు మాత్రమే) మరింత వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరచుకోబడిన బ్యాంక్ తనఖా / ఆధీనంలో ఉన్న దిగువ వివరించిన స్థిరాస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా ఉంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది"** పద్ధతిపై తేది **30-10-2023**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు) ఇందు మూలముగా సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు

షెడ్యూల్-ఎ : విజయవాడ, లబ్బీపేట, పిచ్చయ్య వీధి, బ్లాక్ నెం. 20, మొగల్‌రాజపురం గ్రామ రెవిన్యూ వార్డు నెం. 10, డి.నెం. 39-2-53/1, మున్సిపల్ వార్డు నెం. 28, ఎన్‌టిఎస్ నెం. 506 వద్ద మొత్తం 999.3/9 చ॥గ॥ల స్థలంలో అవిభక్త మరియు పేర్కొనబడని వాట 41.64 చ॥గ॥ల స్థలం. హద్దులు : తూర్పు : పిచ్చయ్య వీధి @ మున్సిపల్ రోడ్డు, దక్షిణం : మోహన్‌దాస్ & ఇతరుల ఆస్తి, పడమర : మోహన్‌దాస్ & ఇతరుల ఆస్తి, ఉత్తరం : ఖాసీం మరియు ఇతరుల ఆస్తి.

షెడ్యూల్ -బి : అసిస్‌మెంట్ నెం. 575705 వద్ద ప్లింత్ ఏరియా 704 చ॥అ॥లు, కామన్ ఏరియా 30 చ॥అ॥లు మరియు కామన్ పార్కింగ్ మరియు కార్ పార్కింగ్ ఏరియా 120 చ॥అ॥ల విస్తీర్ణంలో అనుపమ అపార్ట్‌మెంట్స్ నందు 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం. 3. హద్దులు : తూర్పు : కారిడార్ & లిఫ్ట్, దక్షిణం : ఫ్లాట్ నెం. 4, పడమర : శూన్యాకాశము, ఉత్తరం : శూన్యాకాశము

ఇంతకముందు తాకట్టు రుణభారాలు : లేవు | రిజర్వుధర : రూ. 31,10,000/-

ధరావత్తు : 3,50,000/- | బిడ్ పెంపుదల మొత్తం : 10,000/-

ఈ-వేలం తేది మరియు సమయం : 30-10-2023 - ఉ. 11 గం. నుండి సా॥ 5 గం.లకు

ఈ ఆక్షన్ కొరకు బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది & సమయం : ది 29-10-2023, సా॥ 5.00 గం. వరకు

ప్రాపర్టీ ఐడి నెం. : IDIB50033155716

వేలం నందు పాల్గొనువారు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ MSTC Ltd వారి వెబ్‌సైట్‌ను సందర్శించి (www.mstcecommerce.com) వేలం నందు పాల్గోదలచినవారు టెక్నికల్ సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ వారి నెంబరు 033-22901004 మరియు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లు సర్వీసు ప్రొవైడర్లు హెల్ప్‌డెస్క్ నందు అందుబాటులో కలవు. రిజిస్ట్రేషన్ సౌలభ్యం కొరకు MSTC Ltd Mail ID : ibapiop@mstcecommerce.com మరియు EMD స్థితిని తెలుసుకొనుటకు ఈ క్రింది Email ID : ibapifin@mstcecommerce.com వారిని సంప్రదించగలరు.

ఆస్తి వివరాలు, ఆస్తికి సంబంధించిన ఫోటోలు మరియు వేలం నియమ నిబంధనలు కొరకు http://ibapi.in ను సంప్రదించవలసిన వారు మరియు పోర్టల్‌కు సంబంధించిన వివరణల కొరకు ఫోన్ నెంబర్లు : 18001025026, 011-41106131.

బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన ఐడి నెంబరు ఉపయోగించి వెబ్‌సైట్ **http://ibapi.in** మరియు **(https://www.mstcecommerce.com/auctionhome/ibapi)** నందు సంప్రదించగలరు.

తేది : 06-10-2023 | **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ | **ఇండియన్ బ్యాంక్**

చేప రైతు విలవిల..!

- భారీగా తగ్గిన రూప్‌చంద్ ధర
- కిలో రూ.70లోపే పలుకుతున్న దుస్థితి
- కిలో చేప పెంపునకయ్యే ఖర్చు రూ.95
- ధర పతనంతో లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రూప్‌చంద్ చేపల సాగు చేసే రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర భారీగా పడిపోవడంతో సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. పరిస్థితి ఎప్పటికి కుదుటపడుతుందో తెలియక ఆక్వా రైతులు నలిగిపోతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రొయ్యల సాగు తర్వాత పెద్దఎత్తున రూప్‌చంద్ చేపల సాగు సాగుతోంది. వేలాది ఎకరాల్లో రూప్‌చంద్ సాగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కొంతకాలం క్రితం వరకూ కిలో రూప్‌చంద్ చేప ఖరీదు రూ.వందకుపైగా ఉండేది. దీంతో రైతులకు ఇబ్బంది ఉండేది కాదు. పశ్చిమబెంగాల్, బీహార్ వంటి అనేక రాష్ట్రాలకు ఎగుమతి కావడంతోపాటు స్థానికంగా ఈ చేపలను ఎక్కువగా ఉపయోగిస్తారని చెబుతున్నారు. శ్రావణమాసం, వినాయకచవితి వంటి అనేక కారణాలతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు భారీగా తగ్గిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కిలో రూప్‌చంద్ ధర రూ.70లోపే పలుకుతోంది. కిలో రూప్‌చంద్‌ను తయారు చేయడానికి అన్ని ఖర్చులూ కలుపుకుని రూ.95 వరకూ ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మేత ఖర్చు ఎక్కువ మొత్తంలో అవుతుంది. ధర పతనంతో కిలో చేపకు రూ.25 వరకూ రైతులు నష్టపోతున్నారు. ఎకరా చెరువులో నాలుగు వేల నుంచి ఐదు వేల వరకూ రూప్‌చంద్ చేప పిల్ల వేస్తారు. దిగుబడి సైతం నాలుగు టన్నుల వరకూ వస్తుంది. ధర పతనంతో ఎకరాకు రూ.2.50 లక్షల వరకూ రైతులు నష్టపోతున్నారు. ఐదెకరాల చెరువుల్లో రూప్‌చంద్ సాగు చేస్తే దాదాపు రూ.12 లక్షల వరకూ రైతులు నష్టం చవిచూడాల్సి వస్తోంది. దీంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కనీసంగా కిలో చేప రూ.80కైనా కొనుగోలు చేయాలంటూ వ్యాపారులను రైతులు కోరుతున్నారు. ఆ విధంగా కొనుగోలు చేస్తే కొంతలో కొంత నష్టాలు తగ్గుతాయని రైతులు భావిస్తున్న పరిస్థితి నెలకొంది. వేల ఎకరాల్లో సాగుతున్న రూప్‌చంద్ చేపల సాగుపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఉంగుటూరు మండలంలో ఆక్వా రైతులు, ట్రేడర్స్ సమావేశమై కిలో రూప్‌చంద్ రూ.80కు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇది అమలు జరుగుతుందా, లేదా అనేది చూడాలి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. రూప్‌చంద్ ధర తగ్గుదలపై మత్స్యశాఖ జెడి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్‌ను వివరణ కోరగా రూప్‌చంద్ ధర కొంత తగ్గినమాట వాస్తవమేనన్నారు. దీనిపై ట్రేడర్స్‌తో మాట్లాడామని, మేత ధరలు తగ్గించడం వంటి చర్యలు చేపట్టామని వివరించారు.

రూ.80కు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని కోరాం

పొత్తూరి శ్రీనివాసరాజు, ఆక్వారైతు, ఉంగుటూరు

రూప్‌చంద్ చేప ధర బాగా తగ్గిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. కిలో చేప పెంపునకు అన్ని ఖర్చులూ కలుపుకుని రూ.95 వరకూ అవుతోంది. మార్కెట్లో ధర మాత్రం కిలో రూ.70లోపే ఉంది. ప్రస్తుత పరిస్థితి నుంచి రైతులు బయట పడాలంటే కిలో రూ.80కైనా కొనుగోలు చేయాలని ట్రేబర్స్‌ను కోరాము. ఆక్వారైతులు, ట్రేడర్స్‌తో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. 15వ తేదీన మరోసారి పెద్దఎత్తున సమావేశం నిర్వహించనున్నాం.

सेन्ट्रल बैंक ऑफ़ इंडिया
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
1911 से आपके लिए "केंद्रित" "CENTRAL" TO YOU SINCE 1911

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బెంజ్ సర్కిల్ బ్రాంచి, విజయవాడ-520010, విజయవాడ రీజియన్, ఫోన్: 0866-2472608
E-MAIL : bmvija1567@centralbank.co.in.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు) [రూల్ 8(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం **సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత: 1) M/s.స్కోన్ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఎఫ్-301, డిజె రత్నం టవర్స్, బ్రాడీపేట, 6/13, గుంటూరు-522002. **2) M/s.స్కోన్ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్,** సర్వే నెం.142/2, కుంటముక్కల గ్రామము, జి కొండూరు మండలం, కృష్ణా జిల్లా-521229. **3) శ్రీమతి కంచర్ల కృష్ణవేణి (మేనేజింగ్ డైరెక్టర్: M/s.స్కోన్ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్), భర్త: శ్రీ కంచర్ల మోహనరావు,** ఎఫ్-301, డిజె రత్నం టవర్స్, బ్రాడీపేట, 6/13, గుంటూరు-522002. **4) శ్రీమతి కొండపల్లి రాధాశ్రీరామ్ (డైరెక్టర్: M/s.స్కోన్ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్), భర్త: శ్రీ కెయస్ఆర్ శర్మ,** 11-12-233, రోడ్డు నెం.4, హనుమాన్ టెంపుల్ దగ్గర, శ్రీ రామకృష్ణాపురం, సరూర్‌నగర్, హైదరాబాద్-500035. **హామీదారులు: 1) శ్రీ కంచర్ల విజయకృష్ణ, భర్త: శ్రీ కంచర్ల మోహనరావు,** ఎఫ్-301, డిజె రత్నం టవర్స్, బ్రాడీపేట, 6/13, గుంటూరు-522002. **2) శ్రీ కంచర్ల మురళీకృష్ణ, తండ్రి: లేటు కంచర్ల వెంకటేశ్వరరావు,** #107, వియన్ఆర్ టవర్స్, 1వ లైను, రాజేంద్రనగర్, గుంటూరు 6/13, గుంటూరు-522006. **3) శ్రీమతి కంచర్ల విజయలక్ష్మి, భర్త: లేటు కంచర్ల వెంకటేశ్వరరావు,** పాత డోర్ నెం.1-98 & 1-99, అసెస్ట్ #309, వార్డు నెం.3, మోతడక గ్రామము, తాడికొండ పంచాయతీ, అమరావతి, గుంటూరు జిల్లా-522236 **వారు** మొత్తం బకాయిసొమ్ము **రూ.5,50,71,405/- (అక్షరాల ఐదు కోట్ల యాభై లక్షల డెబ్బై ఒక్క వేల నాలుగు వందల ఐదు రూపాయలు మాత్రమే) (13(2) నోటీసు తేదీ వరకు వడ్డీ కలపబడినది) మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలు** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.07-06-2023న డిమాండ్ నోటీసు** జారీచేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీత, హామీదారు విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13 (4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న **ఆస్తిని 7 అక్టోబర్ 2023 న స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతకు, హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **07-06-2022 తేదీనాటికి చెల్లించాల్సిన బకాయిమొత్తము రూ.5,50,71,405/- (అక్షరాల ఐదు కోట్ల యాభై లక్షల డెబ్బై ఒక్క వేల నాలుగు వందల ఐదు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకానిని హెచ్చరించడమైనది. **సదరు చట్టం 13వ విభాగం యొక్క ఉప విభాగం(8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతలకు విన్నవించటమైనది.**

స్థిరాస్తి యొక్క వివరములు

(i) బ్యాంక్ నందు తనఖా వుంచిన పెదకాకాని యస్ఆర్‌ఓ ముందు **16-04-2015** తేదీగల రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. **1850/2015** ప్రకారము **శ్రీ కంచర్ల విజయకృష్ణ, తండ్రి: శ్రీ కంచర్ల మోహనరావు** పేరునగల **ఆస్తి.** గుంటూరు, పెదకాకాని, సాయినగర్, అగతవరప్పాడు గ్రామము, సమీప డోర్ నెం.1-98, ఆర్.యస్. నెం.156/బి నందు 259 చ॥గ॥ విస్తీర్ణముగల ఖాళీ రెసిడెన్షియల్ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి సరిహద్దులు: ఉత్తరం:** పొందూరి సుబ్బారావు యొక్క ఆస్తి; **దక్షిణం:** 25 అ॥ వెడల్పుగల రోడ్డు; **తూర్పు:** చిగురుపాటి సుబ్బారావు యొక్క ఆస్తి; **పడమర:** నల్లమోతు సాంబమ్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి.

(ii) **బ్యాంక్ నందు తనఖా వుంచిన అమరావతి యస్ఆర్‌ఓ ముందు 14-03-2016 తేదీగల రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 929/2016** ప్రకారము **శ్రీ కంచర్ల విజయలక్ష్మి, భర్త: లేటు కంచర్ల వెంకటేశ్వరరావు మరియు శ్రీ కంచర్ల మురళీ కృష్ణ, తండ్రి: లేటు కంచర్ల వెంకటేశ్వరరావు పేరునగల ఆస్తి.** గుంటూరు జిల్లా, అమరావతి, తాడికొండ పంచాయతీ & మండలం, గాంధీబొమ్మ సెంటర్, మోతడక గ్రామము, వార్డు నెం.3, అసిస్ట్ నెం.309, న్యూ డోర్ నెం.3-28, పాత డోర్ నెం.1-98 & 1-99, ఆర్.యస్. నెం.155/బి నందు 562 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలము మరియు రెసిడెన్షియల్ ఇంటికి సంబంధించిన యావదాస్తి. **దీనికి సరిహద్దులు: ఉత్తరం:** మోతడక రాధాకృష్ణ మూర్తి & కొనకల్ల వెంకటేశ్వరరావు యొక్క ఆస్తి; **దక్షిణం:** సర్కారు బజారు; **తూర్పు:** యస్.సీతారామాంజనేయులు యొక్క ఆస్తి; **పడమర:** సర్కారు బజారు.

తేది: 07-10-2023, ప్రదేశము: విజయవాడ | సం/- అధీకృత అధికారి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

सत्यमेव जयते
MINISTRY OF SOCIAL JUSTICE & EMPOWERMENT
GOVERNMENT OF INDIA

సామాజిక న్యాయం & సాధికారత శాఖ

ప్రకటిస్తున్నది

26 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

షెడ్యూల్డ్ కులాలు & ఇతర వెనుకబడిన వర్గాలకు చెందినవారు పాఠశాల విద్యను అభ్యసించడానికి

2023-24 సంవత్సరానికి ఎస్సీలు & ఇతరులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల పథకం

అర్హత	పరిధి	ఎన్‌టైటిల్‌మెంట్
కంపోనెంట్-1 • విద్యార్థి ఎస్సీ వర్గానికి చెందినవారై ఉండాలి. • తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించకూడదు	• గుర్తింపు పొందిన పాఠశాలల్లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు • రాష్ట్ర ప్రభుత్వం/కేంద్రపాలిత ప్రాంతం ద్వారా దరఖాస్తులు ఆమోదించబడతాయి మరియు ధృవీకరించబడతాయి • పేద కుటుంబాల కవరేజీ	• అకడమిక్ అలవెన్స్ వార్షికంగా **రూ.3500** నుండి **రూ.7000** వరకు దివ్యాంగ్ (ప్రత్యేక సామర్థ్యం ఉన్న) • విద్యార్థులకు 10% అదనపు భత్యం
కంపోనెంట్-2 • తల్లిదండ్రులు/సంరక్షకులు శుభ్రపరిచే వృత్తులలో నిమగ్నమై ఆరోగ్య ప్రమాదాలకు గురయ్యే విద్యార్థులు • ఆదాయ పరిమితి ప్రమాణాలు లేవు	• గుర్తింపు పొందిన పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు • రాష్ట్ర ప్రభుత్వం/కేంద్రపాలిత ప్రాంతం ద్వారా దరఖాస్తులు ఆమోదించబడతాయి మరియు ధృవీకరించబడతాయి • పేద కుటుంబాల కవరేజీ	• అకడమిక్ అలవెన్స్ వార్షికంగా **రూ.3500** నుండి **రూ.8000** వరకు పెంపు • దివ్యాంగ్ (ప్రత్యేకంగా వికలాంగులు) విద్యార్థులకు 10% అదనపు భత్యం

- విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్ర స్కాలర్‌షిప్ పోర్టల్‌లలో దరఖాస్తు చేసుకోవాలి
- విద్యార్థి తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (యుఐడి), ఆధార్ సీడెడ్ బ్యాంక్ ఖాతా, ఆదాయ ధృవీకరణ పత్రం మరియు కుల ధృవీకరణ పత్రాన్ని కలిగి ఉండాలి

- పథకం మార్గదర్శకాలు మరియు వివరణాత్మక అర్హత ప్రమాణాలు
http://socialjustice.gov.in/schemes/23

cbc 38101/11/0034/2324

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం

విశాఖ డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వు పోలీసు గ్రౌండ్‌లో అండర్ 17 విభాగం అథ్లెటిక్ విభాగం రన్నింగ్‌లో టిఎన్‌వి దుర్గ, కె.కావ్య ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు రాయవరం వ్యాయామోపాధ్యాయుడు కె శ్రీనువాసరావు తెలిపారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేది : 04.10.2023, టెండర్ నోటీసు నం.07-మెచ్-కోర్-ఎడబ్ల్యూ-టిపిటివై-23-24 PUB/1118

భారత రాష్ట్రపతి మరియు చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి, సౌత్ సెంట్రల్ రైల్వే తరపున క్రింది విధమైన పనుల కొరకు ప్రఖ్యాతి పొందిన కాంట్రాక్టర్ల నుండి ఐరెప్స్ ద్వారా ఓపెన్ టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.1, టెండర్ నం.: 07-మెచ్-కోర్-ఎడబ్ల్యూ-టిపిటివై-23-24, తేది : 04.10.2023, పని వివరణ : సిఆర్ఎస్/టిపిటివై వద్ద ఐసిఎఫ్ డిజైన్ కోచులలో కొర్రోషన్ మరమత్తులు. అంచనా విలువ (రూ.): రూ.1,70,61,909.60/-, (ఒక కోటి డెభై లక్షల అరవై ఒక వేల తొమ్మిది వందల తొమ్మిది రూపాయల అరవై పైసలు మాత్రమే), బిడ్ సెక్యూరిటీ (రూ.) : రూ.2,35,300/-, టెండర్ ఫారం ఖరీదు (రూ.) : 0 (దయచేసి క్రింది గమనిక:1ని చూడండి), పూర్తి వ్యవధి : పని ప్రారంభ తేది నుండి 12 నెలలు.

గమనిక - 1 : జిసిసి 2022 యొక్క పారా నెం.3 (పార్ట్-1) ప్రకారం టెండర్‌దారులందరికీ ఇ-టెండర్ ఫారంలు ఉచితంగా జారీ చేయబడతాయి. అందువల్ల, టెండర్ డాక్యుమెంట్ ధరను టెండర్ డాక్యుమెంట్‌లో పేర్కొనలేదు.

క్ర.సం.:1, వివరణ : టెండర్ బాక్స్ ముగింపు, సమయం : 11.00 గం., తేది : 26.10.2023

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి.

తేది : 05.10.2023, టెండర్ నోటీసు నం.:08-మెచ్-ఎఫ్‌డబ్ల్యూ-ఎడబ్ల్యూ-టిపిటివై-23-24 PUB/1119

భారత రాష్ట్రపతి మరియు చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి, సౌత్ సెంట్రల్ రైల్వే తరపున క్రింది విధమైన పనుల కొరకు ప్రఖ్యాతి పొందిన కాంట్రాక్టర్ల నుండి ఐరెప్స్ ద్వారా ఓపెన్ టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.:1, టెండర్ నం.: 08-మెచ్-ఎఫ్‌డబ్ల్యూ-ఎడబ్ల్యూ-టిపిటివై-23-24, తేది : 05.10.2023, పని వివరణ : సిఆర్ఎస్/టిపిటివై వద్ద ఐసిఎఫ్ డిజైన్ కోచులలో ఫర్నీషింగ్ మరియు అనుబంధ పనులు. అంచనా విలువ (రూ.) : రూ.1,33,48,889.76/- (ఒక కోటీ ముప్పై మూడు లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై తొమ్మిది రూపాయల డెభై ఆరు పైసలు మాత్రమే), బిడ్ సెక్యూరిటీ (రూ.) : రూ.2,16,800/- టెండర్ ఫారం ఖరీదు : రూ.0, (దయచేసి క్రింది గమనిక :1 ని చూడండి) పూర్తి గడువు : పని ప్రారంభం నుండి 12 నెలలు.

గమనిక : 1. జిసిసి 2022 ప్రకారం టెండర్‌దారులందరికీ ఇ-టెండర్ ఫారంలు ఉచితంగా జారీ చేయబడతాయి. అందువల్ల, టెండర్ డాక్యుమెంట్ ధరను టెండర్ డాక్యుమెంట్‌లో పేర్కొనలేదు.

క్ర.సం.:1, వివరణ : టెండర్ బాక్స్ ముగింపు, సమయం : 11.00 గం., తేది : 27.10.2023

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి.

తేది : 06.10.2023, ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం.డిఆర్ఎమ్/వర్క్స్/బిజెడ్ఎ/26/2023 PUB/1121

భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారు ప్రతిసారి వ్యతిరేకంగా పేర్కొన్న తేది మరియు 15.00 గం.వరకు క్రింది విధమైన పనుల కొరకు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.:1, టెండర్ నం.: ఇ-24-సౌత్-బిజెడ్ఎ-2023, పని వివరాలు : పని పేరు : జిడిఆర్-బిజెడ్ఎ సెక్షన్: ఎయిర్ పుషింగ్ మెథడ్ ద్వారా కావలి-శ్రీ వెంకటేశ్వరపాలెం స్టేషన్ల మధ్య 221/16-18 కి.మీ. వద్ద ఎల్‌సి నం.155 కి బదులుగా లిమిటెడ్ హైట్ సబ్‌వే (ఎల్‌హెచ్ఎస్) ప్రతిపాదిత నిర్మాణం. పూర్తి గడువు : 09 (తొమ్మిది) నెలలు. టెండర్ విలువ : రూ.8,33,59,814/- ఇ.ఎమ్.డి. : రూ.5,66,800/-, ముగింపు తేది : 23.10.2023

క్ర.సం.: 2, టెండర్ నం.: ఇ-25-సౌత్-బిజెడ్ఎ-2023, పని వివరాలు : పని పేరు : బిజెడ్ఎ డివిజన్ : రైల్వే సరఫరా, బల్లాస్ట్ లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ద్వారా 37.550 కి.మీ. మొత్తం పొడవు కొరకు కెఎపిటి-విఆర్‌జెఎన్-వికెటి/కెఎమ్‌ఎల్‌పి మధ్య టేకింగ్ అప్ డీప్ స్క్రీనింగ్ పని కొరకు టంపింగ్ మిషన్‌తో పాటు బిసిఎమ్‌ల స్పారింగ్. పూర్తి గడువు : 06 (ఆరు) నెలలు. టెండర్ విలువ: రూ.4,95,61,200/-, ఇఎమ్‌డి : రూ.3,97,800/-, ముగింపు తేది : 25.10.2023

క్ర.సం.: 3, టెండర్ నం.: ఇ-18-నార్త్-బిజెడ్ఎ-2023, పని వివరాలు : పని పేరు : ఎస్‌డబ్ల్యూ-1 : విజయవాడ-విశాఖపట్నం సెక్షన్ : టిఆర్ఆర్(పి)-డిఇఎన్/నార్త్/బిజెడ్ఎ అధికార పరిధి యొక్క పుల్ల-దువ్వాడ స్టేషన్ల మధ్య వివిధ స్థానాల వద్ద యుపి మరియు డిఎన్ పై 20.009 కి.మీ. ఎస్‌డబ్ల్యూ-2 : బిజెడ్ఎ డివిజన్ : టిఆర్ఆర్ (పి)-ఎడిఇఎన్/ఆర్‌జెవై సబ్ డివిజన్ యొక్క ఎస్ఎస్ఇ/పి.వే/ఆర్‌జెవై సెక్షన్ లో 577.870-578.600 కి.మీ. వద్ద డిఎన్ లైన్ పై 0.730 కి.మీ. ఎస్‌డబ్ల్యూ-3 : బిజెడ్ఎ డివిజన్ : టిఆర్ఆర్(పి)-ఎడిఇఎన్/ఆర్‌జెవై సబ్ డివిజన్ యొక్క ఎస్ఎస్ఇ/పి.వే/ఆర్‌జెవై సెక్షన్ లో 586.809-587.869 కి.మీ. వద్ద షార్ప్ కర్వ్ (2 డిగ్రీ మరియు పైన) యుపి లైన్ పై 1.060 కి.మీ. పూర్తి గడువు : 12 (పన్నెండు) నెలలు. టెండర్ విలువ : రూ.1,38,16,023/-, ఇఎమ్‌డి : రూ.219100/-, ముగింపు తేది : 30.10.2023

క్ర.సం.: 4, టెండర్ నం.: ఇ-19-నార్త్-బిజెడ్ఎ-2023, పని వివరాలు : పని పేరు : అనపర్తి స్టేషన్ వద్ద కొత్త స్టేషన్ భవనం ప్రతిపాదిత నిర్మాణం. పూర్తి గడువు : 09 (తొమ్మిది) నెలలు, టెండర్ విలువ : రూ.2,70,61,468/-, ఇఎమ్‌డి : రూ.2,85,300/-, ముగింపు తేది : 30.10.2023

ఏదైనా టెండర్ కొరకు మార్పులు/సవరణ ఏదైనా ఉంటే టెండర్ ముగింపు తేదికి ముందు భావి టెండర్‌దారులు వెబ్‌సైట్ www.ireps.gov.in ని సందర్శించమని సూచించబడ్డారు.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్) విజయవాడ

సగానికి సగమే..!

- తుంగభద్ర డ్యామ్‌లో గతేడాది ఫుల్...ఈ ఏడాది హాఫ్..
- హెచ్ఎల్ఎంసికి సగం కంటే తక్కువే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ప్రధానమైన సాగునీటి వనరుగా తుంగభద్ర డ్యామ్ ఉంది. ఆ డ్యామ్ నుంచే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు నీరొస్తుంది. అదే సాగు, తాగునీటి అవసరాలనే తీర్చే ఏకైక వనరుగానుంది. ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌కు నీరు ఆశించినంత రాలేదు. సాధారణంగా ఆగస్టు, సెప్టంబర్ మాసాల్లోనే ఈ డ్యామ్‌కు నీరు పుష్కలంగా వచ్చేది. ఈసారి తుంగభద్ర ఎగువ భాగంలో వర్షాలు ఆశించినంత రాకపోవడంతో డ్యామ్ కూడా నీరు చాలా తక్కువగా వచ్చింది. దీంతో డ్యామ్ కిందనున్న కాలువలకు నీటి కేటాయింపులు తగ్గిపోయాయి.

సగానికి సగమే..

గతేడాది ఇదే సమయానికి తుంగభద్ర డ్యామ్‌కు 536.20 టిఎంసిల నీరు వచ్చింది. జూన్ నుంచి అక్టోబరు నాటికి వచ్చింది. దీంతో గేట్లు ఎత్తి పలుమార్లు నీటిని నదిలోకి వదిలారు. ఇంత పెద్దఎత్తున నీరు రావడంతో ఇదే సమయానికి డ్యామ్ కూడా నిండుకుండలాగా తొనకిసలాడుతూ ఉంది. పూర్తి సామర్థ్యంతో 105.79 టిఎంసిల నీరు ఉంది. ఇన్‌ఫ్లో కూడా ఈ సమయానికి 23,727 క్యూసెక్కులుండేవి. ఇప్పుడు చూస్తే అక్టోబర్ ఆరవ తేదీ నాటికి డ్యామ్‌లో నీటి మట్టం కేవలం 52.73 టిఎంసిలే ఉంది. 4437 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో ఉంది. ఇక తుంగభద్ర ఎగువ భాగం పెద్దగా వర్షాలొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జూన్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన నీరే 106 టిఎంసిలు ఉన్నాయి. ఈ నీటిని ఇప్పటికే వినియోగించుకుంటూ ఉండటంతో సగం తగ్గిపోయాయి. ఈ ప్రభావం దిగువనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, దిగువ ప్రధాన కాలువలకు నీటి కేటాయింపుల్లోనూ కోత పడింది.

కాలువకు తగ్గిన నీరు

తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత తగ్గడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటి కేటాయింపుల్లో కోతపడింది. జూన్‌లో వేసిన అంచనాల ప్రకారం 26.828 టిఎంసిల నీరు వస్తుందనుకున్నారు. తాజా అంచనాల ప్రకారం అది 16 టిఎంసిలకే పడిపోయింది. గతేడాదితో పోలిస్తే సగం కంటే తక్కువే కావడం గమనార్హం. గతేడాది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు వచ్చింది 36.50 టిఎంసిలు. ఈ ఏడాది 16 టిఎంసిలే కావడం గమనార్హం. అది కూడా గతేడాది కంటే తక్కువగా నీరు జిల్లాకు రానుంది. ఇది తాగునీటి అవసరాలకు సరిపోనుంది. ఈ నేపథ్యంలో నీరొస్తుందని ఆశించిన పంటలు సాగు చేసిన ఆయకట్టుకు రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇదికూడా నవంబరు ఒకటికి నీటిని నిలిపివేసే సూచనలు కనిపిస్తుండటంతో ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రైతులు తీవ్రంగా నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

14న సిఐటియు రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 14, 15వ తేదీల్లో అనంతపురంలో రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 70 లక్షల మంది ఉద్యోగ, కార్మికులకు ప్రాతినిధ్యం వహించే అతిపెద్ద కార్మిక సంస్థగా సిఐటియు నిలిచిందన్నారు. రాష్ట్రం, దేశంలో ఉద్యోగ, కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న కార్మికుల సమస్యలపై చర్చించి, కార్యక్రమాలు చేపట్టడం కోసం ఈనెల14, 15వ తేదీల్లో అనంతపురంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ముత్తుజా, నాగభూషణం, రాము, నాగరాజు, మున్నూరు స్వామి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- యువతి మృతి
- చావుబతుకుల మధ్య ప్రియుడు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరన్న మనస్తాపంతో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని కిష్టపాడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో యువతి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కిష్టపాడు గ్రామానికి చెందిన అలేఖ్య(17), లోకేశ్వర్‌రెడ్డిలు ప్రేమించుకున్నారు. గుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో అలేఖ్య చదువుతున్నారు. ఇటీవల ప్రేమ విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు తెలిపారు. కులాలు వేరుకావడంతో వీరి పెళ్లికి రెండు కుటుంబాల వారు ఒప్పుకోలేదు. తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోలేదన్న ఆందోళనతో ఈనెల ఒకటో తారీఖున ఇద్దరు గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అలేఖ్య శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. లోకేశ్వర్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఫారం నం. ఐఎన్‌సి-26
(కంపెనీల (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 30 అనుసరించి)
కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసును ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రంకు మార్చుట కొరకు ప్రకటన
కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ సంచాలకులు, ఆగ్నేయ విభాగం, హైదరాబాద్ వారి సమక్షంలో
కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) మరియు కంపెనీల (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 30 యొక్క సబ్-రూల్ (5) యొక్క క్లాజ్ (ఎ) విషయంలో
మరియు
ఏరువాక టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ విషయంలో ("కంపెనీ/దరఖాస్తుదారు") విషయంలో
రిజిస్టర్డు ఆఫీసు: ప్లాట్ నం.69, రోడ్ నం.5, శ్రీ కనక దుర్గా గజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, గురునానక్ రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520008.

ఇందుమూలంగా సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీ దాని రిజిస్టర్డు ఆఫీసును "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం" నుండి "తెలంగాణ రాష్ట్రం"కి మార్చుటకు కంపెనీకి వీలుగా 04 అక్టోబర్, 2023 బుధవారం రోజున నిర్వహించబడిన అసాధారణ సర్వసభ్య సమావేశం వద్ద చేసిన ప్రత్యేక తీర్మానం యొక్క నియమాలలో కంపెనీ యొక్క మెమోరండం ఆఫ్ అసోసియేషన్ యొక్క సవరణ కొరకు ఆమోదం కోరుతూ, కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 13 క్రింద కేంద్ర ప్రభుత్వంనకు కంపెనీ దరఖాస్తుచేయ ప్రతిపాదిస్తుంది.

కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసు యొక్క ప్రతిపాదిత మార్పు ద్వారా ఎవరైనా వ్యక్తికి ఏమేని ఆసక్తి కలిగియున్న వారు, ఇన్వెస్టర్ కాంప్లైంట్ ఫారం నింపుట ద్వారా ఎంసిఏ-21 పోర్టల్ (www.mca.gov.in)పై కాని డెలివర్‌చేయవచ్చును లేదా డెలివర్‌కు కారకులు కాగలరు లేదా దిగువ ఇవ్వబడిన పేర్కొన్న చిరునామా వద్ద దరఖాస్తుదారైన కంపెనీకి దాని రిజిస్టర్డు ఆఫీసు వద్ద ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి పద్నాలుగు (14) రోజుల్లోగా, రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, హైదరాబాద్, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయాత్ నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500068, తెలంగాణ మరియు దిగువ పేర్కొన్న కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసుకు ఒక కాపీతో వారికి అతని/ఆమె ఆసక్తి స్వభావం మరియు అభ్యంతరాలకుగల కారణాలు చూపుతూ ఒక అఫిడెవిట్ ద్వారా మద్దతుగా అతని/ఆమె అభ్యంతరాలను రిజిస్టర్డు పోస్టు ద్వారా పంపవచ్చును.

దరఖాస్తుదారు తరపున
ఏరువాక టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున
సం/-
కునాల్ ఛౌధరి
డైరెక్టర్ & సిఇఓ
డిఐఎన్: 06464967
తేది: 07.10.2023
ప్రదేశం: విజయవాడ

బాలలను రాజకీయ ధర్నాలకు ఉపయోగించొద్దు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాలలను రాజకీయ ప్రచారం, ధర్నాలు, ఊరేగింపులకు ఉపయోగించొద్దని, అలా చేసినట్లయితే రాజకీయ పార్టీలకు సంజాయిషీ నోటీసులు జారీ చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసాలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, త్రిపర్ణ ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి అన్నారు. శనివారం మంగళగిరిలో బాలల హక్కుల కమిషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో కొంతమంది రాజకీయ నాయకులు పసి పిల్లలను, విద్యార్థులను వారి పార్టీ కార్యాకలపాలకు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని వారు తెలిపారు. పసి పిల్లలు ద్వారా కొంతమంది ప్రజా ప్రతినిధులు అసహ్య వ్యాఖ్యలతో ప్రసంగాలు చేయించడం ద్వారా వారిపై చెడు ప్రభావం పడుతుందన్నారు.

తిరుపతి నుంచే పవన్ పోటీ!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'తిరుపతి నుంచి పోటీ చేయి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. తిరుపతి ప్రజలు అప్పట్లో ఎన్‌టిఆర్‌ను, తరువాత కొణిదెల చిరంజీవిని ఆదరించారని, తొలి ప్రాధాన్యత తిరుపతికే ఇచ్చి కేంద్రీకరించాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జనసేన, టిడిపి పొత్తులు, సీట్లు గురించి చర్చ నడుస్తోంది. మదనపల్లి, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లో అసెంబ్లీ స్థానాలను జనసేన కోరినట్లు సమాచారం. తిరుపతి లోక్‌సభనూ జనసేన ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో ప్రస్తుత ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి రాష్ట్ర నాయకులు వూకా విజయకుమార్, టిటిడి మాజీ బోర్డు మెంబర్ ఒవి రమణ పోటీ పడుతున్నారు. వారితో పాటు పొత్తులో భాగంగా జనసేన నుంచి డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ ఆశిస్తున్నారు. అధికార పార్టీని బలంగా ఎదుర్కోవాలంటే తిరుపతి లాంటి ప్రాధాన్యత గల నియోజకవర్గంలో పవన్‌కల్యాణే సరైన అభ్యర్థిగా చంద్రబాబు భావించినట్లు తెలుస్తోంది. బలిజ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో సాలిడ్‌గా పవన్‌కల్యాణ్‌కు ఓట్లు పడతాయని, విద్యాకేంద్రంగా ఉన్న తిరుపతిలో యువత ఓట్లు జనసేనకు మళ్లించేలా వ్యూహంలో ఉన్నారు.

అమ్మోనియా గ్యాస్ లీకేజీపై విచారణ

- కోపల్లెలో అధికారుల బృందం పర్యటన

ప్రజాశక్తి - కాళ్ల (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలంలోని కోపల్లె గ్రామంలో అమ్మోనియా గ్యాస్ లీకైన ప్రాంతాన్ని అధికారులు శనివారం పరిశీలించారు. కోపల్లెలో శుక్రవారం ప్రభు ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీకై పక్కన ఉన్న ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీలో మహిళా కార్మికులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. రెవెన్యూ, కార్మిక, వైద్య, పోలీస్, పరిశ్రమలు, పొల్యూషన్ శాఖ అధికారుల బృందం శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్‌డిఒ దాసి రాజు అధ్యక్షతన ఫ్యాక్టరీలో ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఐస్ ఫ్యాక్టరీ యజమాని సత్యనారాయణకు చెందిన ఫ్యాక్టరీతో పాటు ఇతర ఆస్తులు కూడా ఎన్ఫోర్స్మెంట్ ఆధీనంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఐస్ ఫ్యాక్టరీ నాలుగేళ్లుగా సరిగ్గా పనిచేయడం లేదని, రెండేళ్ల క్రితం మూసివేశారని తెలిపారు. అయితే శుక్రవారం ఫ్యాక్టరీలో ఉన్న కంప్రెసర్‌ను తొలగిస్తుండగా అమ్మోనియా గ్యాస్ లీకై 10 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారని, ప్రథమ చికిత్స అందించగా వారిలో ఆరుగురు కోలుకోగా, నలుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు.

మహిళా కార్మికులంతా ఒరిస్సా రాష్ట్రానికి చెందినవారని, ఐస్ ఫ్యాక్టరీ క్లోజింగ్ సర్టిఫికెట్ ఇచ్చారా లేదా అనేది పరిశీలించాల్సి ఉందని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు. ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ కాళ్ల మండలంలో ఐస్ ఫ్యాక్టరీలు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కువగా ఉన్నాయని, యజమానులు అమ్మోనియా గ్యాస్ పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫ్యాక్టరీ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల తనిఖీ శాఖల అధికారి రామకృష్ణారెడ్డి, ఏలూరు ఉప కమిషనర్ ఆర్.త్రినాధరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, డిఎస్‌పి బి.శ్రీనాథ్, కాళ్ల పిహెచ్‌సి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

Muthoot Homefin
ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం: యూనిట్ నం.19-ఎన్ఇ, 19వ అంతస్తు, ది రూబి, సేనాపతి బాపత్ మార్గ్, రూపరెల్ కాలెజి వద్ద, దాదర్(పడమర), ముంబాయి, మహారాష్ట్ర-400 028

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 (2) క్రింద.

ఏదైతే దిగువ సంతకందారుడు ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్ (ఎంహెచ్ఐఎల్) అధీకృత అధికారి సెక్యూరిటీజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సేట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13 (2) క్రింద, డిమాండ్ నోటిసు జారీ చేస్తూ సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత/లు ("సదరు రుణగ్రహీత"), దిగువన సూచిస్తూ, దిగువ ఇవ్వబడిన వివరాల ప్రకారం, సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించమని పేర్కొనడం జరిగింది.

పై దానిని అనుసరించి, ఇందుమూలంగా ఇవ్వబడిన నోటీసు ప్రకారం, మరొకసారి, రుణగ్రహీతలను కోరడమేమనగా ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60రోజులలోగా ఎంహెచ్ఐఎల్‌కు మొత్తాన్ని చెల్లించమని కోరడమైనది, పేర్కొన్న సంబంధిత తేదిల నుండి డిమాండ్ నోటీసులో వివరించిన సంవత్సరానికి 2% తదుపరి వడ్డీతో కలుపుకొని, లోను ఒప్పందంను మరియు ఇతర డాక్యుమెంట్‌లు/రాతపూర్వకాలు చదువుకోవలెను, ఏదైన సదరు రుణగ్రహీతల చేత అమలైతే, లోను తిరిగిచెల్లించే బాకీ కొరకు సంబంధిత రుణగ్రహీతలు ఎంహెచ్ఐఎల్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టిన సెక్యూరిటీగా ఉన్న దిగువ సెక్యూరిటీ ఆస్తులు దిగువన ఇవ్వడమైనది.

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు పేరు/లోను ఖాతా నం./శాఖ	మొత్తం బకాయిలు (రూ)	డిమాండ్ నోటీసు తేది	సెక్యూర్డ్ అస్సెట్ (స్థిరాస్తి) వివరణ
1.	గుమ్మ గోపికృష్ణా (దరఖాస్తుదారుడు) / గురుస్వామి గుమ్మ (మొదటి సహ-దరఖాస్తుదారుడు) / గోవర్ధనమ్మ గుమ్మ (సహ-దరఖాస్తుదారుడు) / 050-05000085/ విజయవాడ.	రూ.4,56,421/- (నాలుగు లక్షల యాభైఆరు వేల నాలుగు వందల ఇరవైఒక రూపాయలు మాత్రమే)	30 సెప్టెంబర్ 2023	తోటచెర్ల గ్రామం ఆర్.ఎస్ నం.118, పెనుగంచిప్రోలు మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521185

ఎంహెచ్ఐఎల్ కు రుణగ్రహీతలు తిరిగిచెల్లించలేక విఫలం చెందినట్లయితే, ఎంహెచ్ఐఎల్ వారు పై సెక్యుర్డ్ ఆస్తులు తదుపరి చర్యలు చేపట్టుతారు. సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద సంబంధిత రుణగ్రహీతలు ఖర్చులు మరియు పర్యవసనాలకు మొత్తం బాధ్యత వహించగలరు.

సదరు రుణగ్రహీతలు ఎంహెచ్ఐఎల్ వారిని సంప్రదించకుండా పైన వివరించిన ఆసులను అమ్మకంగాని, లీజు లేదా ఇతరత్రములకు బదిలీచేయుట నిషేదించడమైనది. ఎవరైన వ్యక్తి చట్టం లేదా నియమాలను ఉల్లంఘించేనట్లయితే అదే అలాచేయుటకు ప్రేరేపించన్లయితే వారికి చట్టం క్రింద చట్టబద్ధంగా జైలు శిక్ష/లేదా జరిమానా విధింపబడుతుంది.

ప్రదేశం: విజయవాడ
తేది: అక్టోబర్ 09, 2023
సం/- అదీకృత అధికారి
ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్

బీహార్ కుల గణనపై బిజెపి లొల్లి

- నితీశ్ ప్రభుతం లక్ష్యంగా ఆరోపణలు

పాట్నా : ఇటీవల విడుదలైన బీహార్ కులాల సర్వే నివేదికలో గుర్తించబడిన వెనుకబడిన తరగతులలో 10 శాతం మంది మైనారిటీ వర్గానికి చెందినవారు ఉన్నారు. కర్పూరీ ఠాకూర్ ప్రభుత్వం 1978లో ముంగేరి లాల్ కమిషన్ సిఫారసులను అమలు చేసి ఈబీసీలకు ప్రత్యేక కోటాను ప్రవేశపెట్టినప్పటింది. అప్పటి నుంచి కొన్ని ముస్లిం సమూహాలు ఇబిసి (ఓబీసీలలో అత్యంత వెనుకబడిన తరగతి వర్గం)గా గుర్తించబడ్డాయి. తాజాగా బీహార్‌లో చేపట్టిన కుల గణనపై బిజెపి రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నది. ముస్లింలను టార్గెట్ చేస్తూ నితీశ్ సర్కారుపై ఆరోపణలు గుప్పిస్తున్నది. నితీష్ కుమార్ ప్రభుత్వం ఈబీసీల సంఖ్యలను జనాభాలో 36 శాతానికి తీసుకువెళ్లిందని కాషాయ పార్టీ ఆరోపిస్తున్నది. జేడీ(యూ) మాజీ రాజ్యసభ ఎంపీ, ఆలిండియా పస్మండ ముస్లిం అధిపతి మహజ్ అలీ అన్వర్ అన్సారీ మాట్లాడుతూ.. కొత్త ఈబీసీ గణాంకాలను బట్టి చూస్తే గణనీయంగా వెనుకబడిన ముస్లింలు ఉన్నారని చూపుతున్నాయన్నారు. ఈబీసీలు నితీష్ ద్వారా రాజకీయంగా పోషించబడిన వర్గంమనీ, అతని స్వంత సామాజికవర్గం కుర్మీలు రాష్ట్రంలో కేవలం మూడు శాతం మాత్రమే ఉన్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. "బీహార్ కులాల సర్వే మేము ఇంతకాలం చెబుతున్నదానిని రుజువు చేసింది. 1931 జనాభా లెక్కల వరకు ముస్లింలను కులాల వారీగా లెక్కించినప్పటికీ, మండల్ కమిషన్ నివేదికలో పేర్కొన్నప్పటికీ, ముస్లింలను ఒక కూటమిగా చూపుతూ రాజకీయాలు ఆడుతున్నారు. కులం హిందువులలో ఎంత వాస్తవమో ముస్లింలలో కూడా అంతే వాస్తవం" అని అన్సారీ అన్నారు. రాష్ట్రంలో రెండు ముస్లిం గ్రూపులు నల్‌బండ్‌లు, మాలిక్‌లు ఓబీసీలుగా గుర్తించబడగా, 24 ఈబీసీల కింద జాబితా చేయబడ్డాయి. మొత్తంగా, ముస్లిం ఓబీసీ సమూహాలు జనాభాలో 10 శాతానికి పైగా ఉన్నాయి. కర్పూరీ ఠాకూర్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఈబీసీలకు 12 శాతం, ఓబీసీలకు 8 శాతం, సాధారణ కేటగిరీలోని మహిళలు, వెనుకబడిన వారికి మూడు శాతం కోటాను పక్కన పెట్టింది. అన్సారీ చెప్పినట్టుగా రాష్ట్రంలో ముస్లింలను ఒక మతపరమైన కూటమిగా కాకుండా వారి ఆర్థిక స్థితి పరంగా చూడడానికి సర్వే దారి తీస్తుంది. బీహార్ సీఎం నితీష్ పస్మాండ ముస్లింలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు.

జాతీయ స్థాయి చెస్ టోర్నీ విజేతలు ఆన్ష్, ప్రతీతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ/ సీతమ్మధార

విశాఖ పోర్టు స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-11 చెస్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో 10 పాయింట్లతో ఆన్ష్ నందన్ (మహారాష్ట్ర), బాలికల విభాగంలో 9.5 ప్లాయింట్లతో ప్రతీతి జయకేతనం ఎగురవేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన టిడిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు కెఎస్.ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక టోర్నీ విషయానికొస్తే.. 10 పాయింట్లుతో ఆన్ష్ నందన్ (మహారాష్ట్ర), 9 పాయింట్లుతో సిద్ధాంత పూంజా (కర్ణాటక), ఆదిక్ థియోఫేన్ (కేరళ), సయ్యద్ అబ్దుల్ ఖాదర్ (కర్ణాటక), మయాఖ్ మజుందాకర్ (వెస్ట్ బెంగాల్) మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారు.

తేది : 05.10.2023, ఓపెన్ ఇ టెండర్ నోటీసు నం.బి/ఇ.29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-20-23-24 PUB/1125

టెండర్ నం.బి/ఇ.29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-20-23-24

క్రింది విధమైన పనుల కొరకు దిగువసంతకందారు ద్వారా ఐరెప్స్‌లో టెండర్లను ఆహ్వానించడమైనది.

పని పేరు : విజయవాడ డివిజన్-జిడివి-ఎమ్‌టిఎమ్ సెక్షన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లాలో ఎన్‌హెచ్-165 యొక్క పామర్రు మరియు అలపాడు బైపాస్ రోడ్డు పై గుడివాడ మరియు నూజెళ్ల రైల్వే స్టేషన్ల మధ్య 04/0-4/1 కి.మీ. వద్ద "4 లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) ప్రతిపాదిత నిర్మాణానికి సంబంధించి ఓహెచ్ఇ కి మార్పులు మరియు చేర్పులు.

సుమారు విలువ (రూ.): 16,76,678/-, బిడ్ సెక్యూరిటీ (ఇఎమ్‌డి) (రూ.): 33,500/- పూర్తి గడువు : 12 నెలలు, ముగింపు తేది మరియు సమయం : 30.10.2023, 15.00 గం.

క్ర.సం.1- టెండర్ ఫారం ఖరీదు (రూ.) : లేదు, ముగింపు తేది : క్ర.సం.1 : 30.10.2023, 15.00 గం. వద్ద.

ఎస్ఆర్. డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/టిఆర్‌డి/విజయవాడ
A1543

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

రేషన్ బియ్యం పట్టివేత

- తహశీల్దార్‌కు అప్పగించిన
- ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఒడిశా రాష్ట్రానికి చెందిన జోలాపుట్టు వ్యాపారి మామిడి భక్తుల సంతోష్ అక్రమంగా 18 బస్తాలు బొలెరో వాహనంలో తరలిస్తుండగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గాసిరామ్ దొర, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న నాయకులు వనభసింగి పంచాయతీ పరిధి కొత్తూరు గ్రామ జంక్షన్ వద్దకు చేరుకొని అక్రమంగా తరలిస్తున్న కోటా బియ్యాన్ని పట్టుకుని తహసిల్దార్ నరసమ్మకు అప్పగించారు. కేసును నమోదు చేస్తామని తహసిల్దార్ నర్సమ్మ వెల్లడించారు. జోలాపుట్టు గ్రామ వ్యాపారిపై కేసు నమోదు చేసి విచారణ పూర్తిస్థాయిలో జరపలేదని గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు గాసిరందొర, మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ తెలిపారు. ఈ విషయంపై జిసిసి మేనేజర్ మోహన్ రావును వివరణ కోరగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని ఆయన తెలిపారు.

सत्यमेव जयते
MINISTRY OF SOCIAL JUSTICE & EMPOWERMENT GOVERNMENT OF INDIA

సామాజిక న్యాయం మరియు సాధికారత విభాగం
ప్రకటిస్తున్నది
69 లక్షల షెడ్యూల్డ్ కులాలకు స్కాలర్‌షిప్‌లు
కింద ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యార్థులు
2023-24 సం॥రానికి ఎస్‌సి విద్యార్థుల కొరకు
పోస్ట్- మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల పథకం

అర్హత
- తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించకూడదు
- గుర్తింపు పొందిన కళాశాలలు/పాఠశాలల్లో కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు

పరిధి
- 11వ తరగతి నుండి అన్ని గుర్తింపు పొందిన కోర్సులు
- దరఖాస్తులు రాష్ట్ర ప్రభుత్వం/ యూనియన్ టెర్రిటరీ ద్వారా ఆమోదించబడతాయి మరియు ధృవీకరించబడతాయి
- పేద కుటుంబాల కవరేజ్

ఎన్‌టైటిల్‌మెంట్
- తిరిగి ఇవ్వబడని ఫీజు (ట్యూషన్ ఫీ తో సహా) తప్పనిసరి
- సంవత్సరానికి రూ.2500 నుండి రూ.13500 వరకు విద్యా భత్యం
- దివ్యాంగుల (ప్రత్యేక సామర్థ్యం గల) విద్యార్థులకు 10% అదనపు భత్యం

- విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్రాల స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- విద్యార్థులు చెల్లుబాటు అయ్యే మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (యుఐడి), ఆధార్ సీడెడ్ బ్యాంక్ ఖాతా, ఆదాయ ధృవీకరణ పత్రం మరియు కుల ధృవీకరణ పత్రాన్ని కలిగి ఉండాలి.

- పథకం మార్గదర్శకాలు మరియు వివరణాత్మక అర్హత ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయి.
http://socialjustice.gov.in/schemes/25

cbc 38101/11/0035/2324

బిజెపితో పొత్తును ఖండించిన జెడి(ఎస్) కేరళ కమిటీ

మాథ్యూ టి.థామస్

తిరువనంతపురం : బిజెపితో చేతులు కలపాలని జెడి(ఎస్) అధ్యక్షులు హెచ్‌డి దేవగౌడ తీసుకున్న నిర్ణయాన్ని ఆ పార్టీ కేరళ విభాగం తిరస్కరించింది. కేరళలో ప్రస్తుతం అధికారంలో ఉన్న లెఫ్ట్ ఫ్రంట్‌తోనే కలిసి నడవాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొచ్చిలో సమావేశమైన కేరళ జెడి(ఎస్) యూనిట్‌కు చెందిన కార్యనిర్వాహక కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. 'లౌకికవాదం, సోషలిజం, ప్రజాస్వామ్య విధానాలకు కట్టుబడి ఉన్నందున జెడి(ఎస్) కేరళ యూనిట్ గత నాలుగున్నర దశాబ్దాలుగా వామపక్ష ఫ్రంట్‌తో పొత్తును కొనసాగిస్తుంది. బిజెపితో భాగస్వామి కావాలనే నిర్ణయంలో దేవగౌడ చెబుతున్న కారణాలపై మాకు నమ్మకం లేదు' అని జెడి (ఎస్) కేరళ యూనిట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే మాథ్యూ టి.థామస్ తెలిపారు. తదుపరి వ్యూహాన్ని రూపొందించేందుకు కార్యనిర్వాహక కమిటీ ఈ నెల 11న మరోసారి సమావేశమవుతుందని చెప్పారు.

ఆ ఆరోపణలన్నీ బూటకం

- ఎఫ్‌ఐఆర్‌పై న్యూస్‌క్లిక్
- న్యాయ వ్యవస్థపై నమ్మకముందని వ్యాఖ్య

న్యూఢిల్లీ : పాటియాలా హౌస్ ప్రత్యేక న్యాయమూర్తి ఆదేశాలను అనుసరించి, న్యూస్‌క్లిక్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థకు గురువారం రాత్రి ఢిల్లీ పోలీసులు ఎఫ్‌ఐఆర్ కాపీని అందచేశారు. తమపై అందులో పేర్కొన్న వచ్చిన ఆరోపణలు, అభియోగాలన్నీ బూటకం నివని పేర్కొంటూ వాటిని న్యూస్‌క్లిక్ ఖండించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎఫ్‌ఐఆర్‌ని కొట్టివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని న్యూస్‌క్లిక్ తెలిపింది. ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిలను తక్షణమే పోలీసు కస్టడీ నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న ఆరోపణలన్నీ మూడు ప్రభుత్వ సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం, ఆదాయపన్ను శాఖ గత కొంతకాలంగా చేస్తున్నవేనని, ఈ ఆరోపణలేవీ కూడా ప్రత్యక్షంగా సమర్ధించలేనివి, బూటకమైనవని పేర్కొంది. గత మూడేళ్లుగా ఈ ప్రభుత్వ సంస్థలు దర్యాప్తులు కొనసాగిస్తున్నా ఏ ఒక్క చార్జిషీట్‌ను దాఖలు చేయలేదని, ఫిర్యాదులు నమోదు చేయలేదని ఆ ప్రకటన పేర్కొంది. వాస్తవానికి ఈ దర్యాప్తుల నుంచి ప్రబీర్‌కు తాత్కాలిక రక్షణ కల్పించారు. కానీ, ఈ రక్షణను తప్పించడానికే తాజా ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశారని, నిరంకుశ యుఎపిఎ కింద అక్రమంగా అరెస్టు చేశారని ఆ ప్రకటనలో న్యూస్‌క్లిక్ పేర్కొంది.

గతంలో చేసిన ప్రకటనల్లో స్పష్టం చేసినట్లుగా, న్యూస్‌క్లిక్ చైనా నుంచి లేదా చైనా సంస్థల నుండి ఎలాంటి నిధులను లేదా ఆదేశాలను అందుకోలేదని ఆ ప్రకట స్పష్టం చేసింది. పైగా హింసను ప్రేరేపించేలా, వేర్పాటువాదాన్ని లేదా ఏ రీతిలోనైనా అక్రమ చర్యలను ప్రోత్సహించేలా ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపింది. న్యూస్‌క్లిక్ చెబుతున్న విషయాలు వాస్తవమైనవా? కావా? అని నిర్ధారించుకోవాలంటే ఆన్‌లైన్‌లో ఉచితంగా అందుబాటులో వున్న న్యూస్‌క్లిక్ కవరేజీని చూస్తే సరిపోతుందని పేర్కొంది.

ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న అభియోగాలన్నీ పూర్తిగా అసంబద్ధమైనవని పేర్కొంది. న్యూస్‌క్లిక్‌పై చేపట్టిన చర్యల తీరును చూస్తుంటే భారతదేశంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన పత్రికా రంగం గొంతు నులిమివేయడానికి చేసిన దారుణమైన ప్రయత్నం తప్ప మరొకటి కాదని ఆ ప్రకటన విమర్శించింది.

న్యూస్‌క్లిక్ మాజీ జర్నలిస్ట్ నివాసం వద్ద పోలీసులు, (ఇన్‌సెట్‌లో జర్నలిస్ట్ అనూష)

ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని ప్రబీర్, అమిత్‌లు పెట్టుకున్న పిటిషన్‌లను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు సోమవారానికి విచారణను వాయిదా వేసింది. భారతదేశంలో న్యాయ వ్యవస్థ పట్ల న్యూస్‌క్లిక్‌కు పూర్తి విశ్వాసం వుందని, తమ వైఖరి సమర్ధించబడుతుందని నమ్మకంగా వున్నట్లు న్యూస్‌క్లిక్ ఆ ప్రకటనలో పేర్కొంది.

అనూష ఇంట్లోనూ సోదాలు

- కేరళలో ఢిల్లీ పోలీసుల హల్‌చల్
- న్యూస్‌క్లిక్‌లో లావాదేవీలు చట్టబద్ధం : అమెరికన్ సంస్థ డబ్ల్యుఎంహెచ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో మాజీ న్యూస్‌క్లిక్ జర్నలిస్ట్ ల్యాప్‌టాప్, ఫోన్‌ను ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ బృందం కేరళ పతనాంతిట్టలోని మాజీ న్యూస్‌క్లిక్ జర్నలిస్ట్ అనూషా పాల్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. న్యూస్‌క్లిక్ ఫండింగ్ గురించి, సంస్థతో ఉన్న సమయంలో ఆమె రిపోర్టింగ్ అసైన్‌మెంట్‌ల గురించి ప్రశ్నించారు. 'సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ తెలుసా?' అని పోలీసులు తనను ప్రశ్నించినట్లు ఆమె మీడియాకు తెలిపారు. పోలీసులు తన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను తీసుకువెళ్లారని, వీలైనంత త్వరగా న్యూఢిల్లీలోని తమ కార్యాలయానికి హాజరు కావాలని చెప్పారని వివరించారు.

అనూషాపాల్ 2018 నుంచి 2022 వరకు న్యూస్‌క్లిక్‌లో పనిచేశారు. ప్రస్తుతం వికలాంగుల హక్కుల కోసం జాతీయ వేదిక రీసెర్చర్‌గా ఉన్నారు.

చట్టబద్ధంగానే పెట్టుబడులు: డబ్ల్యుఎంహెచ్

న్యూస్‌క్లిక్‌లో పెట్టుబడులు, లావాదేవీలన్నీ చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉన్నాయని అమెరికన్ సంస్థ వరల్డ్‌వైడ్ మీడియా హోల్డింగ్స్ (డబ్ల్యుఎంహెచ్) పేర్కొంది. డబ్ల్యుఎంహెచ్‌ని పీపుల్స్ సపోర్ట్ ఫౌండేషన్ నియంత్రిస్తుంది. పీపుల్ - సెంట్రిక్ జర్నలిజాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో న్యూస్‌క్లిక్‌లో పెట్టుబడులు పెట్టినట్లు డబ్ల్యుఎంహెచ్ మేనేజర్, అమెరికన్ లాయర్ జాసన్ ఫెచర్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూస్‌క్లిక్ జర్నలిజం శైలిపై ఆసక్తి కనబరిచిన తరువాత 2017లో పెట్టుబడి ప్రక్రియ ప్రారంభమైందని ఫెచర్ వివరించారు. ప్రబీర్ పుర్కాయస్థ 'ఆలోచనలు'తో ఏకీభవిస్తున్నా మని, న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థతో చర్చించామని చెప్పారు. ఒక సంవత్సరం పాటు సంప్రదింపులు, నియంత్రణ ప్రక్రియ తరువాత, పెట్టుబడిదారులు చివరకు అంగీకరించారని తెలిపారు. న్యూస్‌క్లిక్‌కి మీడియా పనిపై ఎలాంటి సలహా ఇవ్వలేదని పేర్కొన్నారు.. డబ్ల్యుఎంహెచ్ ఏ రాజకీయ పార్టీ, ప్రభుత్వం, వారి ప్రతినిధుల నుంచి ఎటువంటి డబ్బును స్వీకరించలేదని పేర్కొన్నారు. 'న్యూయార్క్ టైమ్స్' ప్రచురించిన తప్పుడు కథనం ఆధారంగా అమాయకులను అరెస్టు చేశారని విమర్శించారు. భారతదేశ చట్టం ప్రకారం దేశంలో విదేశీ పెట్టుబడులు పెట్టడం సురక్షితమేనా? అనే ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోందని పేర్కొన్నారు.

తృణ ధాన్యాల పిండిపై 5% జిఎస్‌టి

- మొలాసిస్‌పైనా తగ్గింపు
- జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

చిరు ధాన్యాల (మిల్లెట్ల) పిండిపై పన్ను రేట్లను తగ్గిస్తూ జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్పత్తులను ప్రీ ప్యాకేజ్డ్ లేదా లేబుల్ వేసి విక్రయించినా ఇకపై 5 శాతం జిఎస్‌టి వర్తిస్తుంది. విడిగా విక్రయించే మిల్లెట్స్ పిండిపై జిఎస్‌టిని పూర్తిగా మినహాయించారు. ఎక్కువ పౌష్టికాహారం కలిగిన ఈ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేసే ఉద్దేశంతో జిఎస్‌టి కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకుంది. శనివారం జరిగిన 52వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం నిర్ణయాలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మీడియాకు వెల్లడించారు. తృణ ధాన్యాల పిండిపై ప్రస్తుతం 18 శాతంగా ఉన్న జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించామన్నారు. మిల్లెట్లను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తృణధాన్యాలలోకి జొన్నలు, సజ్జలు, కొర్రలు,

జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్మలా సీతారామన్ తదితరులు

వరిగెలు, రాగులు, కుసుములు తదితరాలు వస్తాయి.

మొలాసిస్‌పై కూడా జిఎస్‌టిని 28 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. మానవ అవసరాల కోసం వినియోగించే డిస్టిల్ ఆల్కహాల్‌ను జిఎస్‌టి నుంచి మినహాయిస్తున్నామన్నారు. పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్‌ఎ)పై మాత్రం జిఎస్‌టి యథావిధిగా కొనసాగుతుందన్నారు. భారతీయ రైల్వేస్ సరఫరా చేసే వస్తు సేవలపైనా పన్ను విధించాలని ప్రతిపాదించింది. వాటర్ సప్లయ్, పబ్లిక్ హెల్త్, శానిటేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ స్లమ్ ఇంప్రూవ్‌మెంట్ తదితర సర్వీసులపై పన్ను మినహాయించారు. జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్ అధ్యక్షుడి పదవీ విరమణ వయసును 67 ఏళ్ల నుంచి 70 ఏళ్లకు, ట్రిబ్యునల్ సభ్యుల పదవీ కాలం 65 ఏళ్ల నుంచి 67 ఏళ్లకు పెంచుతూ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఎనిమిదిమంది సైనికుల మృతదేహాలు లభ్యం

- సిక్కిం వరదల్లో 30కు చేరిన మృతులు
- నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

గ్యాంగ్‌టక్ : సిక్కిం వరదల్లో గల్లంతైన ఎనిమిదిమంది సైనికుల మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు శనివారం ప్రకటించారు. సిక్కిం వరదల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు వెళ్లిన 23 మంది సైనికులలో ఒకరిని అప్పట్లో సహాయక సిబ్బంది రక్షించారు. ఎనిమిది మృతదేహాలను వెలికితీశారు. 14 మంది సైనికుల ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి' అని రాజ్‌నాథ్‌సింగ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శనివారం పోస్ట్ చేశారు. శనివారం మరో ఏడు మృతదేహాలను గుర్తించడంతో సిక్కిం వరదల్లో మరణించిన వారి సంఖ్య 30కు చేరుకుంది. వరదల్లో గల్లంతైన వారిలో 62 మందిని శనివారం భద్రత సిబ్బంది గుర్తించి రక్షించారు. దీంతో గల్లంతైన వారి సంఖ్య 81కి తగ్గింది. ఈ వివరాలను సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ శనివారం సాయంత్రం వెల్లడించింది. తీస్తా నది పరీవాహక ప్రాంతం ఇంకా వరద గుప్పిట్లోనే ఉంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని జిల్లాలు నేటికీ ఇబ్బందులు పడుతున్నాయి. 1,320కి పైగా నివాసాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని సిక్కిం ప్రభుత్వం తెలిపింది. తీస్తా వీ హైడ్రో పవర్ స్టేషన్‌కు దిగువన ఉన్న బ్రిడ్జిలన్ని ధ్వంసమయ్యాయి. కొన్ని వంతెలు వరదలకు పూర్తిగా కొట్టుకుపోయాయి. సమాచార

ఉత్తర సిక్కింలోని నాగా గ్రామం వద్ద ధ్వంసమైన రోడ్డు

వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ప్రకృతి వైపరీత్యం కారణంగా సంభవించిన నష్టాన్ని అంచనా వేయడానికి ఆదివారం నుంచి కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించనుందని కేంద్ర మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా గ్యాంగ్‌టక్‌లో తెలిపారు. ఈ నెల 4న తెల్లవారుజామున తీస్తా నదిలో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా నాలుగు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. శనివారం ఉదయం మంగన్ జిల్లాలోని వరద బాధిత ప్రాంతాలను ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ సందర్శించారు. సైన్యం, స్థానిక అధికారులు నిర్వహిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. ఆకస్మిక వరదల కారణంగా రాష్ట్రంలో 3 వేల మందికి పర్యాటకులు చిక్కుకుని పోయారని, వీరంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

మహిళలపై నేర విచారణలో వాస్తవికంగా వ్యవహరించండి

- సుప్రీం సూచన

న్యూఢిల్లీ : మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసులను విచారించే సమయంలో వాస్తవిక పద్ధతిలో వ్యవహరించాలని సుప్రీంకోర్టు శుక్రవారం సూచించింది. సాంకేతిక పద్ధతులను, అంశాలను కారణంగా చూపి లేదా పనికిమాలిన విచారణ లేదా సాక్ష్యాధారాల్లో గణనీయమైన లొసుగులతో నేరస్తులు తప్పించుకోవడానికి అనుమతించవద్దని కోరింది. విష ప్రయోగం వల్ల భార్య మరణించిన కేసులో దోషిగా తనను నిర్ధారించడంపై ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ జస్టిస్ జె.బి.పర్దివాలా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. తన భార్య అస్వస్థతతో పడిపోగానే తాను ఢిల్లీలోని సంజయ్ గాంధీ మెమోరియల్ ఆస్పత్రికి తీసుకెళ్లానని ఆ భర్త చెబుతున్నాడని, కానీ అందుకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని బెంచ్ పేర్కొంది. క్రిమినల్ కేసుల్లో సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 106ని అత్యంత జాగ్రత్తగా కోర్టు వర్తింపుజేయాలని బెంచ్ పేర్కొంది. ఇందుకు సంబంధించి అనేక కేసులను బెంచ్ ఉదహరించింది. ఇక్కడ కేసులో ఆస్పత్రిలో ఏం జరిగిందనేది ఆ వ్యక్తి చెప్పడం లేదని, పూర్తిగా మౌనం పాటిస్తున్నాడని బెంచ్ పేర్కొంది. ఒకవేళ తన భార్యను ఆస్పత్రికి తీసుకువచ్చేసరికే ఆమె మరణించి వుంటే ఎలాంటి న్యాయపరమైన పద్ధతులు పాటించకుండా ఆస్పత్రి అధికారులు అలా మృతదేహాన్ని వెనక్కి పంపించివేస్తారని ఊహించడమే కష్టంగా వుందని బెంచ్ వ్యాఖ్యానించింది.

తప్పుడు పోస్టింగ్‌లు... ఆ పై దాడులు...

- సతారా హింసకు కొద్ది వారాల ముందు హ్యాకర్ల దుశ్చర్య
- హ్యాక్ అయిందని ఫిర్యాదు చేసినా మైనర్‌పై కేసు

సతారా (మహారాష్ట్ర) : నెల రోజుల్లోనే దిల్షాద్ షేక్ జీవితం తలకిందులై పోయింది. సతారాలో అద్దెకు ఉంటున్న వారి కుటుంబాన్ని విద్వేష మూకలు బలవంతంగా బయటకు నెట్టేశాయి. ఆ కుటుంబాన్ని దేశద్రోహులు అని ముద్ర వేసి హింసించాయి. దిల్షాద్ 14ఏళ్ల కొడుకు పేరుతో తప్పుడు పోస్టును పెట్టి, దానిని సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా చేశాయి. ఆ పై దాడులకు దిగాయి. సతారాలో హింసను సృష్టించేందుకు విద్వేష మూకలు పకడ్బందీగా పన్నిన కుట్రలో భాగమే ఇదంతా. సతారాలోని పుసేసవాలిలో వాహనాలకు నిప్పంటించడం, ఆస్తుల ధ్వంసం చేయడం, ఫొటోలను మార్ఫింగ్ చేసి మరో మూడు కుటుంబాలను అందులో ఇరికించేందుకు యత్నించడం వంటి ఆగడాలకు కూడా ఈ మూకలు పాల్పడ్డాయి.

ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే, 35ఏళ్ల దిల్షాద్ షేక్ అక్రిడేటెడ్ సామాజిక ఆరోగ్య కార్యకర్త. ఆగస్టు 15న ఉదయం ఆమె స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరవడానికి వెళ్ళాల్సి వుంది. ఈలోగా ఆమె పక్క ఇంటి వ్యక్తి పరుగుపరుగున వచ్చి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఉన్న ఓ పోస్టును చూపించాడు. అందులో 17వ శతాబ్దికి చెందిన మరాఠా పాలకుడు శివాజీని అవమానిస్తూ కొన్ని వ్యాఖ్యలు ఉన్నాయి. తన కుమారుడి పేరుతో ఎవరో ఉద్దేశపూర్వకంగానే దీనిని పెట్టారని, ఆ భాష చూస్తే అది తన కొడుకు రాసింది కాదని షేక్ మీడియాకు తెలియజేసింది.

సతారాలోని పుసేసవాలిలో అల్లరి మూక నిప్పంటించడంతో దగ్ధమవుతున్న వాహనాలు (ఫైల్)

బంధువు ఇచ్చిన సలహా మేరకు ఆమె తన కొడుకును తీసుకుని సతారాలోని సైబర్ క్రైమ్ సెల్‌కు వెళ్లి ఫేక్ పోస్టింగ్‌పై ఫిర్యాదు చేశారు. తమ కుటుంబం వాడే రెండు సెల్‌ఫోన్లను ఆమె అక్కడ అధికారులకు ఇచ్చి వచ్చారు.

కొన్ని గంటల వ్యవధిలోనే, ఆ పోస్టు స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయిపోయాయి. దాదాపు 40మంది గుంపు ఆమె ఇంటివద్దకు వచ్చి రాళ్లు వేయడం ప్రారంభించింది. ఆమె అత్తగారు, 11 ఏళ్ల కూతురు భయంతో ఇంట్లో దాక్కోవాల్సి వచ్చింది. వారు మమ్మల్ని దేశద్రోహులుగా పిలుస్తూ, పాకిస్తాన్ వెళ్లిపోవాల్సిందిగా కేకలు వేశారని షేక్ ఆవేదన వ్యక్తం చేసింది. సైబర్ పోలీసులు ఆ పోస్టును తొలగించిన కొన్ని సెకన్ల వ్యవధిలోనే మళ్లీ ప్రత్యక్షమైంది. పోలీసులు కూడా దాన్ని చూశారు. కాబట్టి ఆ ఖాతా హ్యాక్ అయిందనేది స్పష్టం. అయినప్పటికీ ఆమె మైనర్ కొడుకుపై కేసు నమోదు చేశారు. మత భావాలను రెచ్చగొడుతున్నారంటూ ఐపిసి 295 (ఎ) సెక్షన్ కింద కేసు పెట్టారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఆగస్టు 16న కొద్ది రోజుల పాటు జ్యువెనైల్ హోమ్‌కు పంపారు. అక్కడితో ఆ కుటుంబం కష్టాలు తీరిపోలేదు.

వారు ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని ఇంటి యజమాని ఆదేశించాడు. తామేమీ తప్పు చేయలేదని చెప్పినా ఆయన వినలేదన్నారు. తన భర్త కూడా ఇంట్లో లేరని కుటుంబ ఫంక్షన్ నిమిత్తం కర్ణాటక వెళ్లారని ఆమె తెలిపారు. ఇంకా ఆ ఇంట్లోనే వుంటే ఏమైనా చేస్తామంటూ స్థానిక రాజకీయ నేత ఒకరు హెచ్చరించారని చెప్పారు. కట్టుకున్న బట్టలతో ఇల్లు వీడి రావాల్సి వచ్చిందన్నారు. తాము ముస్లింలైనందుకే ఇదంతా జరిగిందని ఆమె వాపోయారు. కొద్ది రోజుల పాటు ఆ పక్కనే గల గ్రామంలో ఆ కుటుంబం తల దాచుకుంది. ఆమె భర్త రాజా షేక్ 19వ తేదీన ఇంటికి చేరుకోగానే ఆయన్ని కూడా అరెస్టు చేశారు.

అసమానతలు తొలగించేందుకు కులగణన అవసరం : సిద్ధరామయ్య

మైసూర్ : సమాజంలో అసమానతలు తొలగించేందుకు కులగణన అవసరమని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. కులగణన సమాజాన్ని విభజిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన ఆరోపణలను సిద్ధరామయ్య ఖండించారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో వివిధ కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. శనివారం మైసూర్‌లోని విమానాశ్రయం వద్ద విలేకరులతో సిద్ధరామయ్య మాట్లాడారు. అందర్నీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థాయిలో వివిధ కులాల స్థితిగతులపై సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కుల గణన సమాజాన్ని విభజించదని ఆయన స్పష్టం చేశారు. బిజెపి చేసే పనులకు, చేసే ప్రకటనలకు పొంతన ఉండదని విమర్శించారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్వహించిన కులగణన నివేదికను ఆమోదించడానికి మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి నిరాకరించారని సిద్ధరామయ్య తెలిపారు. ప్రస్తుతం ఉన్న బిసి కమిషన్ చైర్మన్‌ను నివేదిక సమర్పించాలని చెప్పానని, ఈ ఏడాది నవంబర్‌లో నివేదికను సమర్పిస్తారని సిద్ధరామయ్య తెలిపారు. ఈ కుల గణన నివేదిక వచ్చిన తరువాతే అత్యంత వెనుకబడిన బిసి కులాలకు ప్రత్యేక కేటగిరీ సృష్టించాలనే డిమాండ్‌పై పరిశీలన చేస్తామని తెలిపారు.

రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం.. అందుకే జనగణన నిర్వహించడం లేదు : ఛత్తీస్‌గఢ్ సిఎం భూపేష్ భఘేల్

రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమని, అందుకే 2021లో జరగాల్సిన జనగణనను కేంద్ర ప్రభుత్వం ఇంకా చేపట్టడం లేదని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భఘేల్ విమర్శించారు. రాయ్‌పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'రాష్ట్రంలో 43.5 శాతం ఒబిసిలు, 3.5 శాతం ఇడబ్ల్యుఎస్ ఉన్నారు. దీని ప్రకారమే వారికి రిజర్వేషన్లు కల్పించాం. రాష్ట్రంలో 43 శాతానికి పైగా ఒబిసిలు ఉన్నారని బిజెపి నమ్మకపోతే ఆ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2021 జనగణన ఎందుకు నిర్వహించడం లేదు? మేం ఛత్తీస్‌గఢ్‌లో కులగణన నిర్వహించాం. బీహార్‌లోనూ ఇలాంటిది జరిగింది. మరి కేంద్రం (బిజెపి ప్రభుత్వం) ఎందుకు జనగణన చేయడం లేదు?' అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

భూకంపంతో భయంతో ఇళ్ల నుండి బయటికి వచ్చిన ప్రజలు

పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపం

- 15మంది మృతి, 40మందికి గాయాలు

హెరాత్ : పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లో శనివారం 6.3 తీవ్రతతో సంభవించిన భూకంపంలో 15మంది మరణించగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారని అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడడం, కూలిపోయిన భవనాల కింద బాధితులు చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే అతిపెద్ద నగరమైన హెరాత్‌కు వాయవ్యంగా 40కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం వుందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఆ తర్వాత ఏడుసార్లు భూ ప్రకంపనలు నమోదయ్యాయని, వాటి తీవ్రత 4.6, 6.3 మధ్య వున్నాయని తెలిపింది. ఉదయం 11గంటల సమయంలో నగరంలోని భవనాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో బయటకు పరుగులు తీశారు. దాదాపు మూడు గంటల పాటు ఈ ప్రకంపనలు కొనసాగాయి. పరిస్థితి చాలా భయంకరంగా వుందని స్థానికులు తెలిపారు. పిల్లలతో బయటకు వచ్చి వీధుల్లో నిలబడ్డామని తెలిపారు. మూడు ప్రావిన్స్‌ల్లో ఈ ప్రకంపంనలు సంభవించాయని, 15మంది మరణించగా దాదాపు 40మంది గాయపడ్డారని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ ప్రతినిధి జాన్ సయేక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలోని కొండ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డాయని చెప్పారు.

మానవసహిత గగన్‌యాన్ మిషన్.. కీలక పరీక్షలకు ఇస్రో సిద్ధం

బెంగళూరు: మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో కీలక పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి ఇస్రో కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ మిషన్‌కు సంబంధించి మానవ రహిత విమాన పరీక్షలను ప్రారంభించనుంది. ఫ్లైట్ టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్-1కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది క్రూ ఎస్కేప్ సిస్టమ్ పనితీరు గురించి సమాచారాన్ని అందిస్తుంది. అత్యవసర సందర్భాల్లో వ్యోమగాములను సురక్షితంగా భూమికి చేర్చేందుకు ఉద్దేశించిన క్రూ ఎస్కేప్ వ్యవస్థను త్వరలో పరీక్షించనుంది. ఫ్లైట్ టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్-1 పేరిట ఈ పరీక్షను ఇస్రో నిర్వహిస్తోంది. ఇందుకోసం ఓ ప్రయోగాత్మక క్రూ మాడ్యుల్‌తో పాటూ క్రూ ఎస్కేప్ వ్యవస్థను రూపొందించింది. ఈ క్రమంలో రాకెట్ నుంచి విడివడే క్రూ మాడ్యుల్ పారాషుట్ల సాయంతో బంగాళాఖాతంలో దిగుతుంది. ఈ సందర్భంగా వ్యోమగాముల రక్షణకు ఏర్పాటు చేసిన వ్యవస్థల పనితీరును మాడ్యూల్‌లోని వివిధ పరికరాలతో శాస్త్రవేత్తలు సేకరిస్తారు. క్రూ మాడ్యూల్‌ను స్వాధీనం చేసుకున్నాక అందులోని డాటా ఆధారంగా మరిన్ని మెరుగులు దిద్దుతారు. త్వరలో ఫ్లైట్ టెస్ట్ అబార్ట్ మిషన్ చేపడతామని ఇస్రో తాజాగా వెల్లడించింది. టెస్ట్ వెహికల్ అనేది ఈ అబార్ట్ మిషన్ కోసం అభివృద్ధి చేయబడిన ఒకే-దశ లిక్విడ్ రాకెట్. పేలోడ్‌లు క్రూ మాడ్యూల్, క్రూ ఎస్కేప్ సిస్టమ్‌లను కలిగి ఉంటాయి. మానవ రహిత ప్రయోగాన్ని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నిర్వహించనున్నారు. గగన్‌యాన్ మిషన్ సమయంలో వ్యోమగాములు కూర్చునే క్రూ మాడ్యూల్ 17 కి.మీ ఎత్తులో విడిపోతుంది. బంగాళాఖాతంలో తాకిన తర్వాత క్రూ మాడ్యూల్‌ను భారత నావికాదళానికి చెందిన ప్రత్యేక నౌక, డైవింగ్ బందాన్ని ఉపయోగించి తిరిగి పొందుతామని ఇస్రో తెలిపింది. ఈ విమాన పరీక్ష గగన్‌యాన్ మిషన్‌కు కీలకమైనదిగా పరిగణించబడుతుంది. ఎందుకంటే అవి ప్రాజెక్ట్ ముఖ్య భద్రతా లక్షణం. ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రాజెక్ట్ ఇద్దరు ముగ్గురు సభ్యులతో కూడిన సిబ్బందిని ఒకటి నుంచి మూడు రోజుల మిషన్ కోసం భూమి చుట్టూ 400 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి తీసుకెళ్లి వారిని సురక్షితంగా భూమికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అక్రమ నిర్బంధం విలువ రూ.50 వేలు

- బాధిత వ్యక్తికి పరిహారం
- ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : గతేడాది సెప్టెంబర్ 2న ఢిల్లీలోని బదర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు లాకప్‌లో అక్రమంగా నిర్బంధించబడిన వ్యక్తికి ఢిల్లీ హైకోర్టు రూ.50 వేలు నష్టపరిహారాన్ని అందించింది. పోలీసు అధికారులు తమకు తాముగా చట్టం కాకూడదనే అర్థవంతమైన సందేశాన్ని అధికారులకు పంపాలని జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఈ నష్టపరిహారాన్ని తప్పు చేసిన ఇద్దరు పోలీసు సిబ్బంది జీతాల నుంచి వసూలు చేయాలని జస్టిస్ ప్రసాద్ ఆదేశించారు. పంకజ్ కుమార్ శర్మ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ప్రసాద్ తీర్పు చెప్పారు. అతన్ని పోలీసులు అరెస్టు చేసి అరగంట పాటు అక్రమ నిర్బంధంలో ఉంచారు. గతేడాది 2న బదర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో ఈ ఘటన జరిగింది. ఎలాంటి అధికారిక అరెస్టు, ఎఫ్ఐఆర్ లేదా రోజువారీ డైరీ నమోదు లేకుండా పిటిషనర్‌ను లాకప్ లోపల ఉంచారని జస్టిస్ ప్రసాద్ గుర్తించారు. పోలీసుల ప్రవర్తనను జస్టిస్ ప్రసాద్ తప్పుబట్టారు. ఆర్టికల్ 21ను పోలీసులు ఉల్లంఘించారని కనుగొన్నారు. పౌరుని రాజ్యాంగ, ప్రాథమిక హక్కులను గాలికి వదిలేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ప్రవర్తించిన తీరు భయానకమని ఆయన అన్నారు. చట్టానికి అతీతంగా ప్రవర్తించే పోలీసు అధికారులు పౌరుల పట్ల వ్యవహరిస్తున్న తీరు పట్ల జస్టిస్ ప్రసాద్ విచారం వ్యక్తం చేశారు.

బాలికపై నలుగురు పోలీసుల లైంగిక దాడి..

చెన్నై: నలుగురు పోలీసులు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో వారిని సస్పెండ్ చేయడంతోపాటు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని తిరుచ్చి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక బాలిక తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్లింది. మద్యం తాగి ఉన్న నలుగురు పోలీసులు వారిని అడ్డుకున్నారు. బాలిక స్నేహితుడ్ని కొట్టారు. ఆ తర్వాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మొబైల్ ఫోన్‌లో వీడియో రికార్డ్ చేశారు. దీని గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం బాధిత బాలిక ఆసుపత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. ఈ సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నలుగురు పోలీసులను శశికుమార్, శంకరపాండి, ప్రసాద్, సిద్దార్థ్‌గా గుర్తించారు. గురువారం వారిని సస్పెండ్ చేయగా తాజాగా ఆ నలుగురు పోలీసులను అరెస్ట్ చేశారు. పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీకోసం

పులుసు కూరలు లాంటివి చేసేటప్పుడు కూరలో చన్నీళ్లకు బదులు వేడినీళ్లు పోస్తే రుచిగా ఉంటుంది. పన్నీర్ కూర ఇలా చేస్తే ముక్కలు మృదువుగా ఉంటాయి.

జీవన సౌరభం

పని చేసిన ప్రతిసారీ సత్ఫలితాలు రాకపోవచ్చు. కానీ అసలు ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

పులి - పిల్లి

చింటూ ఏడవ తరగతి చదువుతున్నాడు. చదువులో మంచి మార్కులు తెచ్చుకొనేవాడు. దసరా సందర్భంగా ఈ సారి వాళ్ల బడిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బొమ్మలు గీయడంలో చింటూకు గొప్పగా నైపుణ్యం లేదు. సైన్స్ నోటు పుస్తకంలో వేయవలసిన బొమ్మలు కూడా చాలా కష్టపడి వేసేవాడు.



డ్రాయింగ్ మాస్టారు వచ్చి చిత్రలేఖన పోటీలకు పేర్లు తీసుకొంటున్న సమయాన చింటూ మౌనంగా వున్నాడు. అప్పుడు 'చింటూ, పోటీలో పెద్దగా కష్టమైన బొమ్మలు వేయమని చెప్పరు. నువ్వు కూడా ప్రయత్నించు' అని అక్కడే ఉన్న సైన్స్ మాస్టారు అన్నారు.

మాస్టారు మాట విని చింటూ పేరు ఇచ్చాడు. పోటీ రోజు వచ్చింది. అందరికీ డ్రాయింగ్ పేపర్లు ఇచ్చారు. 'పిల్లలూ, పులి బొమ్మ చిత్రించి, ఆ బొమ్మ గురించి రెండు వాక్యాలు రాయండి. అదే మీ టాస్క్' అన్నారు డ్రాయింగ్ మాస్టారు. బొమ్మలు గీసే అలవాటు లేని చింటూ పులి బొమ్మను ఎలా గీయాలో అర్థం కాక తనకు వచ్చినట్లు వేస్తున్నాడు. కాసేపటికి 'ఇంకా ఐదు నిమిషాలు సమయం మాత్రమే వుంది' అని మాస్టారు గుర్తు చేశారు.

అప్పుడు చింటూ తల ఎత్తి చూసాడు. అప్పటికే సగం మంది పిల్లలు బొమ్మగీయడం పూర్తి చేసి వెళ్లిపోయారని గుర్తించాడు. తనేమో ఇంకా బొమ్మ పూర్తి చేయలేదు. పైగా రంగులు కూడా వేయలేదు. 'బొమ్మ పూర్తవ్వాలంటే కనీసం అర్ధగంట పైన పడుతుంది. ఎలా?' అనుకొంటూ వేసిన బొమ్మను పరీక్షగా చూసాడు. ఆ పులి బొమ్మ పిల్లిలాగా కనబడుతోంది. ఇక నాలుగు నిమిషాలు మాత్రమే టైం ఉంది. ఒక్క క్షణం ఆలోచించాడు. ఆ బొమ్మ కింద రెండు వాక్యాలు రాసి మాస్టారుకి పేపరు ఇచ్చి బయటకి వచ్చాడు.

మరుసటి రోజు బహుమతులు ప్రకటించారు. చింటూకు ప్రత్యేక బహుమతి ఇస్తున్నట్లు చెప్పారు. చింటూ లోలోన సంతోషపడుతూనే ఆశ్చర్యపోయాడు. బహుమతులు పొందిన డ్రాయింగ్స్ అందరూ చూడటానికి అనువుగా బోర్డు మీద తగిలించారు.

చింటూ వేసిన పిల్లి (పులి) బొమ్మ కూడా అందులో ఉంది. దాని కింద 'ఈ పులి భూమి మీదకు వచ్చి బడిపిల్లలు తినే జంక్ ఫుడ్ తినడం వలన మునుపటి శక్తిని కోల్పోయి పిల్లి లాగా మారిపోయింది' అని రాసి వుండటం చూసి, 'మంచి నీతి ఉన్న బొమ్మ గీసావు చింటూ' అని అక్కడున్న వారందరూ చింటూని అభినందించారు.

- ఓట్ర ప్రకాష్ రావు,
097874 46026.

నేను గీసిన బొమ్మ



గర్నెపూడి, షర్మిల,
4వ తరగతి,
ఎంపిపి పాఠశాల,
దరిశి,
ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇల్లు లేకనే పిచ్చుక వెళ్లిపోయింది!

ఒకప్పుడు కిచకిచమంటూ ... మన చుట్టూ తిరుగుతూ ... అద్దంలో తమను తాము చూసుకొని మురిసిపోతూ... ధాన్యం కళ్లంలో దండులా వచ్చి వాలుతూ ... మనలో ఒక భాగంగా వర్ధిల్లిన పిచ్చుకలు ఇప్పుడు ఎక్కడికి పోయాయి? ఎందుకు పోయాయి? అవి మళ్లీ రావా? కిచకిచమని పలకరించవా? ... ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు తన పరిశోధనతో జవాబులు తీసుకొచ్చారు డాక్టర్ వీరా మహేష్. ఆయన పిచ్చుకల పరిరక్షణపై ప్రత్యేక పరిశోధన చేసి, డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

ఒకప్పుడు మనం నిద్ర లేవగానే కళ్లముందు కనిపించే చిన్ని నేస్తాలు పిచ్చుకలు. ఇంటి చూరుల్లోనూ, గోడల నెర్రెల్లోనూ గూళ్ళు కట్టుకుని జీవించేవి. క్రమేణా మన జీవన విధానంలో వచ్చిన మార్పులు ఈ చిన్ని ప్రాణుల జీవితం మీద తీవ్రమైన ప్రభావం చూపించాయి. ఫలితంగా గత కొన్నేళ్లుగా పిచ్చుకల సందడీ, సంఖ్యా తగ్గిపోయింది!

నిజానికి పిచ్చుకలు మన నుంచి ఎందుకు మాయమయ్యాయో తెలుసా? మనం మన ఇళ్లను పటిష్ఠం చేసుకొని, ఆధునికం చేసుకొని, వాటికి ఆవాసాలు లేకుండా చేయడం వల్ల! అవి ఇల్లు కట్టుకోవటానికి అవకాశం ఇసుమంతైనా ఇవ్వకపోవడం వల్ల! ఈ సంగతి మహేశ్ పదేళ్ల పరిశోధనలో తేలింది. సెల్ టవర్లో, మరొకటో ప్రధాన కారణం కాదు. ఇంటి చూరులు లేకపోవడం, దొర్లాడేందుకు ఇసుక కుప్పలు లేకపోవడం ... పిచ్చుకల ఉనికికి ఉపద్రవంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన వీరా మహేష్ 2012లో స్పారో (స్పారో ప్రొటెక్షన్ అండ్ రీహేబిటేషన్ ఆర్గనైజేషన్)ను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యాన పిచ్చుకల సంరక్షణ కోసం పాటుపడుతున్నారు.

1920 నుంచే క్షీణత ప్రారంభం

మన ప్రాంతాల్లో మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకూ ఇంటి పరిసరాల్లో, పంట పొలాల్లో, బియ్యం మిల్లుల వద్ద పిచ్చుకలు ఎక్కువగా కనిపించేవి. తరువాత పెద్దఎత్తున కనుమరుగు కావడం మొదలైంది. పాశ్చాత్య దేశాల్లో అయితే, 1920 నుంచి వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. టెక్నాలజీలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న అపార్టుమెంట్లు, భవనాల సంస్కృతి వాటి ఆవాసాలను దెబ్బ తీశాయి. మన గ్రామల్లోనూ ఇళ్లకు చూరులు లేకపోవటం, పొలాల్లో క్రిమిసంహారక మందులు మితిమీరి వినియోగించటం వంటివి ఈ చిన్ని ప్రాణి మనుగడపై పెను ప్రభావం చూపించాయి.



కృత్రిమ ఆవాసాలతో ...

మరి పిచ్చుకల పరిరక్షణ ఎలా? అని మహేష్ ప్రత్యేక పరిశీలన, పరిశోధన చేశారు. పిచ్చుకల వృద్ధి కోసం కృత్రిమ ఆవాసాలను ఏర్పాటు చేయటం ఒక్కటే మార్గమని భావించారు. తొలుత పిచ్చుకలు ఉండే ప్రాంతాలను, వాటి గూడులను పరిశీలించారు. కృత్రిమ ఆవాసాల ఏర్పాటు, వాటికి రక్షణ చర్యలు, సౌకర్యాలు వంటి వాటిపై దృష్టి పెట్టారు. పిచ్చుకల ఆవాసానికి అనుకూలమైన గూళ్లను రూపొందించారు. వాటిని పిచ్చుకలు సంచరించే ప్రదేశాల్లో ఉంచారు. వాటిని నిరంతరంగా పరిశీలిస్తూ, 'కృత్రిమ ఆవాసాలు- పిచ్చుకల ప్రజననం'పై పరిశోధన చేశారు.

తొలుత 400కు పైగా చెక్క పెట్టెలతో చేసిన గూళ్లను జంగారెడ్డిగూడెం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉంచారు. ఆ గూళ్లను నిరంతరం పరిశీలించేవారు. ఏర్పాటు చేసిన ఎన్ని రోజులకు వాటిలోకి పిచ్చుకలు వచ్చి చేరాయి? ఎన్ని సార్లు ఆ ఆవాసాన్ని సంతతి వృద్ధి కోసం వినియోగించుకున్నాయి? ఈ ఆవాసాల్లోకి అవి చేరటానికి ఎలాంటి అంశాలు ప్రభావితం చేశాయి? తదితర కోణాల్లో పరిశోధన చేశారు. జంగారెడ్డి గూడెం పట్టణాన్ని తొమ్మిది జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌లో నాలుగు ట్రాంసెక్ట్‌లు ఉంచి ఈ పరిశోధన చేశారు. పిచ్చుకల సంతతిలో వచ్చే మార్పులను ప్రతి మూడు సీజన్ల (వర్షాకాలం, ఎండాకాలం, శీతాకాలం) ఆఖరులో గణించారు. చెక్కపెట్టెలకు, బయట నిర్మించిన గూళ్లకు మధ్య ఉండే నిర్మాణ, రక్షణ కారకాలను సైతం పరిశీలించారు. చెక్క పెట్టెల్లో అయితే, పిచ్చుకలు తక్కువ సమయంలో, తక్కువ శ్రమతో, తక్కువ పరిమాణపు గడ్డితో గూడును నిర్మించుకున్నాయని తేలింది! మొత్తానికి పిచ్చుకలకు మనం ఒక చిన్ని ఆవాసాన్ని కల్పిస్తే- అవి కిచకిచల సందడితో మనల్ని మురిపిస్తాయని తేల్చి చెప్పారు.

- యడవల్లి శ్రీనివాసరావు

సెల్ టవర్ల ప్రభావం లేదు

పిచ్చుకల సంఖ్య తగ్గిపోవటానికి సెల్ టవర్లు ఒక ప్రధాన కారణమని ప్రచారం ఉంది. కానీ, అది నిజం కాదని నా పరిశోధనలో వెల్లడైంది. రేడియేషన్‌ను వివిధ ప్రాంతాల్లో 'ఎలెక్ట్రో మాగ్నటిక్ టెస్టర్'ను ఉపయోగించి (100 మీటర్ల లోపు, 200 మీటర్లు, 300 మీటర్లు దాటి) విద్యుదయస్కాంత వికిరణ శక్తిని కొలిచాను. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కృత్రిమ గూళ్లలో పిచ్చుకల ప్రజననం, వాటి సంఖ్యను నిరంతరం గమనిస్తూ వచ్చాను. సెల్ టవర్ల నుంచి 300 మీటర్లలోపు 2014లో వాటి సంఖ్య పిచ్చుకల 20 ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 200 వరకూ పెరిగింది. రేడియేషన్ ప్రభావం పిచ్చుకల మనుగడ, సంతతి, ఉత్పత్తిపై లేదని తేలింది. మన దేశంలో 2003 నుంచి సెల్‌ఫోన్ వినియోగం బాగా పెరిగింది. కానీ, అప్పటికే పిచ్చుకల సంఖ్య బాగా తగ్గిపోయింది. పిచ్చుకల జీవనానికి దోహదపడే పరిసరాలు లేకపోవడమే అందుకు కారణం. మన చుట్టూ చెట్లను పెంచుతూ ప్రకృతిని పరిరక్షించాలి. జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో పిచ్చుకలు కీలకపాత్ర పోషిస్తాయి. నా పరిశోధనకు కృష్ణా విశ్వవిద్యాలయం బయో సైన్సెస్ అండ్ బయో టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ లంకా సుశీల చక్కగా గైడ్ చేశారు.

- డాక్టర్ వీరా మహేష్
స్పారో వ్యవస్థాపకులు,
జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా.

'మెగా' ప్రీవెడ్డింగ్ వేడుకలు ప్రారంభం

వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠిల ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ శుక్రవారం సాయంత్రం చిరంజీవి నివాసంలో జరిగాయి. కొణిదెల కుటుంబ సభ్యులందరూ ఈ వేడుకలో పాల్గొని సందడి చేశారు. కొత్త జంటకు అభినందనలు తెలిపారు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను తాజాగా చిరంజీవి నెట్టింట షేర్ చేశారు. 'వరుణ్‌తేజ్ లావణ్యల ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిన్న సాయంత్రం వేడుకగా జరిగాయి' అని ఆయన పేర్కొన్నారు. నిశ్చితార్థం మాదిరిగానే పెళ్లి కూడా సింపుల్‌గా ఉంటుంది" అని వరుణ్‌తేజ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెలలోనే వీరి పెళ్లి జరగొచ్చునని తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అతి తక్కువమంది బంధువుల సమక్షంలో వీరి వివాహ వేడుక ఉండొచ్చని సమాచారం.

'భరతనాట్యం' టీజర్ విడుదల

'దొరసాని' చిత్రం తెరకెక్కించిన కేవీఆర్ మహేంద్ర తాజా ప్రాజెక్టు 'భరతనాట్యం'. 'ఈజ్ ది మోస్ట్ బ్యూటీఫుల్ ఫ్రాడ్ ఇన్ ది వరల్డ్' అనేది ఉపశీర్షిక. 'పోకిరి', 'అర్జున్ రెడ్డి', 'కేజీఎఫ్' వంటి చిత్రాలకు టైటిల్ పోస్టర్ డిజైన్ చేసిన సీనియర్ గ్రాఫిక్ డిజైనర్ ధని ఏలే తనయుడు సూర్య తేజ ఏలే ఈ సినిమాతో టాలీవుడ్‌కి పరిచయం అవ్వబోతున్నాడు. మీనాక్షి గోస్వామి కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి టీజర్ విడుదలచేశారు. సినిమాలంటే పిచ్చి ఉన్న ఓ యువకుడు దర్శకుడు కావాలనుకొనే కథ ఇదని టీజర్ చూస్తే తెలుస్తోంది. క్రైమ్ కామెడీ జానర్‌లో రానున్న ఈ సినిమాలో వైవా హర్ష, హర్షవర్ధన్, అజయ్ ఘోష్, సలీం ఫేకు, గంగవ్వ, కృష్ణుడు, టెంపర్ వంశీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు.



రెండు భాగాలుగా హరిహరమల్లు

పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం రెండు భాగాలుగా రానుందని చిత్ర ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఈ చిత్రం 60 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. పీరియాడికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దర్శకుడు క్రిష్ కూడా ఈ చిత్రాన్ని రెండు పార్టులుగా తెరకెక్కించాలని భావిస్తున్నారట. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. అయితే దీనిపై నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. బాబీ డియోల్, విక్రమ్‌జిత విర్క్, నోరా ఫతేహి కీలక పాత్రధారులు. ఎ.ఎంరత్నం నిర్మిస్తున్నారు.

'ఆర్టిస్ట్' మూవీ ఫస్ట్ గ్లింప్స్ విడుదల



సంతోష్ కల్వచెర్ల, క్రిషిక పటేల్ హీరో హీరోయిన్లుగా ఎస్ జె కె ప్రొడక్షన్స్ బ్యానర్ పై జేమ్స్ వాట్ కొమ్ము నిర్మిస్తున్న సినిమా 'ఆర్టిస్ట్'. ఈ సినిమాను దర్శకుడు రతన్ రిషి రూపొందిస్తున్నారు. తణికెళ్ల భరణి, సత్యం రాజేశ్, ప్రభాకర్, వినయ్ వర్మ, భద్రం, తాగుబోతు రమేష్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ తుది దశలో ఉంది. ఫస్ట్‌గ్లింప్స్‌ని హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు.

కసరత్తుల్లో పూజాహెగ్డే

దర్శకుడు పూరీ జగన్నాథ్ నిర్మిస్తున్న యాక్షన్ చిత్రం 'జనగణమన'. ఈ సినిమాలో పూజాహెగ్డే నటిస్తున్నారు. ఈ సినిమా కోసం హెగ్డే ప్రస్తుతం బాక్సింగ్, మిక్స్ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. జిమ్‌లో కఠిన కసరత్తులు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.

ఓటీటీలో 'జవాన్'



షారుక్ ఖాన్, నయనతార, దీపిక పడుకొనే, ప్రియమణి ప్రధాన తారగణంగా తెరకెక్కిన 'జవాన్' చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో నవంబర్ 2నుంచి స్ట్రీమింగ్ కానుంది. తాజా సమాచారం ప్రకారం ఓటీటీ కట్ వెర్షన్ మరోలా ఉండబోతుందని తెలుస్తోంది. సెన్సార్ కత్తెర పడిన చాలా సీన్స్‌ను ఓటీటీ వెర్షన్‌లో యాడ్ చేస్తున్నట్లు సమాచారం. హిందీ మీడియా టాక్ ప్రకారం ఈ సినిమా ఓటీటీ లెంగ్త్ 3 గంటల పైమాటే. థియేటర్‌లో ఈ సినిమా 2 గంటల 45 నిమిషాల నిడివితో రిలీజైంది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు అట్లీ దర్శకత్వం వహించారు. షారుఖ్ తండ్రి, కొడుకులా ద్విపాత్రాభినయం చేశారు.

19వ ఆసియా క్రీడల్లో 107 పతకాలు



వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ(స్వర్ణం), అతిథి(కాంస్యం) ; అభిషేక్ వర్మ(స్వర్ణం)

కబడ్డీలో బంగారు పతకాలు సాధించిన పురుషుల, మహిళల జట్లు

బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో పసిడి నెగ్గిన సాత్విక్-చిరాగ్

- **28బంగారు, 38రజత, 41కాంస్యాలు**
- **చివరిరోజు 6స్వర్ణాలు**
- **నేడు ముగింపు వేడుకలు**

హాంగ్జౌ: 19వ ఆసియా క్రీడల్లో భారత్ నయా చరిత్ర నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో 107 (28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు) అత్యధిక పతకాలను సాధించింది. 'సెంచరీ' పతకాలే లక్ష్యంగా ఈ క్రీడల బరిలోకి దిగిన భారత్ ఆ ఫీట్‌ను అందుకోవడం హర్షించదగ్గ విషయం. ఇక ఇండోనేషియా వేదికగా 2018లో జరిగిన జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ 70(16స్వర్ణ, 23రజత, 31కాంస్య) పతకాలతో 8వ స్థానంలో నిలువగా.. ఈసారి 107పతకాలతో నాల్గో స్థానానికి ఎగబాకింది. ఇక చైనా 382 పతకాలతో (200స్వర్ణాలు, 111రజతాలు, 71కాంస్యాలు) అగ్రస్థానంలో నిలువగా.. జపాన్ 186 పతకాలు (51 స్వర్ణాలు, 66 రజతాలు, 69 కాంస్యాలు), ద. కొరియా 190 పతకాలు (42 స్వర్ణాలు, 59 రజతాలు, 89 కాంస్యాలు) టాప్-3లో నిలిచాయి.

ఒకేరోజు ఆరు స్వర్ణాలు...

చివరి రోజు భారత్‌కు ఏకంగా 6 స్వర్ణ పతకాలు దక్కాయి. కబడ్డీలో మహిళల, పురుషుల జట్లు, పురుషుల క్రికెట్, బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో చిరాగ్-సాత్విక్, కాంపౌండ్ ఆర్చరీలో ప్రవీణ్ ఓజాస్, వ్యక్తిగత విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. అలాగే ఆర్చరీలో అభిషేక్ వర్మ రజత, అదితి కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. మహిళల హాకీ జట్టు 2-1 గోల్స్ తేడాతో జపాన్‌ను ఓడించి కాంస్య పతకాన్ని ముద్దాడగా.. రెజ్లింగ్‌లో దీపక్ పునియా ఫైనల్లో ఓడి రజత పతకానికే పరిమితమయ్యాడు.

మహిళల హాకీ జట్టుకు కాంస్యం

జట్టు ఫైనల్లో చైనీస్ తైపీని ఓడించి స్వర్ణ పతకాన్ని సాధించడం ద్వారా ఈ ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాల సంఖ్య 100 మార్క్‌కు చేరింది.

ప్రముఖుల శుభాకాంక్షలు..

ఈసారి ఆసియా క్రీడల్లో వందకు పైగా పతకాలు సాధించిన భారత అథ్లెట్లకు భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువురు ప్రముఖులు ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అద్భుత ప్రదర్శన కనబర్చిన అథ్లెట్లకు ఆతిథ్యమివ్వాలని, వారితో సంభాషించేందుకు ఆతృతతో ఎదురుచూస్తున్నానని ప్రధాని ట్వీట్ చేయగా.. సెంచరీ పతకాలే లక్ష్యంగా వెళ్లిన అథ్లెట్లు ఆ ఫీట్ చేరుకోవడం హర్షిందగ్గ విషయమని క్రీడల శాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈసారి ఆసియా క్రీడల్లో నయా చరిత్ర సృష్టించారని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ట్వీట్‌లో పేర్కొనగా.. సెంచరీ మార్క్‌ను అందుకోవడంలో మహిళా అథ్లెట్లు కీలకపాత్ర పోషించారని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్‌లో అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా రికార్డుల హోరు..

న్యూఢిల్లీ: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జట్టు మూడు రికార్డులు నెలకొల్పింది. వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక స్కోర్‌తో పాటు ఒకే మ్యాచ్‌లో ముగ్గురు బ్యాటర్స్ సెంచరీలు చేయడం, 49బంతుల్లోనే మార్‌క్రమ్ శతకం రికార్డులను దక్షిణాఫ్రికా నెలకొల్పింది. అరుణ్‌జైట్లీ మైదానంలో శనివారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఈ రికార్డులను సాధించింది. గతంలో ఐర్లాండ్ ఆటగాడు ఓబ్రయాన్ 2011 వరల్డ్‌కప్‌లో ఇంగ్లాండ్‌పై 50 బంతుల్లో శతకం బాదాడు. ఇక వన్డేల్లో వేగంగా సెంచరీ చేసిన రికార్డు ఏబీ డివిలియర్స్ పేరిట పదిలంగా ఉంది. అతడు కేవలం 31 బంతుల్లోనే 100 పరుగులు సాధించాడు. ఇక తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 428 పరుగులు చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (100) డస్సెన్(110), మార్‌క్రమ్ (106) సెంచరీలతో కదం తొక్కి మరో రికార్డును నెలకొల్పారు. ఛేదనలో శ్రీలంక 44.5 ఓవర్లలో 326పరుగులకు ఆలౌటైంది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 102పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 6వికెట్ల తేడాతో ఆఫ్ఘనిస్తాన్‌ను చిత్తుచేసింది. ఆఫ్ఘనిస్తాన్ 37.2 ఓవర్లలో 156పరుగులకు ఆలౌట్ కాగా.. బంగ్లాదేశ్ జట్టు 34.4 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 158పరుగులు చేసి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మెహిదీ హసన్‌కు లభించింది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు.. భారత్ × ఆస్ట్రేలియా (వేదిక: చెన్నై; మ.2.00గం॥లకు)

పతకాల పట్టిక

వ.స.	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	200	111	71	382
2.	జపాన్	51	66	69	186
3.	ద.కొరియా	42	59	89	190
4.	ఇండియా	28	38	41	107
5.	ఉజ్బెకిస్తాన్	22	18	31	71
6.	చైనీస్ తైపీ	18	20	28	66
7	ఇరాన్	13	21	19	53
8.	థాయ్‌లాండ్	12	14	32	58
9.	బహ్రైయిన్	12	2	5	20
10.	ఉ.కొరియా	11	18	10	29

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68